fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 60 | విజయవాడ, శుక్రవారం 2 మార్చి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00



రుణాలు ప్రియం

- వడ్డీ రేట్లు పెంచిన ఎస్‌బిఐ
- అదే బాటలో పిఎన్‌బి
- తక్షణమే అమలు

6



సిరియాలో జరుగుతోంది?

3

కేంద్ర, రాష్ట్రాలు కలిసి ముంచాయి

- విభజన హామీలపై జెఎఫ్‌సి నివేదిక • రేపు అధికారికంగా విడుదల



నివేదిక వివరాలను పవన్ కల్యాణ్‌కు వివరిస్తున్న జయప్రకాశ్ నారాయణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విభజన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కలిసి ప్రజలను ముంచాయని జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ (జెఎఫ్‌సి) తేల్చింది. హోదా, విభజన హామీలను అమలు చేయడంలో రెండు ప్రభుత్వాలూ నిర్లక్ష్యంగా వ్యవహరించి నట్లుగా పేర్కొంది. ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలబెట్టుకోలేక పోయినట్లు నివేదికలో అభిప్రాయపడింది. గురువారం సాయంత్రం జెఎఫ్‌సి కమిటీ ప్రత్యేకంగా భేటీ అయ్యింది. కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి పద్మనాభయ్య, లోక్ సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ, ఆంధ్రప్రదేశ్ మాజీ సిఎస్ ఐ.వై.ఆర్.కృష్ణా రావు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, మాజీ ఐఎఎస్ అధికారి తోట చంద్ర శేఖర్, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. కమిటీ తుది నివేదిక రూపకల్పనపై విస్తృతంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ముసాయిదా నివేదికను కమిటీ సభ్యులు పవన్‌కు అందజేశారు. అయితే తుది నివేదికపై శుక్రవారం మరోసారి చర్చలు జరిపి ఈనెల 3న నివేదికను ప్రజల ముందుంచాలని నిర్ణయించారు.

విభజన హామీల అమలు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను తప్పుపట్టినట్లు తెలిసింది. పార్లమెంటు సాక్షిగా ప్రధాని మన్మోహన్ సింగ్ ఇచ్చిన ప్రత్యేక హోదా హామీ విషయంలో బిజెపి, టిడిపిలు ప్రజలను తప్పుదారి పట్టించినట్లు నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. హోదా స్థానంలో ఇస్తామన్న ప్రత్యేక ప్యాకేజీని ఇంతవరకు అమలు చేయలేదని, బడ్జెట్‌లో ఇచ్చిన నిధులు సాధారణంగా అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్లుగానే ఇచ్చారని కమిటీ తేల్చినట్లు తెలుస్తోంది. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇచ్చే విషయంలోనూ కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఎటువంటి ప్రయోజనాలూ చేకూర్చలేదని స్పష్టం చేసినట్లు తెలిసింది. అలాగే లోటు బడ్జెట్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అడిగిన నిధుల్లోనూ కేంద్రం భారీగా కోత పెట్టిందని నివేదికలో తేల్చినట్లు తెలుస్తోంది. రుణ విమోచన, పెన్షన్, డిస్కంల నష్టాల సర్దుబాటు, వేతన సంఘం బకాయిలు తదితర అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థనల్ని కేంద్రం ఏ మాత్రం పట్టించుకోలేదనే అంశాన్ని కూడా నివేదికలో

మిగతా 9లో



గుంటూరులో జరిగిన సదస్సులో పాల్గొన్న వివిధ పార్టీల నేతలు

హోదానే కావాలి

- రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ఆందోళనలు
- 5 నుండి ఢిల్లీలో నిరసన
- హోదాపై రాజకీయ పార్టీల సదస్సులో వక్తలు
- టిడిపి, బిజెపి మినహా మిగిలిన పక్షాలన్నీ ఏకతాటిపైకి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రానికి హోదా రావాల్సిందేనని, అదే ఫైనలని, దీనికోసం రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా ఆందోళనలు నిర్వహించాలని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి సదస్సులో వక్తలు నిర్ణయించారు. హోదా విషయంలో టిడిపి, బిజెపి మినహా మిగిలిన రాజకీయ పక్షాలన్నీ ఐక్యంగా ఆందోళనలు నిర్వహించనున్నారు. ఐదోతేదీ నుండి ఢిల్లీలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని, ఆంధ్రప్రదేశ్ ప్రజల ఘోషను ఢిల్లీ పార్లమెంటుకు వినపడేలా చేయనున్నారు. గురువారం గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో

మిగతా 9లో

7న విద్యుత్ కార్మికుల ‘చలో విద్యుత్ సౌధ’

- నేటి నుంచి రిలే, నిరవధిక నిరాహార దీక్షలు
- ఎమ్మెల్యేలు, మంత్రుల ఇళ్ల ముందు ధర్నాలు, వంటా వార్పు
- భవిష్యత్ కార్యాచరణ వెల్లడించిన ఐక్య వేదిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మెను మరింత ఉధృతం చేసేందుకు భవిష్యత్ కార్యాచరణను ఎపి విద్యుత్ కార్మికుల రాష్ట్ర ఐక్య వేదిక ప్రకటించింది. విజయవాడ హనుమాన్‌పేటలోని దాసరి భవన్‌లో రాష్ట్ర కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఐక్య వేదిక చైర్మెన్ పి.కాశీమధుబాబు, సెక్రెటరీ జనరల్ ఎం.బాలకాశి వివరాల్ని వెల్లడించారు. మార్చి 2, 3 తేదీల్లో అన్ని జిల్లా కేంద్రాలు, జెన్‌కో ప్రాజెక్టుల వద్ద రిలే, నిరవధిక నిరాహార దీక్షలు, అదేవిధంగా స్థానికంగా ఉన్న ఎమ్మెల్యేలు, మంత్రుల ఇళ్ల ముందు ధర్నాలు, వంటా వార్పు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 4 నుంచి రాష్ట్ర స్థాయిలో నిరవధిక నిరాహార దీక్షలు విజయవాడలోని అలంకార్ సెంటర్‌లో ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ దీక్షలో రాష్ట్ర అగ్రనాయకత్వం పాల్గొంటుందన్నారు. జిల్లాల్లోని ఐక్య వేదిక నేతలు అదే రోజు నిరవధిక నిరాహార దీక్షల్ని ఆయా జిల్లాల్లోనే చేపట్టాలని సూచించారు. 7న ‘చలో విద్యుత్ సౌధ’ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఐక్య వేదిక నిర్ణయించింది. కాంట్రాక్ట్ కార్మికులు కుటుంబ సభ్యులతో సహా ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ముందస్తు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల విషయంలో

మిగతా 9లో

నేటి నుంచి వేలాది థియేటర్ల మూత



మీడియా సమావేశంలో మాట్లాడతున్న డి సురేష్‌బాబు



హైదరాబాద్ బ్యూరో్ :

డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల తీరును నిరసిస్తూ ఈనెల 2 నుంచి ఐదు రాష్ట్రాల్లో సినిమా థియేటర్ల బంద్ పాటించాలని దక్షిణాది రాష్ట్రాల సినిమా నిర్మాతల మండలి ఐకాస నిర్ణయించింది. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళలో థియేటర్లను బంద్ చేస్తున్నట్టు ఐకాస ఛైర్మన్ డి.సురేష్‌బాబు గురువారం వెల్లడించారు. ఈ రోజు దక్షిణాది నిర్మాతల మండలి ఐకాస ఫిలింఛాంబర్‌లో సమావేశమైంది. అనంతరం సురేష్ బాబు విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన విలేకరులకు వెల్లడించారు. ఐదు రాష్ట్రాల నిర్మాతల మండలి సంయుక్తంగా ఐకాస ఏర్పాటుచేసుకున్నామని ఆయన చెప్పారు. ఆంగ్ల సినిమాలకు వర్చువల్ ప్రింట్ ఫీజు వసూలు చేయడంలేదని, డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు ప్రాంతీయ చిత్రాలకు వీపీఎఫ్ తగ్గించట్లేదన్నారు. వాటిని తగ్గించే వరకు థియేటర్ల బంద్ కొనసాగుతుం దని స్పష్టంచేశారు. ఇందుకోసం ఐదు రాష్ట్రాల్లోని నిర్మాతలు, పంపిణీదారులు కూడా మద్దతు ఇచ్చారని తెలిపారు. దీనివల్ల వేలాది థియేటర్లలో ఎగ్జిబిటర్లకు ఫీడింగ్ వుండదని ఇది స్వచ్ఛంధంగా తీసుకున్న నిర్ణయమని పేర్కొన్నారు.

నేడు కృష్ణా బోర్డు వర్కింగ్ గ్రూప్ సమావేశం

నీటి కేటాయింపులే ప్రధాన ఎజెండా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కృష్ణా బోర్డు వర్కింగ్ గ్రూప్ సమావేశం శుక్రవారం జరుగనుంది. బోర్డు సభ్య కార్యదర్శి ఎ. పరమేశం, రెండు రాష్ట్రాల ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు ఈ సమావేశానికి హాజరు కానున్నారు. 2017-18 నీటి సంవత్సరానికి తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు నీటి కేటాయింపులు జనవరి 8న జరిగిన బోర్డు సమావేశంలోనే జరిగినప్పటికీ తాజా అవసరాలను పరిగణలోకి తీసుకుని మళ్లీ కేటాయింపులు చేసే అవకాశముంది. రాబోయే కాలానికి అవసరమైన నీటి ఇండెంట్‌ను ఇవ్వాలని ఇప్పటికే రెండు రాష్ట్రాలను కృష్ణా బోర్డు కోరింది. జనవరిలో జరిగిన సమావేశంలో ఏపీకి 60, తెలంగాణకు 50 టీఎంసీల నీటిని కేటాయిస్తూ బోర్డు తీర్మానించింది. బోర్డు పరిధిలో ఉన్న నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నుంచి ఈ నీటిని వినియోగించుకోవాల్సి ఉంది. అయితే ఏపీ ఇప్పటికే 62.32 టీఎంసీల నీటిని వినియోగించుకోగా, తెలంగాణ 33.50 టీఎంసీల నీటిని వినియోగించుకుంది. మరో 16.42 టీఎంసీల నీటిని వినియోగించుకునే హక్కు తమకుందని తెలంగాణ డిమాండ్ చేస్తూ కృష్ణా బోర్డుకు లేఖరాసింది. ఏపీ అధికంగా నీటిని వాడుకుంటోందని ఫిర్యాదు చేసింది. దీంతో బోర్డు ఏపీ నీటి వాడకాన్ని పరిగణలోకి తీసుకుంటూ నాగార్జున సాగర్ నుంచి నీటి విడుదలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. కానీ తమకు కేటాయించిన నీటినే వాడుకుంటున్నామని ఏపీ అధికారులు స్పష్టం చేస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో తాజా ఇండెంట్‌ల ప్రకారం దీర్ఘ, స్వల్పకాలిక నీటి కేటాయింపులు చేయాలని బోర్డు అధికారులు నిర్ణయించారు. సాగర్, శ్రీశైలం డ్యాంలలో డెడ్ స్టోరేజీ స్థాయికి కేవలం 36.18 టీఎంసీల నీరు మాత్రమే ఉండటంతో రాబోయే వర్షాకాలం వరకూ ఈ నీటిని

మిగతా 9లో

మళ్లీ గన్నవరం - కడప విమాన సర్వీసు




ప్రజాశక్తి - గన్నవరం (విజయవాడ)/కడప

విజయవాడ నుంచి కడప మధ్య వేగంగా ప్రయాణించడానికి ట్రూజెట్ నూతన విమాన సర్వీసు దోహదపడుతుందని గన్నవరం విమానాశ్రయ డైరెక్టర్ మధుసూధనరావు తెలిపారు. గన్నవరం విమానాశ్రయంలో గురువారం ఉదయం 8 గంటలకు కడప వెళ్లే విమాన సర్వీసును ఆయన లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. కడపకు ట్రూజెట్ గతంలోఉడాన్ పథకంలో భాగంగా సర్వీసులను నడిపినట్లు చెప్పారు. ఆ పథకానికి కాలపరిమితి ముగియడంతో కొద్దికాలం సర్వీసులు నిలిచిపోయాయనీ, మళ్లీ ఇపుడు కేంద్రం అనుమతితో సర్వీసు అందుబాటులోకి తీసుకొచ్చిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రూజెట్ స్టేషన్ మేనేజర్ కిరణ్‌రాజు, సేల్స్, మార్కెటింగ్ మేనేజర్ శ్రీహర్షలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రయాణికులకు బోర్డింగ్ పాస్‌లందించారు. 42 మంది ప్రయాణికులతో విమానం కడప వెళ్లి తిరిగి 9 గంటలకు 57మందితో వచ్చింది.

ఏడాదిలోగా 2500 మీటర్లకు రన్‌వే విస్తరణ

విజయవాడ నుండి కడపకు తిరిగి ప్రయాణమైన విమాన సర్వీసును కడప ఎయిర్‌పోర్టు డైరెక్టర్ పూసర్ల శివప్రసాద్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉడాన్ పథకంలో విజయవాడకు విమాన సర్వీసును ప్రారంభించినట్లు చెప్పారు. మార్చి 31న ఎయిర్‌ఏషియా ద్వారా చెన్నై-కడప-చెన్నై విమాన సర్వీసు నడపనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం కడప ఎయిర్‌పోర్టులో 1719 మీటర్ల పొడవునా రన్‌వే ఉందని, దాన్ని రూ.100 కోట్లతో 2019 మార్చి నాటికి 2500 మీటర్ల పొడవు, 45 మీటర్ల వెడల్పుతో విస్తరణ పనులను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ భవనాన్ని విస్తరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రూజెట్ ఆపరేషన్స్ హెడ్ ప్రసాద్, ఎయిర్‌పోర్టు ఎటిసి ఇన్‌ఛార్జి నారాయణ, సెక్యూరిటీ ఇన్‌ఛార్జి అశోక్‌రెడ్డి, ఎయిర్‌పోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.



బహుముఖ ప్రజ్ఞాశాలి నాయుని కృష్ణమూర్తి కన్నుమూత

ప్రజాశక్తి - చిత్తూరు ప్రతినిధి, చౌడేపల్లి

ప్రముఖ రచయిత, బహుముఖ ప్రజ్ఞాశాలి నాయుని కృష్ణమూర్తి (67) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన సొంతూరు చిత్తూరు జిల్లా గుర్రంకొండ మండలం నడించెర్ల. 1951లో జన్మించిన నాయుని కృష్ణమూర్తి ప్రముఖ తెలుగు రచయితగా, సాహితీ పరిశోధకుడిగా గుర్తింపు పొందారు. ఎన్నో పుస్తకాలను, గేయాలను రచించిన కృష్ణమూర్తి చౌడేపల్లిలో విజయవాణి విద్యాసంస్థలను స్థాపించి ˜సాహితీ యజ్ఞాన్ని కొనసాగించారు. ఏడో తరగతి విద్యార్థుల కోసం మాబడి, 10వ తరగతి విద్యార్థుల కోసం పాఠశాల పేర్లతో ఆయన నేతృత్వంలో రూపొందిన పుస్తకాలు తెలుగునాట బహుళ ప్రాచుర్యం

మిగతా 9లో

రెరాపై అవగాహన అవసరం

పట్టణ ప్రణాళికా విభాగం డైరెక్టరు వి రాముడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్థిరాస్థి ప్రాజెక్టుల డెవలపర్లకు, వినియోగదారులకు రియల్ ఎస్టేట్ రెగ్యులేటింగ్ ఆథారిటీ (రెరా) చట్టంపై అవగాహన అవసరమని రాష్ట్ర పట్టణ ప్రణాళికా విభాగం డైరెక్టరు వి రాముడు తెలిపారు. డిటిసిపి కార్యాలయంలో నిర్వహించిన లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రెరా చట్టంపై అవగాహన కల్పించేందుకు భవన నిర్మాణ రంగ నిపుణులు కృషి చేయాలని ఆయన సూచించారు. రెరా డైరెక్టర్ సిహెచ్‌వి సాంబశివరావు మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు సంబంధించిన కార్యాచరణ ప్లానులతోనే ప్రారంభమవుతున్నందున, లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ రెరా చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రెరా చట్టం ప్రకారం రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల ప్లానులలో ప్రకటించిన సౌకర్యాలు, వివరాలు 100 శాతం అమలు చేయాల్సి ఉంటుందన్నారు.

చెక్కుల పంపిణీ

ఉండవల్లిలోని గ్రీవెన్స్‌హాల్‌లో గురువారం అగ్రిగోల్డ్ బాధితులకు రూ.5 కోట్ల విలువైన చెక్కుల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు పంపిణీ చేశారు. ఒక్కొక్కరికీ రూ.5 లక్షల చొప్పున వందమందికి చెక్కులు అందించారు.



ప్రయివేటులో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దు

అగ్రిగోల్డ్ బాధితులకు చెక్కుల పంపిణీలో సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎక్కువ వడ్డీలిస్తామని, రెండేళ్లలో రెట్టింపు చేస్తామని చెప్పే ప్రచారాలతో ప్రయివేటులో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. ఉండవల్లిలోని గ్రీవెన్స్‌హాల్‌లో గురువారం అగ్రిగోల్డ్ బాధితులకు రూ.5 కోట్ల విలువైన చెక్కుల్ని ఆయన పంపిణీ చేశారు. ఒక్కొక్కరికీ రూ.5 లక్షల చొప్పున వంద మందికి చెక్కులు అందించారు. ఎటువంటి నిబంధనలున్నా అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామన్నారు. ప్రభుత్వ బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకోవాలని కోరారు. సంస్థల కార్యకలాపాలపై నిఘా ఉంచామని, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ఆస్తుల్ని జప్తు చేసి మరీ చెల్లిస్తామన్నారు. తప్పుడు పనులు చేసే వారిని ఉపేక్షించనన్నారు. పేదలు కోర్టులకు వెళ్లి వ్యయప్రయాసలకు లోనవుతున్నారన్నారు. అగ్రి బాధితులకు చెల్లింపులు చేసే బాధ్యత తీసుకుంటామని, తమది పేదలకు అండగా ఉండే ప్రభుత్వమని అన్నారు. కార్యక్రమంలో ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీశ్ చంద్ర, డిజిపి ఎం మాలకొండయ్య, ముఖ్యమంత్రి కార్యదర్శి గిరిజా శంకర్, అడిషనల్ డిజిపి ద్వారకా తిరుమలరావు, సిఐడి ఎస్పీ ఉదయ్‌భాస్కర్, అడిషనల్ ఎస్పీ ఎస్ త్రిమూర్తులు పాల్గొన్నారు. అంతకుముందు అగ్రిగోల్డ్ ఫెడరేషన్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలు సిఎంను కలిసారు. సిఎంను కలిసిన వారిలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షులు బి విశ్వనాథరెడ్డి, ప్రధాన కార్యదర్శి వి తిరుపతిరావు, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఇవి నాయుడు, ఉప ప్రధాన కార్యదర్శి బివి చంద్రశేఖరరావు ఉన్నారు.



మరో రెండు నెలల్లో వడగాల్పులు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

ఫిబ్రవరి నెలాఖరు, మార్చి తొలి వారంలో గతంలో ఎన్నడూ లేనంతగా రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. మార్చి, ఏప్రిల్‌ల్లో మరింత ప్రతాపం చూపించే అవకాశాలున్నాయి. ఏప్రిల్ చివర్లో వడగాల్పులు తాకిడి ఎక్కువగా ఉంటుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. మే మాసంలో వర్షాలు కురిసే వరకు ఎండల తీవ్రత కొనసాగుతుందని చెబుతున్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమలో ఎండల తీవ్రత మొదలైంది. కర్నూలు, నంద్యాలలో బుధవారం 38, కడప, అనంతపురంలో 37 డిగ్రీల చొప్పున నమోదయ్యాయి. దక్షిణ కోస్తాలోనూ ఇదే పరిస్థితి. నందిగామలో 37.5, రెంటచింతలలో 37, విజయవాడలో 36.4 డిగ్రీలు నమోదయ్యాయి.



ప్రజ్ఞ

1. వ్యర్థ జలాలతో విద్యుత్‌ను ఉత్పత్తిచేసే పర్యావరణహిత బ్యాటరీని ఏ ఐఐటీ చెందిన పరిశోధకులు అభివ ద్ధి చేశారు ?
2. 'బాల్ ఆధార్' పేరుతో నీలి రంగు ఆధార్ కార్డులను ఎవరికి జారీ చేస్తారు?
3. 30 ఏళ్ళుగా తీర రక్షణ విధులు నిర్వర్తించిన ఏ నౌకకు ఇటీవల వీడ్కోలు పలికారు?
4. ఇటీవల ముగిసిన వింటర్ ఒలింపిక్స్‌లో అత్యధిక పతకాలను గెలుచుకున్న దేశం?
5. రాజ్యసభ టీవీ ఎడిటర్‌గా నియమితులైన వ్యక్తి ?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006


ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక,
ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4,
గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

రివర్స్ బడ్జెట్

- ఖర్చుల మేరకు ఆదాయపు లెక్కలు
- బ్యాలన్స్ తప్పుతోందంటూ అధికారుల ఆందోళన
- సర్దుకుపొమ్మంటున్న నేతలు
- ఎన్నికల ఏడాది కావడమే కారణం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

సాధారణంగా ఎంత ఆదాయం వస్తుందో చూసుకుని, దాని కనుగుణంగా ఖర్చుల జాబితాను రూపొందించుకుంటాం. సగటు కుటుంబంలోనైనా, ప్రభుత్వాల స్థాయిలోనైనా జరిగేదిదే! ప్రతి ఏడాది రాష్ట్ర బడ్జెట్ కసరత్తు కూడా ఇదే మాదిరి జరుగుతుంది. ఈ ఏడాది మాత్రం దానికి భిన్నమైన పరిస్థితి నెలకొంది. చేయాల్సిన ఖర్చులను ముందుగా నిర్ణయించుకుని, ఆ మేరకు ఆదాయాన్ని పెంచి చూపే విన్యాసానికి ప్రభుత్వం సిద్ధమౌతోంది. ఆదాయాన్ని కృత్రిమంగా పెంచి చూపే ఈ ప్రక్రియ ద్వారా బడ్జెట్ ప్రతిపాదనల్లో అంకెలగారడి సాధ్యపడవచ్చు కాని, ఆచరణలో బ్యాలన్స్ తప్పుతుందన్న ఆందోళన ఉన్నతస్థాయి అధికారవర్గాల్లో వ్యక్తమవుతోంది. ఇదే విషయాన్ని ఒకరిద్దరు అధికారులు ప్రభుత్వ పెద్దల ముందు ఉంచితే ఈ ఏడాదికి సర్దుకుపోవాలని, ఇంతకు మించి మరో మార్గం లేదని వారు చెప్పినట్లు తెలిసింది. దీంతో ఉన్నతస్థాయి అధికారులు సైతం తలాడించక తప్పని స్థితి ఏర్పడిందని చెబుతున్నారు. ఎన్నికల ఏడాది కావడం, ప్రజల్లో ఇప్పటికే వ్యతిరేకత పెరుగుతున్నట్లు వస్తున్న నివేదికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ రివర్స్ బడ్జెట్ ప్రక్రియకు తెరతీసినట్లు సమాచారం. 2018-19 సంవత్సరపు బడ్జెట్ సంక్షేమరంగానికి ప్రాధాన్యత ఇస్తుందని ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. దానిలో భాగంగానే 2014 ఎన్నికల సమయంలో ఇచ్చి, ఇప్పటికీ అమలుకానీ హామీలను రానున్న బడ్జెట్‌లో పొందుపరచడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. యువత, మహిళలు, మైనార్టీలకు ఇచ్చిన అనేక హామీలకు బడ్జెట్‌లో కేటాయింపులు చూపాలని నేతలు పట్టుదలతో ఉన్నట్లు సమాచారం. వీటన్నింటికి స్థానం కల్పించాలంటే బడ్జెట్ భారీ సైజులో ఉండాలని, రాష్ట్ర వనరుల ద్వారా ఆదాయం గణనీయంగా పెంచుకోవాలని అధికారులు అంటున్నారు.



ఫైల్ ఫొటో

దీనిని దృష్టిలో ఉంచుకునే రెండు లక్షల కోట్ల రూపాయల మేరకు బడ్జెట్‌ను పెంచుతామని గతంలోనే యనమల రామకృష్ణుడు ప్రకటించారు. అయితే, అధికారవర్గాల్లో దీనిపై అసంతృప్తి వ్యక్తమౌతోంది. ఆ మేరకు రాష్ట్రంలో ఆదాయవనరులు లేవని చెబుతున్నారు. ఇదే విషయాన్నా మంత్రి దృష్టికి కూడా తీసుకువెళ్లినట్లు సమాచారం. అయితే, ముఖ్యమంత్రితో పాటు, ఆర్థికశాఖ మంత్రి కూడా హామీలకు స్థానం కల్పించేలా బడ్జెట్‌ను రూపొందించి తీరాలని ఆదేశించడంతో ఏ స్థాయిలో బడ్జెట్ ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

ఇవీ లెక్కలు!

గతేడాది ఆదాయాన్ని పరిశీలిస్తున్న అధికారులు ఈ ఏడాది 1.60 లక్షల కోట్ల రూపాయల కన్నా ఎక్కువ ఆదాయాన్ని సమీకరించడం కష్టమేనని తేల్చిచెబుతున్నారు. రాష్ట్ర సొంత పన్నులను కూడా స్వల్పంగానే పెంచడం సాధ్యమవుతుందని, అలాగే కేంద్రం నుంచి నిధులు తగ్గిపోతున్నాయని, అందుకే రూ.1.60 లక్షల కోట్ల కన్నా ఎక్కువ సాధ్యం కాదన్న భావాన్ని ఆర్థికశాఖ ఉన్నత స్థాయి సమావేశాల్లో స్పష్టం చేసినట్లు తెలిసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1.56 లక్షల కోట్ల రూపాయలను ఖర్చుగా చూపించగా, దానిని సవరణ అంచనాల్లో 1.73 లక్షల కోట్లకు మార్చాలని ప్రతిపాదిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కొత్త బడ్జెట్‌లో ఖర్చు 1.97 లక్షల కోట్లుగా పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో రెవెన్యూ వ్యయమే లక్షన్నర కోట్ల వరకు ఉంటుందని ఒక అంచనా వేస్తున్నారు. మిగిలిన 30 వేల కోట్లకుపైగా మాత్రమే పెట్టుబడి వ్యయంగా ఉంటుందని అంటున్నారు. అయితే ఈ ప్రతిపాదనలపై ఆర్థిక శాఖ, ఆదాయార్జన శాఖలు మాత్రం పెదవి విరుస్తున్నాయి. ఇంత ఆదాయాన్ని సమకూర్చడం ఎలా సాధ్యమన్న ప్రశ్నను సంధిస్తున్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో 1.56 లక్షల కోట్ల వరకు ఆదాయాన్ని ప్రతిపాదించగా, ఇప్పటివరకు కేవలం 1.10 లక్షల కోట్లు మాత్రమే వచ్చింది. ఇక కేవలం 30 రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో అనుకున్న లక్ష్యం కూడా సాధించలేని పరిస్థితిలో కొత్త బడ్జెట్‌లో రెండు లక్షల కోట్ల వరకు ఆదాయం చూపించడం ఎంతవరకు సాధ్యమవుతుందని ఆదాయ వనరులశాఖల అధికారులు ప్రశ్నిస్తున్నారు.

హైకోర్టులో లాయర్ల విధుల బహిష్కరణ

వాయిదాపడిన పలు విచారణలు

ప్రజాశక్తి - హైదరాబాద్

రెండు తెలుగు రాష్ట్రాల హైకోర్టు లాయర్ల సంఘాలు ఏకగ్రీవంగా చేసిన తీర్మానానికి అనుగుణంగా గురువారం లాయర్లు హైకోర్టు విధుల్ని బహిష్కరించారు. ఈ ఆందోళన శుక్రవారం కూడా కొనసాగనుంది. ఏపీ, టీఎస్ హైకోర్టు లాయర్స్ అసోసియేషన్ల అధ్యక్షులు ధనుంజయ, కనకయ్యల సారథ్యంలో న్యాయవాదులంతా హైకోర్టు ఆవరణలోనే ఉన్న బార్ కౌన్సిల్ భవన్ నుంచి మదినా బిల్డింగ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. మదీనా చౌరస్తా వద్ద న్యాయవాదులు కొద్దిసేపు బైఠాయించి నిరసన వెలిబుచ్చారు. లాయర్లు విధులు బహిష్కరించడంతో కోర్టు హాల్స్ వెలవెలబోయాయి. కక్షిదారుల తరఫున వాదించేందుకు న్యాయవాదులు రాకపోవడంతో బెంచ్‌లపై ఆశీనులైన న్యాయమూర్తులు దిగి వెళ్లిపోయారు. కొందరు న్యాయమూర్తులు బెంచ్‌పైనే ఉండటంతో కొందరు న్యాయవాదులు వెళ్లి తాము ఆందోళన చేస్తున్నామని, సహకరించాలని కోరారు. అత్యవసర కేసులకు చెందిన ఒకటి రెండు కేసుల్లో మాత్రమే లాయర్లు వాదనలు వినిపించారు. లాయర్లు వస్తే కేసులు వింటామని, లేనట్లయితే కేసుల్ని కొట్టేయకుండా వాయిదా వేస్తామని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి చెప్పారు. విచారణ జరగాల్సిన కేసులన్నీ వాయిదా పడ్డాయి.

నకిలీ మందుల తయారీదారుల్ని కఠినంగా శిక్షించాలి

పిఎంఎస్‌ఆర్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య

ప్రజాశక్తి - గాంధీనగర్ (విజయవాడ)

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న నకిలీ, కల్తీ, నాసిరకం మందుల తయారీ కంపెనీల యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలని ఎపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యువి.కృష్ణయ్య అన్నారు. ఆ యూనియన్ స్వర్ణోత్సవాల్లో భాగంగా 'ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత' అనే అంశంపై జీపుజాతాను విజయవాడ నగరంలోని సీతారాంపురం, పింగళివెంకయ్య వీధిలో ఉన్న రాష్ట్ర కార్యాలయం వద్ద గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కాపాడ లేని ప్రభుత్వ విధానాలు సమాజానికి ఏమాత్రం ఉపయోగపడవన్నారు. ఏడాది కాలంగా తమ యూనియన్ ఆధ్వర్యంలో జీపుజాతాలు, చైతన్య ర్యాలీలు, సంతకాల సేకరణ, సదస్సులు, రౌండ్‌టేబుల్ సమావేశాలు ఇలా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చామన్నారు. మందుల ధరలు తగ్గించాలని, ప్రభుత్వ రంగ మందుల కంపెనీలను పునరుద్ధరించాలన్నారు. మందులపై, వైద్య పరికరాలపై జిఎస్‌టీని పూర్తిగా ఎత్తి వేయాలన్నారు. బహుళజాతి కంపెనీల ఆధిపత్యానికి కళ్లెం వేయాలని, ఫార్మా రంగంలో విదేశీ పెట్టుబడులను అనుమతించరాదన్నారు. ఈ నెల 10,11 తేదీల్లో కర్నూలులో రాష్ట్రవ్యాప్త జనరల్ కౌన్సిల్ సమావేశం జరగనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిఆర్‌కె రెడ్డి, రాష్ట్ర కోశాధికారి డి.ప్రసాద్, నగర యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జెఎం.సంతోష్, మహేంద్ర, జనరల్ కౌన్సిల్ సభ్యుడు ఎవి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్సులో పరీక్షా కేంద్రానికి వచ్చిన విద్యార్థి

ప్రజాశక్తి - యంత్రాంగం


విజయనగరం జిల్లా చీపురుపల్లిలోని గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి సూరు అమృత్ అనే ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థి వైకల్యం కారణంగా లేవలేని స్థితిలో ఉండడంతో అంబులెన్సులో తల్లిదండ్రులు పరీక్షా కేంద్రానికి తీసుకొచ్చారు. చీపురుపల్లికి చెందిన ఎస్‌విజి శ్రీనివాసరావు, దీప కుమారుడు అమృత్‌కు చిన్నప్పటి నుంచీ కాళ్లు చచ్చుబడిపోగా, చేతులు స్వల్ప స్థాయిలో పని చేస్తున్నాయి. కానీ రాయలేడు. అయినా చదువుపై ఆసక్తితో పాఠశాలకు వీల్‌చైర్‌పై స్నేహితుల సాయంతో వెళ్లేవాడు. ఇటీవల తన తల్లి సపర్యలు చేస్తుండగా కాలు విరిగిపోయింది. దీంతో, పూర్తిగా మంచానికే పరిమితమయ్యాడు. వైద్యులు లేవవద్దని చెప్పినా చదువుపై ఆసక్తితో ఎలాగైనా పరీక్ష రాయాలని పట్టుబట్టాడు. దీంతో, అమృత్‌ను తల్లిదండ్రులు పరీక్షా కేంద్రానికి అంబులెన్సులో తీసుకెళ్లి స్ట్రచర్‌పై లోపల ఉంచారు. సహాయకుడి సాయంతో పరీక్ష రాశాడు. పూసపాటిరేగ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎనిమిది మంది విద్యార్థులకు హాల్‌టికెట్లను కళాశాల యాజమాన్యం చివరి నిమిషం వరకూ ఇవ్వలేదు. రెగ్యులర్‌గా కళాశాలకు రాలేదని, హాజరు శాతం తక్కువగా ఉందని చెప్పి హాల్ టికెట్లు నిలిపివేసింది. దీంతో, వారు స్థానిక ఎంపిటిసి సభ్యులు ఎం.భోగేష్‌తోపాటు తమ తల్లిదండ్రులతో కలిసి కళాశాలకు వెళ్లి నిలదీశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. దాదాపు గంటపాటు చీఫ్ సూపరింటెండెంట్ ఆర్.వి.రమణమూర్తికి, విద్యార్థుల తల్లిదండ్రులకు మధ్య వాగ్వివాదం జరిగింది. చివరికి ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామినాయుడు ఫోన్ చేయడంతో గంట ఆలస్యంగా యాజమాన్యం హాల్ టికెట్లను ఇచ్చింది.

రోడ్డు నిర్మాణానికి మరోసారి యత్నం

అడ్డుకున్న రైతు - అధికారులతో వాగ్వాదం

ప్రజాశక్తి-తుళ్లూరు (గుంటూరు జిల్లా)

సచివాలయం వెనుక రోడ్డు నిర్మాణ రగడ మళ్లీ తలెత్తింది. గురువారం మధ్యాహ్నం రహదారిని నిర్మించేందుకు అధికారులు మరోసారి యత్నించగా రైతు గద్దె మీరాప్రసాద్ అడ్డుకున్నాడు. తాను ల్యాండ్ పూలింగ్‌లో భూమిని ఇవ్వలేదని, కోర్టు స్టే సైతం ఉందని రైతు పేర్కొంటున్నాడు. సిపిఎం, వైసిపి సహా స్థానిక రైతులూ అతనికి మద్దతుగా నిలిచారు. పనుల పర్యవేక్షణకు వచ్చిన డిఇ, ఎఇని వైసిపి మండల అధ్యక్షులు బత్తుల కిషోర్‌తో కలిసి నిలదీశారు. తమకు అనుమతి ఉందని అధికారులు చెప్పగా చూపాలని రైతు డిమాండ్ చేయడంతో వాగ్వాదం తలెత్తింది. కొద్దిసేపటికి అధికారులు, వాహనాలతో వెనుదిరిగారు. అనంతరం రైతు మాట్లాడుతూ రహదారి నిర్మాణానికి ఐదు రోజులుగా యత్నిస్తున్నారని, తన ఆరోగ్య పరిస్థితి సరిగ్గా లేదని, అధికారుల తీరుతో మనశ్శాంతి లేకుండా పోయిందని వాపోయాడు. తనకేమైనా అయితే సిఆర్‌డిఎ, ఎడిసి, ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించాడు. తన పొలంలో రోడ్డును అక్రమంగా వేయడంపై ప్రపంచ బ్యాంకు బృందం, మానవహక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళ్లానని, శుక్రవారం ప్రపంచబ్యాంకు ప్రతినిధులు పరిశీలిస్తారని సమాచారం వచ్చిందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా అధికారుల తీరును సిపిఎం రాజధాని ప్రాంత కార్యదర్శి ఎం.రవి ఖండించారు.



పొలం వద్ద కాపలాగా కూర్చున్న రైతు గద్దె మీరాప్రసాద్

రోజుకు 20 లక్షల పని దినాలు

ఉపాధి లక్ష్యాన్ని చేరుకోవాలి

ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాన్ని పూర్తి చేయాలి : లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ పథకం లక్ష్యమైన 24 కోట్ల పని దినాలు పూర్తి చేయాలని, రోజుకు కనీసం 20 లక్షల పనిదినాలు కల్పించాలని మంత్రి నారా లోకేష్ అధికారులకు సూచించారు. ఇందుకు 24 రోజులు మాత్రమే గడువు ఉందని పేర్కొన్నారు. సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభి వృద్ధి శాఖ, నెడ్ క్యాప్, ఈఈఎస్‌ఎల్, సీడ్కో అధికారులతో గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో 150 రోజుల పనిదినాలు కల్పించాలనే డిమాండ్ ఉందని, ఈ అంశంపై కేంద్రానికి లేఖ రాయనున్నట్లు చెప్పారు. కేంద్రం గుర్తించిన 80 కరువు మండలాల్లో 50 రోజులు అదనంగా పని కల్పించాలని ఆదేశాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ల నియామకం వెంటనే పూర్తి చేయాలన్నారు.



నెలాఖరులోగా 7 లక్షల ఎల్‌ఈడి దీపాలు

నెడ్ క్యాప్, ఈఈఎస్‌ఎల్ సంస్థలు ఈ నెలాఖరులోగా 7 లక్షల ఎల్‌ఈడి వీధి దీపాలు ఏర్పాటు పూర్తి చేయాలని మంత్రి లోకేష్ అధికారుల్ని ఆదేశించారు. ఈఈఎస్‌ఎల్‌కు కేటాయించిన ఐదు జిల్లాల్లో ఇప్పటి వరకూ 2,39,105 ఎల్‌ఈడి వీధి దీపాలు ఏర్పాటు చేశామని, 2,068 సిసిఎంఎస్ బాక్సులతో అనుసంధానం చేశామని మంత్రికి అధికారులు వివరించారు. నెడ్ క్యాప్‌కు కేటాయించిన ఎనిమిది జిల్లాల్లో ఏర్పాటు చేసిన దీపాలను సిసిఎంఎస్ బాక్సులతో అనుసంధానం చేయాలని మంత్రి సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ రామాంజనేయులు, జాయింట్ కమిషనర్ బాలసుబ్రమణ్యం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేకం

నయ వంచకులు

- రంగుల కల.. అథ:పాతాళానికి వల...!
- ఆందోళనకర రీతిలో హ్యూమన్ ట్రాఫికింగ్
- ప్రతి నలుగురు బాధితుల్లో ఒకరు మనవారే..!!
- అధ్యయనాలకే పరిమితమవుతున్న కమిటీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మానవ అక్రమ రవాణా (హ్యూమన్ ట్రాఫికింగ్) రాష్ట్రంలో ఆందోళనకర స్థాయిలో పెరిగింది. పేదరికానికి తోడు తెలిసీ తెలియని వయసులో చేసే చిన్న చిన్న తప్పిదాలు బాలికలు, మహిళల పాలిట శాపంగా మారుతున్నాయి. ప్రేమ పేరుతో నయ వంచనకు గురవుతున్న వారు కొందరైతే, అందమైన జీవితం, ఉద్యోగాల పేరిట మోస పోతున్నవారు మరెందరో ఉన్నారు. వారు కంటున్న రంగుల కలలు అధ:పాతాళానికి తోసేస్తున్నాయి. దేశవ్యాప్తంగా అక్రమ రవాణాకు గురవుతున్న బాధితుల్లోని ప్రతి నలుగురులో ఒకరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఉంటున్నట్లు అధికారిక నివేదికలే స్పష్టం చేస్తున్నాయి. మహిళల అక్రమ రవాణా, మిస్సింగ్ కేసులకు సంబంధించి దేశంలోని 29 రాష్ట్రాలు, ఏడు కేంద్ర పాలిత ప్రాంతాలను పరిగణనలోకి తీసుకుంటే ఆంధ్రప్రదేశ్ ఆరో స్థానంలో ఉండటం అత్యంత ఆందోళన కలిగించే అంశం. కఠిన చట్టాలున్నా చిన్న చిన్న శిక్షలతోనే నిందితులు తప్పించుకోవడంతో ఈ దందా నిరాటంకంగా కొనసాగుతూనే ఉంది. గత రెండేళ్లలో రాష్ట్రంలో మరింత ఎక్కువగా అక్రమ రవాణా వ్యవహారం గుట్టు చప్పుడు కాకుండా నడుస్తున్నట్లు తెలుస్తోంది. గతేడాది మొత్తం 3,324 మిస్సింగ్ కేసులు నమోదయ్యాయి. ఇందులో బాలికలు, మహిళలే ఎక్కువగా ఉన్నారు. 274 అక్రమ రవాణా కేసుల్లో సుమారు 355 మందిని వివిధ ప్రాంతాలకు తరలించినట్లు గుర్తించారు. అసలు ఆచూకీ తెలియని వారు ఎంతో మంది ఉన్నారు. మైనర్ కిడ్నాప్‌లకు సంబంధించి కూడా 497 కేసులు నమోదయ్యాయి.



వ్యభిచార గృహాలకే...

అక్రమ రవాణా ద్వారా సుమారు 50 శాతానికి పైగా బాధితుల్ని వ్యభిచార గృహాలకు తరలిస్తున్నారు. రాష్ట్రంలోని అనంతపురం, కడప, చిత్తూరుతో పాటు ఉభయ గోదావరి జిల్లాల్లో బాధితులు ఎక్కువగా ఉన్నట్లు కొన్ని స్వచ్ఛంద సంస్థల సర్వే నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అరబ్ దేశాల్లో ఉద్యోగాలతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలంటూ ఇక్కడ యువతులకు స్థానిక ముఠాలు మాయమాటలు చెప్పి అమ్మేస్తున్నారు. సామాజిక మాధ్యమాలు అందరికీ అందుబాటులోకి వచ్చిన తరువాత బాలికలను ట్రాప్ చేయడం మరింత సులువుగా మారింది. మహిళల రక్షణకు అనేక చట్టాలున్నా వాటిని అమలు చేయడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోందన్న ఆరోపణలున్నాయి. చాలా జిల్లాల్లో నిందితులు ఏదో ఒక రాజకీయ పార్టీ పేరుతో దందాలు నిర్వహిస్తుండటంతో పోలీసులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

కఠిన శిక్షలు అవసరం...

మహిళల్ని ఒక వస్తువుగా చూస్తూ కొనేవారు ఉన్నంత వరకు అమ్మేవారు పుట్టుకొస్తూనే ఉంటారని ప్రభుత్వం నియమించిన యాంటీ ట్రాఫికింగ్ చట్టాల అధ్యయన కమిటీ సభ్యురాలు సునీత కృష్ణన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. పోలీసులు తమకు దొరికిన వారితోనే కాకుండా సమస్య మూలాలకు వెళ్లి అందరిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సాధారణ సెక్షన్లతో చిన్న చిన్న శిక్షలు పడటంతో నిందితులు మరలా ఇదే దందా కొనసాగిస్తున్నారన్నారు. అదే విధంగా అక్రమ రవాణా అంశంపై గ్రామ, మండల, నగర స్థాయిలో అందరికీ మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు.

సంక్షిప్తం

టెట్ మూడో పేపర్‌కు 94శాతం హాజరు

అమరావతి బ్యూరో : ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) మూడో పేపర్ ప్రశాంతంగా జరిగింది. గురువారం నిర్వహించిన పేపర్-3కు మొత్తం 53,402(94.28 శాతం) హాజరయ్యారని టెట్ కన్వీనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నిర్వహించిన పేపర్-3కు 30,100 మంది అభ్యర్థుల్ని కేటాయించగా, 28,439(94.48శాతం)మంది హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 26,542 మందిని కేటాయించగా 24,963(94.05)శాతం పరీక్ష రాశారు. మొత్తం 56,643 మంది అభ్యర్థులకు 53,402 మంది హాజరయ్యారు. శనివారంతో టెట్ పరీక్షలు పూర్తికానున్నాయి.

ఇంటర్ సెకండియర్ పరీక్షలకు 13,343 మంది గైర్హాజరు

అమరావతి బ్యూరో : ఇంటర్మీడియేట్ పరీక్షలు రెండు రోజు ప్రశాంతంగా జరిగాయి. మొదటి ఏడాది పరీక్షలు బుధవారం ప్రారంభమైన విషయం తెలిసిందే. ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పరీక్షకు 4,62,201 మంది హాజరయ్యారు. 4,75,544 మంది దరఖాస్తు చేసుకోగా 13,343 మంది గైర్హాజరయ్యారని ఇంటర్మీడియేట్ బోర్డు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది.

రేషన్ దుకాణాల ద్వారా రూ. 40కే కందిపప్పు

ప్రారంభించిన మంత్రి పుల్లారావు

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

రాష్ట్రంలోని 29 వేల రేషన్ దుకాణాల ద్వారా కోటి 42 లక్షల 30 వేల కార్డుదారులకు కిలో కందిపప్పును రూ.40కు అందిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఈ మేరకు గురువారం గుంటూరులో విక్రయాలను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15 తేదీ వరకూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు దుకాణాలు తెరవకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సమీక్షా సమావేశంలో దినేష్ కుమార్

అర్హులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు

సిఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మీకోసం పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించి అర్హులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సిఎస్) దినేష్ కుమార్ అధికారుల్ని ఆదేశించారు. సచివాలయంలో గురువారం రెవెన్యూ, మున్సిపల్ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాలు, నగరాలు, మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లో స్థలాల లభ్యత తక్కువగా ఉండటం వల్ల అక్కడ జి ప్లస్ టు తరహా ఇళ్లను నిర్మించాలని సూచించారు. ఇప్పటి వరకు ఇళ్ల పట్టాల కేటాయింపుల వివరాల్ని సిసిఎల్ఎ కమిషనర్ అనిల్ చంద్ర పునీత పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి మన్మోహన్ సింగ్, మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కరికాల వలవన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

కేంద్రం మద్దతు ధరకే కందుల కొనుగోలు

కేంద్రం ప్రభుత్వం ప్రకటించిన కందుల మద్దతు ధర క్వింటాల్ కు రూ. 5,450 ప్రకారం రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సిఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్దతు ధరకు కందులను కొనుగోలు చేసేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్ అధికారులకు సూచించారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర వల్ల సుమారు లక్ష మంది రైతులకు రూ. 140 కోట్ల ఆదాయం అదనంగా సమకూరుతుందన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ కార్యదర్శి రవిచంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సిరియాలో ఏం జరుగుతోంది?



సిరియాలో డమాస్కస్‌కు సమీపంలోని తూర్పు ఘౌటా ప్రాంతంలో ఉగ్రవాదుల దాడిలో అలుపుకున్న పొగ

ఉగ్రవాదులు + అమెరికా, సౌదీ Vs సిరియా

ఫ్యూచర్స్ అండ్ పాలిటిక్స్

గత కొద్ది రోజులుగా సిరియాలో పరిస్థితిపై సోషల్ మీడియాలో పోస్ట్‌లు భారీ సంఖ్యలో వెల్లువెత్తుతున్నాయి. సిరియాలో కొనసాగుతున్న తాజా పరిణామాలను ప్రపంచం పట్టించుకోవటం లేదంటూ ప్రజలు ఫొటోలు, వీడియోలతో కూడిన పోస్ట్‌లను సోషల్ మీడియాలో షేర్ చేసుకుంటున్నారు. 'రెబల్స్' (ప్రభుత్వం చెబుతున్న ఉగ్రవాదులు) నుండి తూర్పు ఘౌటా నగరాన్ని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు సిరియా ప్రభుత్వ సేనలు ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో సోషల్ మీడియా దీనిపై తీవ్రంగా స్పందిస్తోంది. సిరియా రాజధాని డెమాస్కస్ నగరానికి 15 కి.మీ దూరంలో వున్న తూర్పు ఘౌటా ప్రాంతం గత కొద్దికాలంగా రెబల్స్ ఆధీనంలో వున్న విషయం తెలిసిందే. వీరంతా టెర్రరిస్టు గ్రూప్ అల్‌ఖైదా, తదితర గ్రూప్‌లకు అనుబంధంగా గత కొద్దికాలంగా తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. తూర్పు ఘౌటాను రెబల్స్ నుండి స్వాధీనం చేసుకునే ప్రభుత్వ సేనల ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు డెమాస్కస్ నగరంపై రెబల్స్ భారీయెత్తున కాల్పులు దాడులు ప్రారంభించారు. గత నవంబర్ 16 నుండి కొనసాగుతున్న ఈదాడులు, ప్రతి దాడులలో ఇప్పటి వరకూ 18 మంది చిన్నారులు, 14 మంది మహిళలతో సహా మొత్తం 116 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని రెబల్స్ అనుకూల వర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడు ఈ ప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు సిరియా ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేయటంతో ప్రస్తుతం మనం చూస్తున్న మీడియా ప్రచారం ఊపందుకుంది. ప్రస్తుతం ఫేస్‌బుక్, వాట్సప్ తదితర సోషల్ మీడియా వేదికల్లో షేర్ అవుతున్న ప్రచారానికి మూలం న్యూయార్క్‌టైమ్స్, ది గార్డియన్ వంటి పశ్చిమ దేశాల మీడియా సంస్థలతో పాటు అల్‌జజీరా, అల్‌జజీరా+, అల్ అరేబియా వంటి మీడియా సంస్థలు అందిస్తున్న సమాచారమే. సిరియాలో బషర్ అల్ అసద్ సర్కారును గద్దెదించేందుకు గత ఐదేళ్లుగా జరుగుతున్న తిరుగుబాటులో అమెరికా సైన్యం నేరుగా జోక్యం చేసుకుంటున్న విషయం తెలిసిందే. సిరియా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న ఈ పోరులో కొంతమంది మతఛాందసవాదులు, ఉగ్రవాదులు రెబల్స్‌కు నేతృత్వం వహిస్తున్నారు. ఈ ఉగ్రవాదులకు అమెరికా, దాని నాటో మిత్ర దేశాల మద్దతు కూడా లభిస్తోంది. దీనితో పాటు సౌదీ అరేబియా వంటి నిరంకుశ రాజరిక వ్యవస్థలు సైతం వారిని గట్టిగా సమర్థిస్తున్నాయి.



ఉగ్రవాదుల ఆధిపత్యంలోని తూర్పు ఘౌటా ప్రాంతంలో దాడుల్లో చిక్కుకుపోయిన చిన్నారులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న సహాయక సిబ్బంది

ఎవరీ 'రెబల్స్'

తిరుగుబాటుకు నేతృత్వం వహిస్తున్న జభాత్ అల్ నస్రా (అల్ నస్రా ఫ్రంట్), ఇతర గ్రూపుల విలీనం అనంతరం జభాత్ ఫతే అల్ షామ్ అని, తరువాత తహ్రీర్ అల్ షామ్ అని పేర్లు మార్చుకుంది. వాస్తవానికి ఇది అల్‌ఖైదాకు చెందిన సిరియా విభాగం అని చెప్పవచ్చు. ఈ రెబల్ గ్రూపుల్లో వున్న వారంతా అమానుష హత్యలకు సైతం వెనుదీయని కరుడు గట్టిన ఉగ్రవాదులే. వీరిలో మరికొంత మంది వున్నారు. ఇందులో సౌదీ అరేబియాకు చెందిన జయేష్ అల్ ఇస్లామ్ (దీనికి సౌదీ, కువైత్‌కు చెందిన వహబిస్టులు ఆర్థిక అండదండలు సమకూరుస్తున్నారు), టర్కీకి చెందిన అహ్రర్ అల్ షామ్ అనే ప్రచ్ఛన్న సైనిక ముఠాలు ప్రధానమైనవి. వీరితో పాటు హర్కత్ నూర్ అల్ దీన్ అల్ జెంకీ మరో ఉగ్రవాద సంస్థ కూడా క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. గూఢచర్యం చేస్తున్నాడన్న అనుమానంతో పాలస్తీనాకు చెందిన12 ఏళ్ల బాలుడి తల నరికిన ఈ ఉగ్రవాదులు ఆ వీడియోను ఆన్‌లైన్‌లో కూడా ప్రసారం చేశారు.

సౌదీ, ఇతర గల్ఫ్ దేశాలు ఎందుకు సమర్థిస్తున్నాయి?

ఇరాక్ మినహా పర్షియన్ గల్ఫ్‌లోని ఇతర అరబ్ దేశాలన్నీ రాజకుటుంబాల పాలనలోనే కొనసాగుతున్నాయి. వీటికి సౌదీ అరేబియా నాయకత్వం వహిస్తోంది. ప్రపంచంలో వివిధ దేశాలలో కొనసాగుతున్న మత ఛాందసవాద, ఉగ్రవాద కార్యకలాపాలకు ఇక్కడి నుండే ఆర్థిక సాయం అందుతోందన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో లౌకిక విధానాన్ని అనుసరిస్తున్న సిరియా వీరికి సమస్యగా మారింది. పూర్తి స్థాయి రిపబ్లిక్ అయిన సిరియా చెబుతున్న అరబ్ జాతీయ వాదాన్ని ఈ ప్రాంతంలోని రాజకుటుంబాలు తమకు ముప్పుగా పరిగణిస్తున్నాయి. వీరితో పాటు ఈ ప్రాంతంలో మరో శక్తిగా ఎదుగుతున్న టర్కీలోని ఇస్లామిస్ట్ ప్రభుత్వం కూడా సిరియా ప్రభుత్వాన్ని గద్దె దించేందుకే ప్రయత్నిస్తోంది.

ఇప్పుడు మీడియా ప్రచారం ఎందుకు?

పశ్చిమాసియా ప్రాంతం దీర్ఘకాలంగా యుద్ధాలకు నిలయంగా మారింది. ఇటీవలి కాలంలో జరిగిన యుద్ధాలు ఉగ్రవాద గ్రూపులు స్వాధీనం చేసుకున్న ప్రాంతాలను ఆయా ప్రభుత్వాలు తిరిగి స్వాధీనం చేసుకోటానికి చేస్తున్నవేనన్న విషయం తెలిసిందే. ఇస్లామిక్ స్టేట్ ఆక్రమించుకున్న సిరియా పట్టణం రక్కాను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు అమెరికా నేతృత్వంలోని సంకీర్ణ సేనలు కొనసాగించిన పోరులో దాదాపు 3,200 మందికి పైగా సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారు. పౌరులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు కాల్పుల విరమణ పాటించాలంటూ ఐరాస చేసిన విజ్ఞప్తిని సైతం అమెరికా తోసిపుచ్చింది. అలాగే మోసుల్ నగర విముక్తి పోరులో 11 వేల మందికి పైగా పౌరులు మృత్యువాత పడ్డారు. ఇంత జరుగుతున్నా అమెరికా పోరాటాన్ని ఆపాలని మీడియా ప్రచారం చేయటం ఎక్కడన్నా కన్పిస్తోందా? అంటే లేదనే సమాధానం వస్తుంది. అందుకు బదులుగా అమెరికా సామ్రాజ్యవాదంతో దోస్తీకి నిరాకరిస్తున్న ఒక సార్వభౌమత్వ దేశం, అమెరికా, దాని మిత్ర దేశాలు సమర్థిస్తున్న ఉగ్రవాదుల చేతుల్లో నుండి తమ దేశంలో ఒక నగరాన్ని స్వాధీనం చేసుకోవటాన్ని వ్యతిరేకిస్తూ ప్రచారం చేస్తున్నాయి. ఇందులో భాగంగానే 2016 డిసెంబర్‌లో సిరియన్ సైన్యం అలెప్పో నగరాన్ని విముక్తి చేసినపుడు సేవ్ అలెప్పో ప్రచారం జరిగింది. ఇప్పుడు సిరియా ప్రభుత్వం తూర్పు ఘౌటాను విముక్తి చేయటానికి ప్రయత్నించినపుడు అదే తరహా ప్రచారం ఊపందుకుంటోంది. ఇందుకు పశ్చిమ, ఇస్లామిస్ట్ దేశాల అండతో లండన్‌లో తిష్ట వేసిన 'సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్' వంటి సంస్థలు పావులుగా మారుతున్నాయి. ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న చిత్రాలేవీ సిరియాలో ప్రస్తుత పరిణామాలకు సంబంధించినవి కాదన్న విషయం గమనార్హం. ఎప్పుడో అటకెక్కించిన పాత చిత్రాలను బూజు దులిపి సిరియాలో ప్రజలు కష్టాలు పడుతున్నారంటూ మొసలి కన్నీరు కారుస్తూ ప్రచారం కొనసాగిస్తున్నారు.

సిరియాలో పోరును పశ్చిమ మీడియా, అల్ జజీరా ఎందుకు సమర్థిస్తున్నాయి?


పశ్చిమ దేశాలకు సంబంధించిన కార్పొరేట్ మీడియా అన్నివేళలా సామ్రాజ్యవాద ప్రభుత్వాల తొత్తుగానే వ్యవహరిస్తోందనటంలో ఏ మాత్రం సందేహం అక్కర్లేదు. సద్దాం హుస్సేన్ మారణాయుధాలను పోగు చేస్తున్నాడంటూ తప్పుడు ప్రచారంచేసి ఇరాక్‌పై అమెరికా చేసిన యుద్ధాన్ని న్యూయార్క్‌టైమ్స్, వాషింగ్టన్ పోస్ట్ వంటి మీడియా సంస్థలు సమర్థించాయి. ఇప్పుడు సౌదీ ప్రభుత్వ ఆధీనంలోని అల్ అరేబియా మీడియా సంస్థ సైతం సిరియాపై పోరును ఏకపక్షంగానే సమర్థిస్తోంది. కతార్ రాజకుటుంబానికి చెందిన అల్ జజీరా మీడియా సంస్థ జిహాదీ ఇస్లామిజానికి ఆజ్యం పోయటంలో కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. అల్‌జజీరా ఇంగ్లీష్ ఛానల్ అల్ జజీరా రాజకీయాలకు మరో ముసుగు మాత్రమే.

ఇంతకీ రెబల్స్ ఏం కోరుతున్నారు?

అల్‌ఖైదా ఉగ్రవాద సంస్థ దేనికోసం పోరాడుతోందో మనందరికీ తెలిసిందే. మహిళలను బానిసలుగా చూసే సమాజం కోసం వారు పోరాడుతున్నారు. ఇక్కడ మైనార్టీలందరూ ద్వితీయ శ్రేణి పౌరులుగానే బతకాలి (వారిని చంపకుండా వుంటే..). ఇదంతా వారు అనుసరించే మతఛాందసవాద దృక్పథంపై ఆధారపడి వుంటుంది.

అమెరికా ఎందుకు సమర్థిస్తోంది?

గత కొన్నేళ్లుగా సిరియా, లిబియాలలో ఏం జరుగుతుందన్న అంశాన్ని గమనించిన వారెవరికైనా 'చమురు సంపద'పై దృష్టే దీనికి కారణమని స్పష్టమౌతుంది.. చమురు సంపద పుష్కలంగా వున్న సౌదీ అరేబియా, ఇతర గల్ఫ్ దేశాలు అమెరికా మిత్ర దేశాలుగా కొనసాగుతుండగా సిరియా మాత్రం సర్వ స్వతంత్ర దేశంగా కొనసాగుతోంది. ఈ దేశం అనుసరిస్తున్న విధానాలేవీ అమెరికా కంపెనీలకు ఏ మాత్రం ప్రయోజనకరంగా లేవు. ఇంతకు ముందు చెప్పుకున్నట్టుగా అరబ్ జాతీయవాదానికి ఈ ప్రాంతంలో ఇప్పుడు మిగిలిన ఏకైక ప్రతినిధి సిరియా మాత్రమే. ఈ ప్రాంతంలో సామ్రాజ్యవాద వ్యతిరేక, యూదు వ్యతిరేక వైఖరిని అనుసరిస్తున్న అరబ్ జాతీయవాద, సోషలిస్టు శక్తులతో పోరాడేందుకు అమెరికా దీర్ఘకాలంగా ప్రతీఘాత ఇస్లామిక్ శక్తులను, వాటి ప్రభుత్వాలను సమర్థిస్తోంది. మరోవైపు సిరియా రష్యా, చైనాలతో సన్నిహితంగా మెలుగుతూ వాటితో మైత్రిని కొనసాగిస్తోంది. ఇటీవలి కాలంలో అమెరికా తనకు ముప్పుగా భావిస్తున్న మరో దేశం ఇరాన్‌తో కూడా సాన్నిహిత్యం పెంచుకుంది. చారిత్రకంగా చూసుకుంటే ఇజ్రాయిల్‌ను గట్టిగా వ్యతిరేకిస్తున్న దేశం సిరియా. ఈ రెండు దేశాల మధ్య వున్న సరిహద్దులోని గోలన్ హైట్స్ ప్రాంతం సిరియా భూభాగంలో వుంది. పాలస్తీనా ప్రజలతో సన్నిహిత మైత్రిని కొనసాగిస్తున్న సిరియా పాలస్తీనా ఏర్పాటు విషయంలోనూ అదే నిబద్ధతను కొనసాగిస్తోంది. గత 18 ఏళ్లుగా ఇజ్రాయిల్‌తో పోరాడుతున్న హిజ్బుల్లాతో సిరియాకు సత్సంబంధాలే వున్నాయి. సిరియా ప్రభుత్వం పడిపోతే అరబ్ ప్రాంతంలో ఇజ్రాయిల్‌కు ఎదురు నిలిచే అరబ్ దేశమే వుండదు. అన్నిచోట్లా ఓటమిని ఎదుర్కొంటున్న అరబ్ జాతీయవాద శక్తులకు ఇప్పుడు పట్టున్న ఏకైక ప్రాంతం సిరియా మాత్రమే. అందువల్లే సిరియా ప్రభుత్వ పతనాన్ని అమెరికా కోరుకుంటోంది. అందుకే అక్కడి ప్రభుత్వాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తోంది. ఇందుకోసం ఈ ప్రాంతంలో ఆర్థికంగా, ఆయుధాలు, సైనిక మద్దతు సమకూర్చి ఇస్లామిస్ట్ ప్రభుత్వాలు పెంచి పోషిస్తున్న ఉగ్రవాదులను సమర్థించేందుకు కూడా అమెరికా వెనుకాడటం లేదు. ప్రపంచ వ్యాప్తంగా వున్న ఇస్లామిస్ట్ శక్తులలో అధికశాతాన్ని అమెరికా, దాని మిత్ర దేశాలు గట్టిగా సమర్థిస్తున్నాయి. ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్‌లుగా రూపాంతరం చెందిన ముజాహిదీన్‌లను అమెరికా సమర్థిస్తుండటాన్ని ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అంతేకాదు అమెరికా, దాని మిత్ర దేశాలు ఇరాక్‌లో కొనసాగించిన విధ్వంసం ఫలితమే ఇస్లామిక్ స్టేట్ ఆవిర్భావం.



సేవ్ ఘౌటా?

ప్రస్తుతం తూర్పు ఘౌటా ప్రాంతాన్ని జయేష్ అల్ ఇస్లామ్, అల్‌నస్రా ఫ్రంట్, దాని మిత్ర పక్షం ఫేలాక్ అల్ రెహ్మాన్ గ్రూపు అనే మూడు సంస్థలు నియంత్రిస్తున్నాయి. 2015లో తెరపైకి వచ్చిన జయేష్ అల్ ఇస్లామ్ గ్రూప్ బాంబుదాడుల నుండి తమను తాము రక్షించుకునేందుకు మహిళలతో సహా సామాన్య పౌరులను రక్షణ కవచాలుగా వాడుకుంది. ఇటువంటి టెర్రరిస్టుల చెర నుండి ఘౌటాను విముక్తి చేయటాన్ని వ్యతిరేకిస్తూ గతంలో 'సేవల్ అలెప్పో' తరహాలోనే సేవ్ ఘౌటా ప్రచారం ప్రారంభమైంది. అల్‌ఖైదా, ఐఎస్ఐఎస్ వంటి ఉగ్రవాద సంస్థల చెరలో వున్న తమ భూభాగాన్ని రష్యా సాయంతో విడిపించుకునేందుకు సిరియా సైనికదళాలు ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రారంభమైన సేవ్‌ఘౌటా ప్రచారం అక్కడి ప్రజలను రక్షించేందుకు కాక, సిరియాను ఆక్రమించుకునేందుకు ఉగ్రవాదులతో చేతులు కలిపిన అమెరికన్ సామ్రాజ్యవాద శక్తులు ప్రయత్నాలకు అంతర్జాతీయ కూడగట్టటమే లక్ష్యంగా కన్పిస్తోంది. సిరియా నుండి తమ సైన్యాలను ఉపసంహరించుకునేందుకు అమెరికా, దాని మిత్రపక్షాలపై అంతర్జాతీయంగా వత్తిడి పెరగాల్సిన అవసరం వుంది. తూర్పు ఘౌటా లేదా సిరియాలోని మరే ఇతర ప్రాంతాన్నయినా ఆక్రమించుకున్న ఉగ్రవాదులు ప్రభుత్వానికి లొంగకపోతే వారి మెడలు వంచేందుకు అంతర్జాతీయ మద్దతును సమీకరించే హక్కు సిరియా ప్రభుత్వానికి వుంది. అయితే ఈ ప్రయత్నంలో పౌరులకు వీలయినంత కనిష్టస్థాయిలో నష్టం జరిగే విధంగా చర్యలు తీసుకునేలా ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలి. అంతిమంగా ఐఎస్ఐఎస్, అల్‌ఖైదా వంటి ఉగ్రవాద సంస్థలతో శాంతి చర్చలకు తావులేదన్న విషయాన్ని పై అంశాలన్నీ స్పష్టం చేస్తున్నాయి. ఈ శక్తులను ఓడించాల్సిందేనన్న విషయంలో సంశయానికి ఏ మాత్రం తావులేదన్నది సుస్పష్టం.

ముస్లింల అభ్యున్నతికి ముర్తుజా విశేష కృషి

నేడు నంద్యాలలో అంత్యక్రియలు

ప్రజాశక్తి - నంద్యాల

ముస్లింల అభ్యున్నతికి ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి ముర్తుజా ఎనలేని సేవలందించారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ జి.ఓబులు, తూర్పుప్రాంత జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ , ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఇంతియాజ్ పేర్కొన్నారు. గురువారం ముర్తుజా భౌతికాయం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముర్తుజా ఉపాధ్యాయుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి ముస్లింల సమస్యలపై పరిపూర్ణమైన అవగాహనతో కృషి చేశారన్నారు. ప్రజాశక్తి, ఇతర పత్రికలకు వ్యాసాలు రాసి చైతన్యపరిచారన్నారు.

ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ముస్లింల సమస్యలపై ఆ సామాజిక తరగతికి చెందిన వారిని ఐక్యం చేస్తూ పోరాటాలు చేశారన్నారు. ఆయన లేనిలోటు తీరనిదని చెప్పారు.

నేడు నంద్యాలలో అంత్యక్రియలు



ముర్తుజా మృతదేహం వద్ద నివాళ్లు అర్పిస్తున్న జి.ఓబులు తదితరులు

ముర్తుజా అంత్యక్రియలు శుక్రవారం ఉదయం 9గంటలకు నంద్యాలలో నిర్వహించనున్నారు. బుధవారం ఆయన గుండెపోటుతో మృతిచెందారు. విదేశాల్లో ఉన్న ఆయన కుమారుడు గురువారం రాత్రి పొద్దుపోయాక నంద్యాలకు చేరుకున్నారు.

పోలవరం మాజీఎమ్మెల్యే సింగన్నదొర మృతి

ప్రజాశక్తి - పోలవరం



పశ్చిమగోదావరి జిల్లా పోలవరం మాజీ ఎమ్మెల్యే పూనెం సింగన్నదొర(68) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో కన్నుమూశారు. గత నెల 24న ఆయన అస్వస్థతకు గురికావడంతో బంధువులు చికిత్స నిమిత్తం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బొల్లినేని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా గురువారం ఒక్కసారిగా గుండెపోటు రావడంతో హఠాన్మరణం చెందారు. అనంతరం ఆయన స్వగ్రామమైన కోండ్రుకోట గ్రామానికి పార్థివదేహాన్ని తరలించారు. పోలవరం ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్ ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. గురువారం సాయంత్రం కోండ్రుకోటలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. సింగన్నదొర మృతికి సంతాపంగా పోలవరంలో వ్యాపారులు స్వచ్ఛందంగా తమ దుకాణాలను మూసివేసి సంతాపం తెలిపారు. ఎన్‌టిఆర్ ఆహ్వానం మేరకు టిడిపిలో చేరిన ఆయన 1994 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు.

● మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి, అశ్లీల చిత్రాలను ప్రోత్సహించిన సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మను తక్షణం అరెస్ట్ చేయాలని రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఐద్వా రౌండ్ టేబుల్‌లో నేతలు డిమాండ్ చేశారు. ఎన్‌జిఓస్ హోంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి పి.తులసి అధ్యక్షత వహించారు.

సంపాదకీయం

జగన్ పాదయాత్ర

వైసిపి అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్ర బుధవారం నాటికి వంద రోజుల మైలురాయిని దాటింది. గతేడాది నవంబర్ 6న కడప జిల్లా ఇడుపులపాయలో మొదలుపెట్టిన పాదయాత్ర శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు కొనసాగుతుందని ముందుగానే ప్రకటించారు. ఏ పార్టీ అయినా ప్రజల్లోకెళ్లి వారి సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయడం, ప్రజలకు తమ విధానాల గురించి తెలియజేయడం మంచిదే. ప్రజాస్వామ్యంలో అదొక పంథా. గతంలోనూ పలువురు నేతలు పాదయాత్రలు నిర్వహించారు. జగన్ పాదయాత్ర చివరిది కాకపోవచ్చు. బహుశా ఎన్నికల తరుణంలో మరింత మంది నేతలు మరిన్ని పాదయాత్రలు ప్రారంభించే అవకాశాలున్నాయి. జగన్ పాదయాత్రలు చేయడం, సమస్యలు పరిష్కరిస్తానని ప్రజలకు వాగ్దానాలు చేయడం బాగానే ఉంది. కానీ అధికార తెలుగుదేశం ప్రభుత్వం అనుసరిస్తున్న ఏ విధానాల వల్ల జనం కడగండ్ల పాలవుతున్నారో అవే విధానాలను అనుసరిస్తూ ప్రజల సమస్యలు పరిష్కరించడం ఎలా సాధ్యం? నయా-ఉదారవాద ఆర్థిక విధానాలను, కార్పొరేట్ల దోపిడీకి ఊతమిచ్చే చర్యలను యథాప్రకారం కొనసాగిస్తూనే టిడిపికి తాను తిరుగులేని ప్రత్యామ్నాయంగా చిత్రీకరించుకోవడం పొసగని వ్యవహారం. తాను అధికారంలోకొస్తే అమలు చేస్తానంటున్న 'నవరత్నాలు' గతంలో వైఎస్, ఇప్పుడు చంద్రబాబు అనుసరిస్తూ వచ్చిన సరళీకరణ విధానాల్లో భాగమే. జన బాహుళ్యాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలకు అరకొర స్థాయి ఉపశమనాలు తప్ప విధానపరంగా ప్రత్యామ్నాయాలు ఇందులో ఏమీ లేవు.

జగన్ ఎంచుకున్న రాజకీయ విధానంలోనూ అవకాశవాదం కనిపిస్తోంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వక పోడానికీ, విభజన హామీల అమలు చేయకపోవడానికీ కారణం కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం. కేంద్రంతో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం లాలూచీ పడి దానిపై ఒత్తిడి తేకుండా రకరకాల మాటలు మాట్లాడుతోంది. విభజన హామీలు నెరవేరుస్తామని బిజెపి, టిడిపి రెండూ ఎన్నికల్లో ప్రజలకు హామీ ఇచ్చి ఓట్లేయించుకొని పీఠమెక్కాయి. రెండు పార్టీలూ కేంద్రంలో, రాష్ట్రంలో అధికారం పంచుకున్నాయి. ఈ విషయంలో టిడిపి ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి చంద్రబాబునూ విమర్శిస్తున్న జగన్ కేంద్రంలోని బిజెపిపైనా, ప్రధాని మోడీపైనా పన్నెత్తి మాట్లాడక పోవడం చూస్తుంటే ఒక దోషితో వియ్యం, మరో దోషితో కయ్యం లాగా ఆయన పరిస్థితి ఉంది. ప్రత్యేక హోదా ఇవ్వని బిజెపికి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో జగన్ భేషరతుగా మద్దతు తెలిపారు. మొన్న కేంద్ర బడ్జెట్ సమయంలో కూడా బడ్జెట్ చాలా బాగుందని వైసిపి ఎంపీలు కితాబిచ్చారు. అదే సమయంలో ఏపీకి అన్యాయం జరిగిందని సన్నాయినొక్కులు నొక్కారు. మూడున్నరేళ్లుగా కేంద్రంలో బిజెపి సర్కారు బరితెగించి మతోన్మాదాన్ని రెచ్చగొడుతోంది. ముస్లిం మైనార్టీలు, క్రైస్తవులు, దళితులపై దాడులు చేస్తోంది. పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి, ప్రయివేటీకరణ వంటి ప్రజావ్యతిరేక చర్యలు చేపట్టింది. ఎన్‌డిఎ ప్రభుత్వంలో రోజుకో బ్యాంకు కుంభకోణం బయటపడుతోంది. బిజెపి అధ్యక్షుడు అమిత్‌షాపైనే స్కాం ఆరోపణలొచ్చాయి. విజయ మాల్యా, నీరవ్ మోడీ ప్రభృతులు వేల కోట్ల రూపాయాలు మింగేసి విదేశాలకు చెక్కేస్తే వారికి ఊతం ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం మీద వైసిపి నుండి ఒక్క విమర్శ లేదు. పైగా ప్రత్యేక హోదా ఇస్తే బిజెపితో జట్టు కడతామని స్వయంగా జగన్ పలుమార్లు ప్రకటించడమంటే బిజెపి మతోన్మాద, ప్రజాకంటక చర్యలకు పరోక్షంగా వత్తాసు పలకడమే.

ఏమైనా ప్రత్యేక హోదా కోసం రాష్ట్రంలో వామపక్షాలు, ఇతర పార్టీలు, సంస్థలు కలిసి చేపట్టిన ఉద్యమానికి వైఎస్‌ఆర్ సిపి మద్దతివ్వడం మంచి పరిణామం. అదే సమయంలో రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపి కేంద్ర ప్రభుత్వంపై ఒక్క మాటకూడా మాట్లాడకుండా, పైగా దానితో ఎన్నికల్లో జతకడతామని సంకేతాలిస్తూ మరోవైపు దానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామంటే అది పాక్షికమే అవుతుంది. జగన్‌కు నిజంగా ప్రజా సమస్యలు పరిష్కరించాలనే చిత్తశుద్ధి ఉంటే ఈ నాడు ప్రజలకు కంటకంగా మారిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ఆయన వైఖరి స్పష్టం చేయాలి. మోడీ ప్రభుత్వం రైల్వేలు, రక్షణ, బ్యాంకింగు సహా అన్ని రంగాలనూ ప్రయివేటీకరిస్తోంది. కార్మిక చట్టాలను నీరుగార్చి వారి హక్కులు హరిస్తోంది. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా దివాళా ఎత్తిస్తోంది. మరోవైపు మోడి హయాంలో కాషాయ పరివారం దళితులపైనా, ముస్లిం మైనారిటీలపైనా విపరీతంగా దాడులు చేస్తోంది. మన రాష్ట్రంలోనూ చంద్రబాబు ప్రభుత్వం అవే విధానాలు అమలు చేస్తోంది. ఈ విధానాల పట్ల తన వైఖరి ఏమిటో జగన్ చెప్పడం లేదు. నిన్న గరగపర్రు, నేడు పెదగొట్టిపాడులో దళితులపై పెత్తందార్ల దౌర్జన్యాలను ఆయన ఎక్కడా ఖండించలేదు. అందువల్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను వ్యతిరేకించకుండా ఎన్ని పాదయాత్రలు చేసినా వాటివల్ల ప్రజలకు ప్రయోజనం ఉండదు.

ఇది విషయం



బాబు తిరిగి అదే పాట
హోదాతో ఒరగదంట
ఏమిచ్చారో ఏమో...
పదే పదే అదే మాట!

ఆకలితో చస్తున్నా
జనం ఘోష పట్టదా...
అందరు నడిచే బాట
అసలు మనకు గిట్టదా!

- కొల్లూరు వెంకట్

విభజన చట్ట హామీలు ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ

విశ్లేషణ



ఆంధ్రప్రదేశ్‌లో వెనకబడిన ఏడు జిల్లాలను విభజన చట్టంలో చేర్చినప్పటికీ నాలుగేళ్లుగా నామ మాత్ర సహాయాన్ని మాత్రమే అందించారు. జిల్లాకు సంవత్సరానికి రూ.50 కోట్ల చొప్పున ఏడు జిల్లాలకు కలిపి మూడేళ్లలో రూ.1,050 కోట్లు మాత్రమే అందింది. ఉత్తరాంధ్రలో మూడు జిల్లాలు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ పట్నాలకు కేవలం రూ.403 కోట్లు అందగా, ఖర్చు చేసింది రూ.340 కోట్లు మాత్రమే. ఈ పెట్టిన ఖర్చును ఉత్పాదక రంగాలకు కాకుండా, సిసి రోడ్లు మొదలగు వాటికి ఖర్చు చేయడంతో ఉపయోగం లేకుండా పోయింది.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం లేక విభజన చట్టం- 2014, రాష్ట్రంలో రాయలసీమ, ఉత్తరాంధ్రలో ఏడు వెనకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. విభజన చట్టంలోని సెక్షన్ 46(2) ప్రకారం రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలకు తగిన ప్రయోజనాలు, ప్రోత్సాహకాలను అభివృద్ధి ప్యాకేజీ రూపంలో ఇవ్వాలి. సెక్షన్ 46(3) ప్రకారం రాష్ట్రంలోని రాయలసీమ, ఉత్తర కోస్తా ప్రాంతాలను పరిగణనలోకి తీసుకొని తగిన ప్రోత్సాహకాలు కల్పించాలి. విభజన బిల్లుపై ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ మాట్లాడే సందర్భంలో వెనుకబడిన ప్రాంతాలకు బుందేల్ ఖండ్ తరహాలో బొలంగీర్-కలహండి-కోరాపుట్ (బికెకె) తరహాలో సహాయం అందిస్తామని ప్రకటించారు. బుందేల్‌ఖండ్‌కు ఏడు వేల కోట్లు, 'బికెకె'కు సుమారు రూ.15 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ సహాయాన్ని అందించారు.

కానీ ఆంధ్రప్రదేశ్‌లో వెనకబడిన ఏడు జిల్లాలను విభజన చట్టంలో చేర్చినప్పటికీ నాలుగేళ్లుగా నామ మాత్ర సహాయాన్ని మాత్రమే అందించారు. జిల్లాకు సంవత్సరానికి రూ.50 కోట్ల చొప్పున ఏడు జిల్లాలకు కలిపి మూడేళ్లలో రూ.1,050 కోట్లు మాత్రమే అందింది. ఉత్తరాంధ్రలో మూడు జిల్లాలు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నాలకు కేవలం రూ.403 కోట్లు అందగా, ఖర్చు చేసింది రూ.340 కోట్లు మాత్రమే. ఈ పెట్టిన ఖర్చును ఉత్పాదక రంగాలకు కాకుండా, సిసి రోడ్లు మొదలగు వాటికి ఖర్చు చేయడంతో ఉపయోగం లేకుండా పోయింది. ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాల ఆర్థిక పరిస్థితులను పరిశీలిస్తే ప్రత్యేక ప్యాకేజీ ఆవశ్యకత అర్థమౌతుంది.



కె ఎస్ లక్ష్మణరావు

శ్రీకాకుళం జిల్లా -ఆర్థిక వ్యవస్థ

శ్రీకాకుళం జిల్లా 38 మండలాలతో 27 లక్షల జనాభా కలిగివుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన లెక్కల ప్రకారం 2015-16 నాటికి రాష్ట్రంలోని 13 జిల్లాలలో శ్రీకాకుళం వ్యవసాయం, అనుబంధ రంగాలలో 13వ స్థానం, పారిశ్రామిక రంగంలో 12వ స్థానం, సేవల రంగంలో 12వ స్థానం, తలసరి ఆదాయంలో 13వ స్థానంలో వుంది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదలలో 12వ స్థానం కలిగి వుంది. రాష్ట్ర స్థాయి తలసరి ఆదాయం రూ.1,08,163 ఉంటే శ్రీకాకుళం జిల్లా సగటు తలసరి ఆదాయం రూ.83,800 మాత్రమే వుంది. శ్రీకాకుళం, రణస్థలం, రాజాం, పలాస, టెక్కలి, ఎచ్చర్ల, నర్సన్నపేట మొదలగు మండలాలలో మాత్రమే జిల్లా స్థాయి కంటే ఎక్కువగా తలసరి ఆదాయం ఉంది. 25 మండలాల తలసరి ఆదాయం జిల్లా సగటు కంటే తక్కువగా వుంది. కవిటి, కోట బొమ్మాళి, లావేరు, పాతపట్నం, సంత బొమ్మాళి, కంచిలి, నందిగం, సీతం పేట, భీమిని మొదలను మండలాల్లో తలసరి ఆదాయం జిల్లా తలసరి ఆదాయం కంటే బాగా తక్కువగా ఉంది.

విజయనగరం జిల్లా ఆర్థిక పరిస్థితులు

విజయనగరం జిల్లా 6,539 చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో 34 మండలాలు, 23 లక్షల 40 వేల జనాభా కలిగి ఉంది. రాష్ట్రంలోని 13 జిల్లాలలో విజయనగరం జిల్లా వ్యవసాయ అనుబంధ రంగాలలో 12వ స్థానం, పారిశ్రామిక రంగంలో 13వ స్థానం, సేవల రంగంలో 13వ స్థానం, తలసరి ఆదాయాలలో 12వ స్థానం, మొత్తం రాష్ట్ర ఉత్పత్తిలో 13వ స్థానంలో అంటే చివరి స్థానంలో వుంది.

విజయనగరం జిల్లాల్లో తలసరి ఆదాయం రూ.84,206 ఉంటే, విజయనగరం, బొబ్బిలి, నెల్లిమర్ల, సాలూరు, పూసపాటిరేగ, కొత్త వలస, ఎంఎం డామ్ మండలాలు మాత్రమే జిల్లా తలసరి ఆదాయం కంటే ఎక్కువగా ఉన్నాయి. కురుపాం, జిఎల్ పురం, పచ్చిపెంట, గరుగుబిల్లి, తెర్లాం, జామి మొదలగు మండలాలలో తలసరి ఆదాయం జిల్లా తలసరి ఆదాయం కంటే బాగా తక్కువగా వుంది.

విశాఖపట్నం జిల్లా ఆర్థిక అంశాలు

విశాఖపట్నం జిల్లా 11,161 చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో, 43 మండలాలు, 42 లక్షల 90 వేల జనాభా కలిగివుంది. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో విశాఖపట్నం జిల్లా వ్యవసాయ, అనుబంధ రంగాలలో 11వ స్థానం, పారిశ్రామిక రంగంలో మొదటి స్థానం, సర్వీస్ రంగంలో మొదటి స్థానం, రూ.1,27,378లతో తలసరి ఆదాయంలో మూడవ స్థానం, రాష్ట్ర మొత్తం ఉత్పత్తిలో రెండవ స్థానాన్ని కలిగి వుంది.

ఈ జిల్లాలో రెండు దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తాయి. మొదటి దృశ్యంలో విశాఖపట్నం, పారిశ్రామిక ప్రాంతం, ప్రత్యేక ఆర్థిక మండళ్లు కలిగిన ప్రాంతం పారిశ్రామికంగా, తలసరి ఆదాయంలో ముందంజలో ఉన్నాయి. రెండో దృశ్యంలో విశాఖ గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలు చాలా వెనుకబడి ఉన్నాయి.

జిల్లా తలసరి ఆదాయం రూ.1,27,378 వుంటే, విశాఖ నగరం రూ.1,74,797, గాజువాక రూ.2,78,990, అచ్యుతాపురం రూ.4,84,716, పరవాడ రూ.2,02,787, ఆనందాపురం రూ.1,59,149 కలిగి వున్నాయి.

అదే సమయంలో జి మాడుగుల రూ.50,427, పెదగంట్యాడ రూ.55,190, హుకుంపేట రూ.56,563, అరకు వ్యాలీ రూ.62,562, డుంబ్రిగూడ రూ.59,007 తలసరి ఆదాయాన్ని కలిగి వుండడం విశాఖ జిల్లా అభివృద్ధిలో తీవ్రమైన అసమానతలను తెలుపుతుంది.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి సూచనలు

ఉత్తరాంధ్రగా పిలవబడుతున్న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు అన్ని అభివృద్ధి సూచికలలో రాష్ట్రంలో చివరి స్థానాలలో ఉన్నాయి. ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయవలసిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై వుంది. సూచనలు...

1.ఉత్తరాంధ్ర జిల్లాలకు బుందేల్‌ఖండ్, బికెకె ప్యాకేజీ తరహాలో ప్రత్యేక ప్యాకేజీ కింద రూ.15 వేల కోట్లు కేటాయించాలి. 2. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వంశధార వంటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికపై పూర్తి చేయాలి. నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి. 3. విజయనగరంలో విభజన చట్టం ప్రకారం గిరిజన యూనివర్శిటీని ఏర్పాటు చేయాలి. 4.విభజన చట్టం ప్రకారం విశాఖపట్నంలో పెట్రోలియం యూనివర్శిటీ ఏర్పర్చాలి. 5.ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేకంగా స్వయం ప్రతిపత్తిగల అభివృద్ధి మండలి ఏర్పర్చాలి. 6. మూడు జిల్లాల్లో అక్షరాస్యత పెంపుదలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేపట్టాలి. 7. విశాఖపట్నంలో వెంటనే రైల్వేజోన్ ఏర్పాటు చేయాలి. 8. గిరిజన ప్రాంతాలలో అక్రమ మైనింగ్‌ను నిలుపుదల చేయాలి. 9 విజయనగరంలో 'ఎయిమ్స్' తరహా ఆస్పత్రిని నిర్మించాలి. 10. హైకోర్టు బెంచ్‌ను విశాఖపట్నంలో ఏర్పర్చాలి. 11. ఈ ప్రాంతంలో 24 లక్షల ఎకరాలకు కనీసం ఒక పంటకైనా నీరు అందించాలి. 12. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) ప్రయివేటీకరణ ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలి. 13 గిరిజన ప్రాంతాలలో ప్రత్యేక పాఠశాలలు నెలకొల్పాలి.

(రచయిత శాసనమండలి మాజీ సభ్యులు)

చర్చ

ముదురుతున్న మమత అనుచరుల ఆగడాలు



పశ్చిమ బెంగాల్లో అరాచకం అంతకంతకూ పెరుగుతోంది. కొన్ని రోజుల క్రితం గోసాబా ప్రాంతంలో, బాసంతీ సహా ఇతర జాగాల్లో, తృణమూల్‌లోని రెండు ముఠాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. దీంతో మమతా బెనర్జీ రంగంలోకి దిగి, వారికి హెచ్చరిక చేశారు. కలిసిమెలసి పని చేయండని బోధించి మరీ వచ్చారు. అయితే ఆ ఘర్షణలు వాక్‌యుద్ధం, చేయి చేసుకోవటం, లాఠీలు ఝుళిపించటం వంటి సామాన్య స్థాయిని మించిపోయాయి. తూటాలు, తుపాకులతోనే వారు ఎల్లప్పుడూ కొట్లాటకు సిద్ధంగా ఉంటున్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో జరిగిన ఘర్షణలో తొమ్మిదేళ్ళ విద్యార్థి, ఒక యువకుడు బలయ్యారు. తూటాలు తగిలి ఆస్పత్రిలో ఒక పోలీసు సిబ్బందితో సహా మరో ఏడుగురు మృత్యువుతో పోరాడుతున్నారు. అంతేకాక కొద్ది రోజుల క్రితం తృణమూల్ ఛాత్ర పరిషద్ (విద్యార్థి సంఘం) వార్షికోత్సవం నాడు కోల్‌కతాలో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మాట్లాడుతూ, విద్యార్థినీ విద్యార్థులను 'సంయమనం' పాటించమని 'మంచివాళ్ళు' కమ్మని నిర్దేశించారు. కానీ వాస్తవంలో కనబడేదేమంటే, కళాశాల విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి, యూనియన్ కార్యాలయం లోనే సంఘ బాధ్యతల్లో ఉన్న ఒక విద్యార్థినిని కొట్టటమే కాకుండా లైంగికంగా వేధించాడు. ఈ దుశ్చర్య సిసి టీవీ పుటేజీలో నిక్షిప్తమైంది కూడా.

ఇక్కడితోనే ఆగలేదు. తృణమూల్ ముఠా తగాదాల కారణంగా ఇటీవల జరిగిన రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు మరణించారు. ప్రస్తుతం బెంగాల్లోని కొన్ని ప్రాంతాల్లో ప్రతి రోజూ తృణమూల్ ముఠాల ఘర్షణలు, కొట్లాటలు రక్తపాతానికి దారి తీస్తున్నాయి. రోజులు గడుస్తున్నకొద్దీ వైరుధ్యాలు పెరుగుతున్నాయి. పార్టీలో క్రమంగా పెరుగుతున్న ఈ ఘర్షణలను ఎదుర్కోవటానికి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కొన్ని సభల్లో బహిరంగంగానే హెచ్చరికలు చేస్తున్నారు. గట్టి చర్యలు తీసుకుంటామని బెదిరిస్తున్నారు. నిజానికి ఈ ఘర్షణలు, చిరు యుద్ధాలు జరిగేది బజార్లలోనే అయినా వీటి మూలాలు మాత్రం పైస్థాయి వరకు వుంటున్నాయి. ముఖ్యమంత్రికి చాలా దగ్గరగా ఉన్న, విధేయులైన నాయకులే వివిధ ప్రాంతాల్లో ఒక్కొక్క ముఠాని పోషిస్తూ బలపరుస్తున్నారు. ఇవన్నీ తెలిసి కూడా కేవలం బెదిరింపులు లేక సూచనలు చేస్తూ తన బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఏ పార్టీ అయితే ఎటువంటి ఆదర్శం, సిద్ధాంతం ఆధారంగా ఏర్పడలేదో, రెండు చేతులా బావుకునే ఉద్దేశంతోనే అధికారం దఖలు పర్చుకునేందుకే ఏర్పడిందో, అటువంటి పార్టీలో ముఠా తగాదాలు సహజసిద్ధం. పార్టీలో అధికారం ఎవరికి ఎక్కువ ఉంటే వారు బజార్లు దఖలు పర్చుకోవడం కూడా మామూలే. బజార్లు ఎవరి స్వాధీనంలో ఉంటాయో వారికే మామూళ్ళు, దాదాగిరీ, లూఠీ చేసి బొక్కే అలిఖిత అధికారం ఉంటుంది. తృణమూల్ ప్రభుత్వం బెంగాల్‌లోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించలేదు సరికదా, వారు తప్పుదోవ పట్టే దారి చూపించింది. వారిని అధోగతి పాల్జేస్తూ నేర ప్రవృత్తిని అంటగడుతోంది. పర్యవసానం గా తృణమూల్ జెండా పట్టుకునేలా చేస్తోంది. సాధారణంగా నేరాలకు పాల్పడితే పోలీసుల భయం ఉంటుంది. కానీ తృణమూల్ పార్టీలో ఉంటే ఆ భయం ఉండదు అన్న భరోసా ఆ పార్టీ కల్పిస్తోంది. ఈ విధంగా యువకులను అంధకారంలోకి లాగేస్తోంది. ఈ చైతన్యం లేని అసహాయులు తమ ఉనికిని కాపాడు కోవడానికి తమలో తామే ఘర్షణ పడి చావును కొనితెచ్చుకుంటున్నారు. ఈ ఘర్షణల్లో సాధారణ ప్రజలు కూడా మరణిస్తున్నారు. వీరి బారి నుండి బెంగాల్‌ను రక్షించాలంటే 'తృణమూల్' అనే గుదిబండను దించడం తప్ప వేరే మార్గం లేదు.

వేదుల రామకృష్ణ

జన వాక్యం

ఇది తగదు

నటి శ్రీదేవి మరణం యావద్భారతాన్ని శోకంలో ముంచింది. ఆమె మరణించి ఆరు రోజులవుతున్నప్పటికీ అభిమానులు ఇంకా ఆ బాధ నుండి తేరుకోలేదు. అంత్యక్రియల్లో పాల్గొన్న జనాలను చూస్తుంటే ఆమె సంపాదించిన అభిమానం ఎటువంటిదో అర్థమవుతుంది. ప్రజల గుండెల్లో దేవకన్యగా ఆమె శాశ్వతంగా నిలిచిపోయింది. ఇది జగమెరిగిన వాస్తవం. ఇప్పటి వరకు మీడియా మొత్తం ఈ అంశాలనే పోటాపోటీగా ప్రసారం చేసింది. కానీ ఆమె వ్యక్తిగత జీవితం గురించి అభిమానులు నొచ్చుకునేలా గోరంతలు కొండంతలు చేసి ఇవ్వడం బాధాకరమైన విషయం. మీడియా సెన్సేషన్ కోసం ఏది బడితే అది ప్రసారం చేయడం సరికాదు. శ్రీదేవి నటన గురించిన కథనాలు, అంశాలు, ప్రసారం చేస్తే బావుండేది.

సిహెచ్ లక్ష్మి, విజయవాడ.

చావులోనూ అసమానత్వమే!

పుట్టుక నుండే కులం, మతం, జాతి, వర్గం, డబ్బు ఇలా ఎన్నో అంశాల వల్ల సగటు మనిషి సమాన హక్కులు కోల్పోతూనే ఉన్నాడు. శరీరం, శాశ్వతం కాదని అందరికీ తెలుసు. కానీ డబ్బు చేతిలో తోలు బొమ్మలా ఆడుతూనే ఉన్నాడు. బీదవాడు చనిపోతే అతని శరీరాన్ని శవం అని సంబోధించే ఈ ప్రజలు కాస్త ఆర్థిక పరిపుష్టి కలిగిన వారు మరణిస్తే మృతదేహం అంటారు. ఇంకాస్త డబ్బు ఉంటే మృతదేహం కాస్త భౌతిక కాయం అవుతుంది. డబ్బుతో పాటు పేరు సంపాదించి, మరణిస్తే పార్థివ దేహం అంటారు. వీటిలో అన్నింటికంటే విలువైనది శివైక్యం ఇది గురువులు, బాబాలకి వాడుతుంటారు. అసలు మరణం తర్వాత అందరి శరీరాలు మట్టిలో లేదా పంచ భూతాలలో కలుస్తాయి. మరెందుకు ఈ వివక్ష? ప్రాణం ఉన్నప్పుడు ఎలాగో సమానత్వం పొందలేక పోయాడు. కనీసం చనిపోయిన తర్వాత అయినా ఆ దేహానికి విలువ ఇవ్వరా! చనిపోయిన వారి దేహం ఎదురైతే నమస్కరించండి, అదేదో చూడరానిది అయినట్టు పారిపోకండి. రేపో మాపో మనం కూడా ఆ స్థితికి పోవాల్సిన వారమేనని గుర్తుంచుకోండి.

విరాజిత, ఇమెయిల్ ద్వారా


వ్యాసాలు, ఉత్తరాలు రాయవల్సిన చిరునామా
editpageps@gmail.com

మిల్లుల చేతిలో సుబాబుల్ రైతు గుల్ల

సమీక్ష



ఆంధ్రప్రదేశ్‌లో ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి, విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల్లో 30 లక్షల ఎకరాలల్లో సుబాబుల్ పంట విస్తరించింది. మూడేళ్లకు ఒకసారి ఈ పంట కోతకు వస్తుంది. ఎకరాకు 30-35 టన్నుల వరకు వస్తుంది. తేలిక నేలల్లో అయితే 20-25 టన్నులు మాత్రమే వస్తుంది. నీటి సౌకర్యం ఉన్న నల్లరేగడి భూముల్లో, భద్రాచలం పరిసరాల్లో 45 టన్నుల వరకు కూడా వస్తుంది. రాష్ట్రంలో ఒకే కంపెనీ కొనుగోలు చేయాలన్న నిబంధన ఎప్పటినుంచో వుంది. వరంగల్‌లో ఉన్న ఎపి రేయాన్స్, సిర్పూర్‌లో వున్న సిర్పూర్ కాగజ్‌నగర్ మిల్లులు ఇప్పటికే మూతబడ్డాయి. రాయలసీమ పేపరు మిల్లును చాలా కాలం క్రితమే మూసేశారు. ఇక ఇప్పుడు రాజమండ్రి ఐటీసి తప్ప సుబాబుల్, జామాయిల్ కొనుగోలుకు అవకాశాలు లేవు. దీంతో ఐటీసి యాజమాన్య సిబ్బంది కాంట్రాక్టు వ్యవస్థను తెచ్చారు. గతంలో మార్కెట్ కమిటీల ద్వారా కొనుగోలు చేసేవారు. అంటే మార్కెట్‌కు తెచ్చే వరకు సరుకుపై రైతు బాధ్యత ఉంటుంది. మార్కెట్ నుండి కంపెనీకి తీసుకెళ్లే బాధ్యతను కంపెనీ భరించాలి. ఈ నిర్ణయం మేరకు టన్నుకు సుబాబుల్ రూ.4508, జామాయిల్ రూ.4705కు కొనుగోలు చేయాలి. ఈ ధరను రైతులు, ఐటీసి మార్కెటింగ్ శాఖ కలిసి 2008లో నిర్ణయించారు. తర్వాత కాంట్రాక్టు వ్యవస్థను తెచ్చి రోజుకు కావాల్సిన 3,500 టన్నులను సరఫరా చేసే విధంగా నిర్ణయించారు. ఆ కాంట్రాక్టరు ఇద్దరు దళారీలను నియమించుకున్నాడు. ఒక్కొక్కరు మరో 10 మందిని నియమించుకున్నారు. వారు మరో 40 మందిని ఫీల్డ్ ఏజెంట్లుగా నియమించుకున్నారు. ఈ కాంట్రాక్టర్లు పంపిన కర్రనే కంపెనీలో తూకం వేస్తారు. అందువల్ల విధిగా కాంట్రాక్టర్ ద్వారానే కర్ర సేకరణ జరగాలి. కంపెనీ ఇచ్చే రూ.4508లో రూ.1000 కటింగ్, ట్రాన్స్‌పోర్ట్‌కు తీసివేయగా మరో రూ.1300 ఏజెంట్లు తీసుకుంటారు. టన్నుకు రూ.2,300 పోగా, రైతుకు రూ.2,300 మాత్రమే ఇస్తున్నారు. ఇంత దుర్మార్గం జరుగుతున్నా కంపెనీ ఏ మాత్రం పట్టించుకోదు. రైతాంగం అసంతృప్తితో ఆందోళనలకు దిగుతోంది. 2014-15లో పేపర్ మిల్లులకు 200 శాతం లాభాలు వచ్చాయి. ఆ లాభాలను ఇంకా పెంచుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలలో రైతులకిచ్చే ధరలో కోత పెడుతున్నారు.



సారంపల్లి మల్లారెడ్డి

వాస్తవాలేంటి ?

ప్రపంచంలో 42 దేశాలలో 346 కాగితపు ఉత్పత్తి మిల్లులు ఉన్నాయి. ఇవి కాక చిన్న తరహా మిల్లులు మరో 300 వరకు ఉంటాయి. థాపర్ గ్రూప్, బిర్లా, ఐటీసి కంపెనీలు మొదటి జాబితాలో ఉన్నాయి. ఐటీసి కేంద్ర కార్యాలయం కోల్‌కతాలోని జేఎల్ నెహ్రూ రోడ్డులో ఉంది. 1938లోనే ఈ కంపెనీలు స్థాపించారు. అయినా మన దేశంలో వినియోగానికి తగిన కాగితం ఉత్పత్తి లేదు. అమెరికాలో తలసరి వాడకం 450 కిలోలు, ఆస్ట్రేలియాలో 116 కేజీలు, ఇండోనేషియాలో 22 కేజీలు, మలేషియాలో 25 కేజీలు, చైనాలో 100 కేజీలు, యూరప్‌లో 220 కేజీలు ఉండగా భారత్‌లో 10 కేజీలు మాత్రమే ఉంది. మన దేశంలో 2010లో కాగితం ఉత్పత్తి 1200 కోట్ల టన్నులుండగా 2020 నాటికి 2,500 కోట్లకు పెరగాలని లక్ష్యం పెట్టుకున్నారు. అలా పెరిగినప్పటికీ తలసరి వినియోగం 19-20 కేజీలు మాత్రమే ఉంటుంది. ప్రపంచంలోని అతి చిన్న దేశాల కన్నా మన దేశంలో వినియోగం తక్కువగానే ఉంది. అయినా లక్ష్యం నెరవేరలేదు. ఏటా దేశంలో కాగితపు ఉత్పత్తిపై రూ.20 వేల కోట్లు మాత్రమే వ్యయం చేస్తున్నారు. రూపాయి నోట్లకు ఉపయోగించే కాగితం ఇప్పటికీ బెల్జియం నుండి దిగుమతి చేసుకుంటున్నాం. నోట్ల కాగితానికి దూదిని జత చేసి ఉత్పత్తి చేయాలి. ఒక టన్ను కాగితాన్ని ఉత్పత్తి చేయాలంటే, టన్ను కర్ర గుజ్జు కావాలి. ఒక టన్ను పల్పు తయారు కావడానికి మూడున్నర టన్నుల సుబాబుల్ కర్ర కావాలి. గతంలో బొంగులు వినియోగించారు. తరువాత చెరకు పిప్పితో పాటు రికవరీ చేసిన కాగితాన్ని కూడా వినియోగిస్తున్నారు. ఒక టన్ను కాగితానికి రూ. 70-80 వేల ధర ఉంటుంది. గుజ్జు ధర టన్నుకు రూ.35,000 ఉంటుంది. గుజ్జును ప్రాసెసింగ్ చేయడానికి రూ.12,000 ఖర్చవుతుంది. అంటే గుజ్జుపై టన్నుకు కనీసం రూ.20 వేల ఆదాయం వస్తుంది. మూడున్నర టన్నులకు కంపెనీ ధర ప్రకారం రూ. 15,750 అవుతుంది. ప్రాసెసింగ్‌కు మరొక రూ.10 వేలు అయినప్పటికీ రూ.25 వేలకు టన్ను గుజ్జు తయారవుతుంది. ప్రతి టన్ను గుజ్జుపై రూ.10 వేల వరకు లాభం వుంటుంది. కానీ కంపెనీ రైతులకు చెల్లిస్తున్నది టన్నుకు రూ.2,300 మాత్రమే. మిగిలిన రూ.2200 కటింగ్, ట్రాన్స్‌పోర్టుకు, కాంట్రాక్టర్ల కమీషన్ల కింద తీసుకుంటున్నారు. ఇన్ని వేల కోట్ల రూపాయల లాభం వస్తున్న కాగితపు పరిశ్రమల్లో రైతులను దివాళా తీయించి కంపెనీలు 200-300ల శాతం లాభాన్ని ఆర్జిస్తున్నాయి. గిట్టుబాటు కాక రైతులు ఉత్పత్తి విస్తీర్ణాన్ని తగ్గిస్తున్నారు. అత్యంత తక్కువ వినియోగం ఉన్న దేశంలో కాగితపు ఉత్పత్తి పెంచడానికి అనేక రెట్లు సుబాబుల్ పండించాలి. మిల్లుల సంఖ్యను విరివిగా పెంచాలి. ఎంత టెక్నాలజీ పెరిగినా అంతే మోతాదులో కాగితం వినియోగం పెరుగుతుంది. అందువల్ల ప్రతి టన్ను కర్రకు కనీసంగా రూ.6000 ప్రస్తుతం ఇవ్వాలి. అడవులలో కర్ర ఉత్పత్తి తగ్గింది. దానికి తోడు చెరకు పిప్పిని విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తున్నారు. పాత కాగితాలు ఏరినా, ఇతర ముడిసరుకును సంపాదించాలన్నా అవకాశం లేదు. ఇలాంటి స్థితిలో రైతులను ప్రోత్సహించి సుబాబుల్, జామాయిల్ పెంచాలి. కానీ కంపెనీ ఒకే ఒక్కటి కావడంతో నియంతగా సేకరణ ధరను తగ్గిస్తున్నారు. ఇక రానున్న కాలంలో కాగితపు ఉత్పత్తి, వినియోగం మరింత తగ్గుతుంది.

వాస్తవానికి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ఈ కంపెనీల స్థాపనపై ప్రత్యేక కేంద్రీకరణ పెట్టాలి. పెట్టుబడులు సేకరించి పెట్టడం ద్వారా నిరుద్యోగ సమస్య పరిష్కారమవుతుంది. దేశంలో ప్రత్యక్షంగా 50 వేల మంది, పరోక్షంగా 1.5 లక్షల మంది మాత్రమే పని చేస్తున్నారు. దేశానికి కాగితం ఉత్పత్తి అవసరం బాగా ఉంది. 70 సంవత్సరాలు గడిచినా, నేటికీ కాగితం దిగుమతి చేసుకోవడం దురదృష్టకరం. ఇప్పటికే వేల కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యం వృథా అవుతున్నది. ఉభయ తెలుగు రాష్ట్రాలల్లో లక్షల ఎకరాల భూమి బీడులుగా మారింది. తెలంగాణలో 50 లక్షల ఎకరాలు, మన రాష్ట్రంలో 35 లక్షల ఎకరాల పడావు భూములు వున్నాయి. ఈ భూములలో సుబాబుల్ కర్రను పెంచవచ్చు. మూడు సంవత్సరాలు గడిచిన తరువాతనే కటింగ్ చేయాలి. కానీ కర్ర కొరత ఏర్పడ్డప్పుడు 75 రోజులకే కటింగ్ చేస్తున్నారు. అటవీ శాఖలను మభ్యపుచ్చి ఆర్డర్లు సంపాదించి అడవిలో వేసిన కర్రను ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. లేదా ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకుంటున్నారు. ఆ విధంగా రైతులను బ్లాక్‌మెయిల్ చేసి ధరలు తగ్గిస్తున్నారు. పై గణాంకాలను చూస్తే గుజ్జు తయారీలోనూ, కాగితం తయారీలోనూ విపరీతమైన లాభాల మార్జిన్ ఉంటున్నది. కానీ ముడిసరుకు ఉత్పత్తి చేసే రైతులకు మాత్రం అన్యాయం జరుగుతోంది. కనీసం కంపెనీలు కుదుర్చుకున్న ఒప్పందాలను కూడా అమలు చేయడం లేదు. మార్కెట్ వరకు రైతు కర్రను తీసుకువస్తే అక్కడి నుండి కంపెనీకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కంపెనీపై ఉండగా, ఆ ఖర్చులు కూడా రైతులే భరించాలని కంపెనీలు కోరుతున్నాయి.

ప్రభుత్వ రంగంలోనైనా కాగితపు పరిశ్రమను స్థాపించాలి. అంతేకాక ఉభయ తెలుగు రాష్ట్రాలలో మూతపడిన పరిశ్రమలను తెరిపించాలి. ఆ ఫ్యాక్టరీలకు వస్తున్న లాభాలను ఇతర ఫ్యాక్టరీలకు మళ్లించడం ద్వారా నష్టాల్లోకి నెడుతున్నారు. వాస్తవానికి నష్టాలు వచ్చే సమస్యే లేదు. ఒక వైపున ఏటా కాగితం ధర పెరుగుతూనే ఉంది. అయినా నష్టాలను చూపి ప్రభుత్వ పన్నులు ఎగవేసి, బ్యాంకుల రుణాలకు కూడా ఎగనామం పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఉభయ రాష్ట్రాలు ప్రపంచ బ్యాంకు కనుసన్నల్లో నడుస్తున్నాయి. గత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.20 వేల కోట్ల విలువ చేసే ప్రభుత్వ కంపెనీల ఆస్తులు అమ్మి వేస్తే, ప్రస్తుత బిజెపి ప్రభుత్వం రూ.58 వేల కోట్ల ప్రభుత్వ వాటాలను ఉపసంహరించుకున్నది. రానున్న సంవత్సరంలో రూ.70 వేల కోట్ల ఆస్తులను ఉపసంహరించే ప్రణాళికలు రూపొందించింది. అందువల్ల ఎఫ్‌డిఐల ద్వారా బహుళ జాతి సంస్థలు ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయాల్సిందే తప్ప ప్రభుత్వ రంగంలో ఏర్పాటయ్యే అవకాశం లేదు. అయినా ప్రభుత్వాలు తమ విధానాలు మార్చుకొని ఉపాధి కల్పన, రైతుల ఉత్పత్తులకు లాభదాయకం అయ్యే విధంగా ప్రధానంగా కాగితపు పరిశ్రమను పెంచాలి. మూతబడిన పరిశ్రమలను పునరుద్ధరించాలి.

(రచయిత అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు, సెల్ : 9490098666)

మహిళోదయం 2

మహిళల ఆరోగ్యమే సమాజ ఆరోగ్యం. అవును ... మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం.. తద్వారా ఆ సమాజం ఆరోగ్యవంతంగా ఉంటాయి. నిరంతర శ్రమతో ఇంటిని తీర్చిదిద్దే ఆమె ఆరోగ్యంగా ఉంటేనే ఇంట్లో అంతా సుఖసంతోషాలతో ఉంటారు. ఆమెకే అనారోగ్యం సంభవిస్తే ఆ కుటుంబం నడక కుంటుపడినట్టే! కుటుంబ, సామాజిక వ్యవస్థల్లో ఇరుసులా కదలాడే ఆమె పట్ల, ఆమె ఆరోగ్యం పట్లా కనిపిస్తూ, కనిపించకుండా నిర్లక్ష్య ధోరణి వెన్నాడుతూ ఉంటుంది. పుట్టుకకు ముందు నుంచే మహిళల పట్ల ఉన్న చిన్నచూపు పుట్టిన తర్వాతా కొనసాగుతూనే ఉంది. తిండి నుంచి తిరుగాడే తీరు దాకా అబ్బాయి, అమ్మాయిల మధ్య వివక్ష.. ఆడామగా మధ్య అంతరం ... ఆరోగ్య విషయంలోనూ అదే వ్యత్యాసం!! నిజానికి స్తన్యం నుంచి సర్వస్వం ఆమె ద్వారానే కదా మానవాళికి అందేది..
మరి ఆమె ఆరోగ్యంగా లేకుంటే- అవని ఎలా ఆరోగ్యంగా ఉంటుంది?



ఆమె ఆరోగ్యం

అందరి మహాభాగ్యం



లహరికి పదహారేళ్ల వయసులోనే మేనమామ నగేష్‌తో పెళ్లయింది. ఆమె బామ్మ వృద్ధాప్యంలో ఉండడం వల్ల ఇంటిపనులేవీ చేసుకోలేకపోతోందని, వేరే సంబంధం అయితే సరిగా చూసుకుంటుందో లేదోనని, ఆస్తి బయటకు వెళ్లిపోకూడదని ... ఇలా రకరకాల కారణాలు చెప్పి కుటుంబసభ్యులు ఈ పెళ్లి చేసేశారు. పది పరీక్షలు రాసిన వెంటనే లహరి అత్తవారింట అడుగుపెట్టింది. శారీరకంగా, మానసికంగా పరిపక్వత లేని ఆమె నగేష్‌తో సంసారం. ఏడాది తిరక్కుండానే ఒక ఆడపిల్లకు జన్మనిచ్చింది. దానికిముందే పుట్టబోయేది ఆడబిడ్డ అని తెలిసి, అబార్షన్ చేయించాలని నగేష్, ఆమె కుటుంబసభ్యులు ప్రయత్నించారు. అప్పటికే పిండం ఎదుగుదలను బట్టి అబార్షన్ చేయడం కుదరదని డాక్టర్ చెప్పారు. కానీ, లహరి చేత నాటు మందులు తాగించారు. అది వికటించి, నెలలు నిండకుండానే ప్రసవం అయింది. ఒకవైపు మేనరికం, ఇంకోవైపు నాటుమందుల ప్రయోగం కారణంగా – ఆ పసిపాప అంగవైకల్యంతో పుట్టింది. వయసుకు, శరీరానికి మించిన భారం మోసి, లహరి కూడా అనారోగ్యం బారిన పడింది.

ఇది ఒక లహరి సమస్యే కాదు.. ఎంతోమంది మహిళలకు ఎదురయ్యే పరిస్థితి! అమ్మాయిలు అనగానే – ఇంట్లో అందరి పనులూ చేయడానికే పుట్టారు అనే భావం చాలామందిలో బలంగా ఉంది. ఇలాంటి స్పృహ కారణంగా చాలామంది మహిళలు కనీస ఆరోగ్యానికి దూరమైపోతున్నారు.

బీజప్రాయంలోనే ...

తల్లి కడుపులో ఉన్నప్పుడే ఆడశిశువుకు జీవన్మరణ సమస్య మొదలవుతుంది. గర్భంలో ఉన్న శిశువు ఎదుగుదల ఎలా ఉంది? అని తెలుసుకుని తగిన వైద్యం అందించేందుకు ఉపయోగపడాల్సిన స్కానింగ్‌ని కొందరు లింగనిర్ధారణకు వినియోగిస్తున్నారు. గర్భంలో ఉన్నది ఆడబిడ్డ అని తెలిస్తే కొందరు చిదిమేయడానికీ వెనుదీయడంలేదు. గర్భస్థ లింగ నిర్ధారణ నేరమని చట్టాలు ఉన్నప్పటికీ కొన్నిచోట్ల అమలుకావడం లేదు.

తల్లి ఆరోగ్యంపైనా వివక్షే

బిడ్డకు జన్మనిచ్చిన తల్లి ఆరోగ్యంపైనా కుటుంబాల్లో వివక్ష వెంటాడుతూనే ఉంది. కొందరు సంప్రదాయాల పేరుతో వారికి తగినంత ఆహారం పెట్టకపోవడం, ఆడబిడ్డకు జన్మనిచ్చిన సందర్భాల్లో ఈసడింపు మాటలతో కుంగదీయడం వంటివీ ఉంటున్నాయి. వరుసగా ఆడపిల్లలు పుడితే మగ సంతానం కోసం వేచిచూడడమూ తల్లి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది.



ఎదిగేకొద్దీ ఎన్నో సవాళ్లు

అమ్మాయిలు ఎదిగేకొద్దీ ఎదురయ్యే సవాళ్లకు అంతే లేదు. పాఠశాలకు వెళ్లే అమ్మాయిలకు తగినంత పౌష్టికాహారం ఇవ్వకపోవడం వల్ల రక్తహీనత వెంటాడుతోంది. పాఠశాలలు, వసతిగృహాలు, విద్యాసంస్థల్లో మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉండడం వల్ల బాల్యం నుంచే మూత్ర సంబంధిత ఇన్ఫెక్షన్ల సమస్య ఎదురవుతుంది. యుక్తవయసు బాలికలకు మరో సమస్య నెలసరి రుతుక్రమం. దానిని అంటరాని సమస్యగా చూడడం, అత్యంత రహస్య అంశంగా మారిపోవడం – పరోక్షంగా అనారోగ్య సమస్యలకు హేతువవుతోంది. తరగతిగదిలో ఉన్నప్పుడు రుతుస్రావం జరిగితే తగిన తోడ్పాటునిచ్చే ఏర్పాట్లు ఏమీ ఉండవు. అలాగే శ్రామిక మహిళలూ ఇలాంటి ఇబ్బందులనే ఎదుర్కొంటున్నారు. దీంతో, అదొక వెంటాడే మానసిక, శారీరక అసౌకర్యంగా మారిపోతోంది. తమిళనాడులో ఇదే సందర్భంలో ఒక బాలికను ఉపాధ్యాయురాలు హేళన చేయడంతో ఆ బాలిక ఆత్మహత్యకు పాల్పడడం ఆవేదన కలిగించే సంఘటన. శ్రామిక మహిళలూ సరైన మరుగుదొడ్ల సదుపాయం లేక, మూత్రసంబంధ సమస్యలకు గురవుతున్నారు. విద్యార్థినులకు వారి శరీర నిర్మాణం, హార్మోన్ల మార్పులు, రుతుక్రమం సమయంలో జాగ్రత్తలు, శానిటరీ ప్యాడ్స్, పరిశుభ్రత వంటి విషయాలపై అవగాహన కల్పించాల్సి ఉంది. మహిళలకూ గర్భాశయ సమస్యలపై, క్యాన్సర్ వంటి వ్యాధులబారిన పడకుండా అవగాహనా శిబిరాలు నిర్వహించాల్సిన ఆవశ్యకత ఉంది. ప్రభుత్వాలే విద్యార్థినులకు, మహిళలకు ఉచితంగా శానిటరీ ప్యాడ్స్ అందజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిర్లక్ష్యం చేస్తే ...

బాల్యం నుంచి ఆడపిల్లలకు ఎదురయ్యే ఆరోగ్య నిర్లక్ష్యం వారు పెద్దయ్యాక – అనేక అనారోగ్యాల ముట్టడికి కారణం అవుతోంది. సమయానికి ఆహారం తీసుకోకపోవడం, అవసరమైనంత తీసుకోకపోవడం వంటి అలవాట్లు.. తీవ్ర మానసిక ఒత్తిళ్లు.. చిన్న వయసు నుంచే గ్యాస్ట్రిక్ ట్రబుల్, కడుపులో నొప్పి, మంట, అధిక బరువు, ఊబకాయం, మొటిమలు, భుజాల మీద, వీపుమీద పొక్కులు వంటి సమస్యలకు దారి తీస్తాయి. చిన్న వయసులోనే రుతుస్రావం ప్రారంభమవడం, కొందరిలో ఎక్కువ వయసు వరకూ రుతుక్రమం మొదలు కాకపోవడం – ఇలా ఎన్నో సమస్యలు ఎదురవుతాయి. అపక్రమ రుతుస్రావం, అధికస్రావం, విపరీతమైన కడుపునొప్పి, నడుం నొప్పి, తలనొప్పి, రకరకాల కీళ్లనొప్పులు, థైరాయిడ్ సమస్యలు, మూత్రాశయ, గర్భాశయ సమస్యలు ... వంటివి మహిళల ఆరోగ్యాన్ని కుంగదీస్తూనే ఉంటాయి.

ప్రభుత్వ శ్రద్ధ అంతంతే!

ఇలాంటి స్థితిలో మహిళల ఆరోగ్య పరిరక్షణలో కుటుంబమూ, ప్రభుత్వమూ తగు జాగ్రత్త వహించాలి. ప్రభుత్వం మహిళా శిశుసంక్షేమశాఖ కొంత ప్రయత్నం చేస్తున్నా – అది సరిపోవటం లేదు. ప్రభుత్వాలు ప్రైవేటు వైద్యాన్ని ప్రోత్సహించే క్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలనూ, ప్రభుత్వాసుపత్రులనూ పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఈ ప్రభావం ఆర్థిక స్వాతంత్ర్యం లేని మహిళలపై ఎక్కువగా పడుతుంది. ఖరీదైన వైద్యాన్ని పొందలేక అర్థాంతరంగా జీవితాలను చాలిస్తున్న మహిళలు ఎంతోమంది ఉన్నారు. ఈ పరిస్థితి మారాలంటే మహిళలకు తగిన పౌష్టికాహారం అందించాలి. లింగ వివక్ష పోవాలి. అది మహిళలు తమ శరీరాల పట్లా, తమ ఆరోగ్యం పట్లా సరైన అవగాహనను పెంచుకోవాలి. సంపూర్ణ ఆరోగ్యానికి ఒక చక్కని కార్యాచరణతో ముందుకు సాగాలి.

- బెందాళం క్రిష్ణారావు

అపోహలు అధిగమించాలి



సమాజ గమనానికి కీలకమైన మహిళలు ఆరోగ్యంగా ఉండడం చాలా అవసరం. మహిళలూ ఆరోగ్యస్పృహతో ఉండాలి. ఎంతమాత్రం నిర్లక్ష్యం పనికిరాదు. తమ కుటుంబం కన్నా తమ శరీరంపై, దాని ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి. మహిళలు అపోహలను అధిగమించి, సకాలంలో సరైన చికిత్స తీసుకున్నట్లయితే – మహిళల ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుంది. కొన్నిసార్లు మహిళలు తమ సమస్యలు గుర్తించి, వాటిని బయటపెట్టేసరికి వ్యాధి ముదిరి ప్రాణం మీదకు వస్తుంది. నిజానికి అనారోగ్య సమస్య ఉండని మహిళలు ఉండరు. కానీ తమ ఆరోగ్యం గురించి వారు పట్టించుకోరు. వారు గుర్తించినా, ఇంట్లోవాళ్లు వాళ్లను పట్టించుకోరు. అశ్రద్ధ, నిర్లక్ష్యం వంటి కారణాల వల్ల సమస్య బాగా ముదిరిపోతుంది. ఒక మహిళ ఆరోగ్యంగా ఉంటే- ఇంటినీ, సమాజాన్నీ ఆరోగ్యంగా ఉంచటంలో ఆమె పాత్ర కీలకంగా ఉంటుంది.

- డాక్టర్ దలాయి శాంతిశ్రీ ఎండి,
గైనకాలజిస్ట్, సోంపేట, శ్రీకాకుళం జిల్లా

న్యాయ సలహా

నేను కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నాను. అప్పుడు నాకు 17 సంవత్సరాలు నిండాయి. మా నాన్న నా మీద కేసు పెట్టారు. నా భర్తకి రిమాండు విధించారు. బెయిల్ మీద బయటకొచ్చారు. నాకు అబార్షన్ అయి, ఆస్పత్రిలో ఉన్నప్పుడు ఆయన వాయిదాకి హాజరు కానందువల్ల బెయిల్ క్యాన్సిల్ చేసి, మళ్లీ జైలుకు పంపారు. ఇప్పుడు మా నాన్న రాజీకి వచ్చారు. కేసు చివరిదశలో ఉంది. మేము రాజీపడొచ్చా?

- రమ్య, హిందూపూర్.

మైనారిటీ తీరాకే పెళ్లి

ఒక్క ఏడాది ఆగి ఉంటే మీ ఇద్దరికీ ఇన్ని సమస్యలు ఉండేవి కావు. ప్రేమవివాహాల పేరుతో కేవలం వ్యామోహ కారణంగా యువత కోరి కోరి సమస్యలు తెచ్చుకుంటున్నారు.

మైనారిటీ తీరే వరకూ చదువు ద్వారా మంచి భవిష్యత్తుకి పునాది వేసుకోవాలి. ఒకవేళ ప్రేమ బాట పట్టినా పెద్దలను ఒప్పించి, మైనారిటీ తీరాక పెళ్లిచేసుకోవాలి. అంతేతప్ప మైనారిటీ తీరకుండా పెళ్లి చేసుకోవడమో, తొందరపడి ఆత్మహత్యలు చేసుకోవమో చేయకూడదు.



జీవితంలో ఆవేశంతో ఏ పనీ చెయ్యకూడదు. ఆలోచన ఉండాలి. పర్యవసానాల యోచన చెయ్యాలి. ప్రేమికుల కన్నా కాముకులే సమాజంలో ఎక్కువగా ఉంటున్నారు. కాబట్టి ఆడ–మగ స్నేహాల పట్ల హెచ్చరికగా ఉండాలి. సెల్‌ఫోన్ల సంబంధాల వల్ల అనేక చిక్కులు కలుగుతున్నాయి.

బాయ్‌ఫ్రెండ్ పిలవగానే వెళ్తే ఎలాంటి అఘాయిత్యమైనా జరగవచ్చు. ప్రకాశం జిల్లాలో జరిగిన దుర్మార్గమే ఇందుకు ఉదాహరణ. వాళ్లు తమ స్నేహితురాలి మీద అత్యాచారయత్నం చేయడమే గాక, సెల్‌ఫోన్ చిత్రీకరించారు. ఇప్పుడు కటకటాల పాలయ్యారు.

ఏదో జరిగేదాకా నిర్లక్ష్యంగా ఉండకూడదు. మనకేమీ జరగదులే అనే భ్రమా మంచిది కాదు. ఆడపిల్లలు తల్లిదండ్రుల సూచనలు, జాగ్రత్తలు మన మంచికోసమే అనేది ఆలోచించాలి. అప్పుడు సమస్యలకి అవకాశం ఉండదు. మీ కేసులో ఆరోపణలు తీవ్రంగా ఉంటే రాజీ కష్టం. ఏయే సెక్షన్ల కింద ఆరోపణలు ఉన్నాయో మీ లాయరుగారు చూసి ఉంటారు.

ఐపిసి 266 అయితే కిడ్నాపింగ్, పెళ్లికి బలవంతం చెయ్యడమనే ఆరోపణ ఉంటుంది. కేసులో రాజీ (Compoundable) పడేవి, రాజీ పడనివి (non-compoundable) అనే రెండురకాలు ఉంటాయి.

ఐపిసి 366 రుజువైతే పదేళ్ల జైలు, జరిమానా పడొచ్చు. ఏది ఏమైనా పబ్లిక్‌ప్రాసిక్యూటర్‌తో మీ లాయరు చేత మాట్లాడించండి. రాజీకి సహకరించమని కోరమనండి. ఒకవేళ 'పోక్సో' (pocso) చట్టం ఆరోపణలు ఉంటే, కేసు తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మీ తండ్రి రాజీకి అంగీకరిస్తున్నాడు గనక, రాబోయే వాయిదాలో ఆయన చేత 'రాజీ ప్రతిపాదన' జడ్జి గారికి చెప్పమనండి. పబ్లిక్ ప్రాసిక్యూటరు సహకరిస్తే, మీ కేసుని కోర్టు తన విచక్షణాధికారంతో సానుభూతిగా పరిశీలించవచ్చు.

మీ ప్రయత్నం మీరు చెయ్యండి. దురదృష్టవశాత్తూ శిక్షపడినా అప్పీలుకి అవకాశం ఉంది. కొత్తసాక్ష్యాలకు కింది కోర్టు అనుమతి కోరాలి. లభించకపోతే హైకోర్టుకి వెళ్లాలి. అయితే, కేసుల వత్తిడి వల్ల అందుకు ఆలస్యం పట్టొచ్చు. మీ లాయరుగారి సలహాలు పాటించండి. ★

కాటూరు రవీంద్ర త్రివిక్రమ్
హైకోర్టు న్యాయవాది, విజయవాడ.
ఫోన్ నెం : 8330968901
ఇ మెయిల్ : katururavindra trivikram@gmail.com



మీ కోసం



రోజూ కొద్దిగా బెల్లం తింటే రక్తంలో ఐరన్ శాతం పెరుగుతుంది.

జీవన సౌరభం

నిజమైన అందం ఆమె ఆరోగ్యంతోనే..

మెడనొప్పికి నో చెబుదాం!


ప్రస్తుత జీవనశైలిలో మెడనొప్పి ఒక సాధారణ సమస్యగా మారింది. దాని నుంచి ఉపశమనానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.

- ✧ విపరీతమైన పని ఒత్తిడి, కూర్చునే పద్ధతిలో మార్పు వల్లా మెడనొప్పి వచ్చే అవకాశం ఉంది.
- ✧ ఎక్కువసేపు కూర్చొని పనిచేసేవాళ్ళు మధ్య మధ్యలో కాస్త అటూ ఇటూ తిరిగితే కాస్త ఉపశమనం కలుగుతుంది.
- ✧ బరువులు ఎత్తేటప్పుడు వంగి ఎత్తకుండా ఒక కాలిమీద కూర్చుని బరువు ఎత్తితే మెడపై భారంపడదు.
- ✧ ఎక్కువ సమయం బోర్లాపడుకోకూడదు.
- ✧ మెడనొప్పి ఉన్నప్పుడు తలకి దిండు వాడకూడదు. మెత్తని చీర వంటి వస్త్రాన్ని రౌండుగా రోల్ చేసిన మెడకు వీపుకు మధ్య ఖాళీలో పెట్టుకుని పడుకోవాలి.
- ✧ మెడ వాచినప్పుడు వేడినీటితో కాపడం పెడితే కొంతమేర ఉపశమనం కలుగుతుంది.
- ✧ మెడనొప్పి మరీ తీవ్రంగా ఉంటే ఆలస్యం చేయకుండా డాక్టర్‌ని సంప్రదించాలి.

★



సహజరంగుల కేళి సంబరాల హోలీ



చిన్నాపెద్దా తేడా లేకుండా ఉల్లాసంగా.. ఉత్సాహంగా రంగులు చల్లుకునే సరదా పండగ హోలీ. రంగునీళ్లతో తడిసి ముద్దవుతూ.. కేరింతలు కొట్టే వసంతోత్సవం.. అయితే ఈ రంగుల పండగను ఆరోగ్యంగా జరుపుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. నేడు పర్యావరణ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో హోలీ సహజరంగుల సమ్మిళితమైతేనే సమ్మతం. కృత్రిమ, రసాయన రంగులతో ఆరోగ్యం పాడుచేసుకోవద్దన్న ఉద్యమం ఇప్పుడు ఊపందుకుంది. అంతేకాదు పర్యావరణానికి హితవుగా ఉండే పూలు, పళ్లు, కాయగూరలతో అత్యంత సహజమైన రంగులను తయారుచేసుకుంటే.. ఆరోగ్యానికి ఆరోగ్యం.. ఆనందానికి ఆనందం.. మోదుగపూలతో ఎరుపురంగు, మన ఇంట్లో వాడే పసుపు, పాలకూరతో ఆకుపచ్చరంగు, ఇలా ఎండిన ఆకులు, బీట్రూట్, నల్లద్రాక్ష, వంకాయ వంటివాటినీ ఉపయోగించి బోలెడన్ని సహజరంగులు సిద్ధం చేసుకోవచ్చు. అప్పుడు ఇలా సహజరంగుల కేళి, సంబరాల హోలీ కాక మరేమవుతుంది. అప్పుడు నిజంగానే చిన్నాపెద్దకే కాదు పర్యావరణానికీ ఆనందకేళి.



వసంతాగమనంలో వచ్చే రంగుల పండగను మణిపురిలో వినూత్నంగా, విభిన్నమైన వాతావరణంలో అనుబంధాలకేళిగా చేసుకుంటారు. చిన్నాపెద్దా అందరూ క్రమశిక్షణతో మెలుగుతూ, కొత్త వస్త్రాలు ధరించి, ఆడి పాడతారు. బృందాలుగా మారి విద్వేషాలను మరిచి, అందరు హాయిగా కలిసిమెలిసి ఉండాలనే సందేశాన్ని ఇస్తారు. ఇదే ఇక్కడ ప్రత్యేకత. ప్రధానంగా జానపద పాటలు, నృత్యాలతో అలరిస్తారు. ఈ పండగ సందర్భంగా పిల్లలకు, మహిళలకు రకరకాల ఆటలపోటీలూ నిర్వహిస్తారు. దీన్ని వీళ్లు 'యోసంగ్' అని పిలుస్తారు. చలికాలానికి వీడ్కోలు పలుకుతూ వసంతానికి ఆహ్వానం పలుకుతూ జరిగే ఈ హోలీకేళీని ఆస్వాదించాలంటే మణిపూర్ వెళ్లి తీరాల్సిందే. ★

సెన్సెక్స్ ⬇ 137
34,046

నిఫ్టీ ⬇ 35
10,458

రూపాయి ⬆ 01 పై॥
అమెరికా డాలరుకు రూ.
65.6



హైదరాబాద్‌లో టాటా, బోయింగ్ సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన హెలీక్యాప్టర్ల తయారీ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి నిర్మలా సీతారామన్, టాటా గ్రూపు అధినేత రతన్ టాటా, తెలంగాణ ఐటి శాఖ మంత్రి కెటిఆర్, బోయింగ్ ఇండియా ప్రెసిడెంట్ ప్రత్యూష్ కుమార్.

తయారీ రంగం పుంజుకుంది : నిర్మలా సీతారామన్

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

దేశంలో తయారీ రంగం పుంజుకుందని రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. హైదరాబాద్‌లో వైమానిక రంగానికి చెందిన టాటా అడ్వాన్స్ సిస్టం అండ్ బోయింగ్ జాయింట్ వెంచర్ ఆధ్వర్యంలో ఆదిభట్లలో ఏర్పాటు చేసిన బోయింగ్ విమాన విడిభాగాల తయారీ యూనిట్‌ను ఆమె ప్రారంభించారు. వైమానిక సెజ్‌లో 13ఎకరాల్లో రూ.200కోట్లతో పరిశ్రమను నిర్మించారు. బోయింగ్ ఎహెచ్-64 విమానాల విడిభాగాలకు తోడు అపాచీ హెలికాప్టర్లను ఇందులో తయారు చేస్తున్నారు. వీటికి అమెరికా సహా 15దేశాల్లో బాగా డిమాండ్ ఉంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రక్షణ రంగంలో పెట్టుబడులు పెడుతున్న టాటా, బోయింగ్ కంపెనీలను ఆమె ప్రశంసించారు. 2014 మే తర్వాత తయారీ రంగం బాగా పుంజుకుందన్నారు.

స్వాతంత్ర్యం నుంచి కూడా టాటా గ్రూపు భారత వృద్ధి రేటులో కీలక పాత్ర పోశిస్తూ వస్తుందన్నారు. ఆదిబాట్లలో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌ను కేవలం ఏడాదిన్నరలోనే అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు. గడువు సమయం కంటే ముందే దీన్ని అందుబాటులోకి తెచ్చిన టాటా, బోయింగ్ సంస్థలకు హేట్సప్ అన్నారు. యువత అతి తక్కువ కాలంలోనే శిక్షణ పొంది అంతర్జాతీయ స్టాండర్డ్ కంపెనీలో పని చేయడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి కెటి రామారావు, టాటా సన్స్ మాజీ చైర్మన్ రతన్ టాటా, రక్షణ మంత్రిత్వశాఖ సలహాదారు సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

గ్లెన్‌మార్క్ నుంచి 'నౌర్కిన్'

జుట్టు రాలు సమస్యలకు పరిష్కారం



ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ప్రముఖ ఔషద ఉత్పత్తుల కంపెనీ గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్స్ మహిళల జుట్టు రాలు సమస్య పరిష్కారం కోసం 'నైర్కిన్'ను అందుబాటులోకి తెచ్చినట్లు ఆ కంపెనీ తెలిపింది. గురువారం హైదరాబాద్‌లో ఈ టాబ్లెట్లను గ్లెన్‌మార్క్ ఇండియా సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజేశ్ కపూర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మహిళలు ఆరు నెలల పాటు రోజుకు రెండు సార్లు ఈ టాబ్లెట్లను వాడటం ద్వారా జుట్టు రాలు సమస్య నుంచి బయటపడొచ్చన్నారు. దేశంలో 9 కోట్ల మంది స్త్రీలు ఈ సమస్యతో బాధపడుతున్నారన్నారు. డెన్మార్క్ కేంద్రంగా పని చేస్తున్న ఫార్మా మెడికోతో ఉన్న లైసెన్సింగ్ ఒప్పందంలో భాగంగా భారత్‌లో దీన్ని తాము మార్కెట్ చేస్తున్నామ న్నారు. ఇది శాస్త్రీయంగా నిరూపించబడిందన్నారు. బ్రిటన్, యూరప్‌లో నౌర్కిన్‌లో మంచి గుర్తింపు ఉందన్నారు. ప్రస్తుతం ఇది 40 దేశాల్లో లభ్యమవుతుందన్నారు.

మూడో రోజూ నష్టాలే..

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజూ నష్టాలు చవి చూశాయి. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో జిడిపి వృద్ధి రేటు సానూకూలంగా నమోదైనప్పటికీ, అంతర్జాతీయ పరిణామాలు బలహీనంగా ఉండటంతో గురువారం మదుపర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. ముఖ్యంగా అమెరికా ఫెడరల్ రిజర్వు మరో మారు వడ్డీ రేట్లు పెంచనుందన్న అంచనాలు మార్కెట్ల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జనవరి కాలంలో భారత విత్త లోటు 6.77 లక్షలకు చేరింది. 2017-18లో ప్రభుత్వం వేసిన రూ.5.94 లక్షల కోట్ల అంచనాల కంటే ఎక్కువ. పది నెలల కాలంలోనే విత్త లోటు 113.7 శాతానికి చేరడం మదుపర్ల విశ్వాసాన్ని దెబ్బతీసింది. మరోవైపు బ్యాంకింగ్ షేర్ల పతనం కొనసాగింది. ఈ పరిణామాల మధ్య గురువారం బిఎస్ఇ సెన్సెక్స్ 137 పాయింట్లు కోల్పోయి 34,047కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 34.50 పాయింట్లు తగ్గి 10,458 వద్ద ముగిసింది. బిఎస్ఇలో మిడ్‌క్యాప్ 0.61 శాతం, స్మాల్‌క్యాప్ 0.24 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీలోని అన్ని రంగాల సూచీలు నష్టాలను చవి ఊశాయి. నిఫ్టీ 50సూచీల్లో 32 నష్టపోగా, 18 స్వల్ప లాభాలను నమోదు చేశాయి. పిఎస్‌యు బ్యాంకుల సూచీలు 1.87 శాతం విలువ కోల్పోయాయి.

రుణాలు ప్రియం



వడ్డీ రేట్లు పెంచిన ఎస్‌బిఐ
అదే బాటలో పిఎన్‌బి
తక్షణమే అమలు

ఎస్‌బిఐ వడ్డీ రేట్లలో మార్పులు

కాలం	ఇది వరకు వడ్డీ %	సవరించిన రేటు %
పక్షం	7.7	7.8%
నెల వారి	7.8	7.8
3 నెలలు	7.85	7.85
6 నెలలు	7.9	8
ఒక్క ఏడాది	7.95	8.15
రెండేళ్లు	8.05	8.25
మూడేళ్లు	8.1	8.35

ముంబయి : రుణ గ్రహీతలకు చేదు వార్త. పలు బ్యాంకులు రుణాలపై వడ్డీ రేట్లను పెంచాలని నిర్ణయించింది. దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ విత్త సంస్థలు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచాయి. దీంతో గృహ రుణ ఇఎంఐలు భారం కానున్నాయి. భారీగా పెరుగుతున్న మొండి బాకీల, నిర్వహణ వ్యయాలను తట్టుకోవడానికి ఈ బ్యాంకులు వడ్డీ రేట్ల పెంపునపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇంతక్రితం రోజే ఖాతాదారులకు అనుకూలంగా ఎస్‌బిఐ ఫిక్సుడ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచింది. తక్కువ మొత్తం, భారీ మొత్తం డిపాజిట్ రేట్లను 0.75శాతం పెంచింది. ప్రస్తుతం బ్యాంకు నిధుల వ్యయం ఆధారంగా రుణరేట్లను(ఎంసిఎల్ఆర్) నిర్ణయిస్తోంది. అంటే బ్యాంకు నిధులు సమీకరించే వ్యయం(డిపాజిట్ రేట్లు) ఏ మాత్రం పెరిగినా, ఆ ప్రభావం రుణరేట్లపై కూడా పడుతుంది. ఈ లోటును భర్తీ చేసుకోవడానికి అప్పులపై భారాన్ని పెంచాలని భావించి ఉంటుంది. దీంతో రుణ గ్రహీతలకు వాయిదాల చెల్లింపు భారం కానుంది.

ఎస్‌బిఐ వార్షిక ఎంసిఎల్ఆర్ రేటును పెంచుతూ గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. తాజా పెంపుతో వార్షిక ఎంసిఎల్ఆర్ 8.15 శాతానికి చేరింది. ఇది వరకు ఇది 7.9 శాతంగా ఉంది. కాగా 2016 ఏప్రిల్ తరువాత తొలిసారి రుణాలపై వడ్డీరేట్లను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పిఎన్‌బి కూడా వడ్డీరేట్లను పెంచిది. వార్షిక ఎంసిఎల్ఆర్‌ను 8.30శాతానికి చేర్చింది. పెంచిన వడ్డీ రేట్లు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు ఎస్‌బిఐ, పిఎన్‌బి రెండూ ప్రకటించాయి. అతి త్వరలోనే ప్రయివేటు విత్త దిగ్గజాలు ఐసిఐసిఐ బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులు కూడా వడ్డీ రేట్లను సమీక్షించనున్నాయని తెలుస్తోంది. సాధారణంగా ఎస్‌బిఐ తీసుకున్న నిర్ణయాల బాటలోనే ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా నడుస్తుంటాయి. ఈ క్రమంలో ఇతర పిఎస్‌బిలు కూడా రెండు, మూడు రోజుల్లో రుణాలపై వడ్డీ రేట్లను పెంచనున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

పరిపాలన సామర్థ్యం పెరగాలి : ఎస్‌బిఐ చీఫ్



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంకులు పరిపాలన, మౌలిక వసతుల సామర్థ్యాన్ని పెంచుకోవాలని ఎస్‌బిఐ చీఫ్ రజ్నీష్ కుమార్ సూచించారు. కార్పొరేట్, రిస్కు, గవర్నెన్స్ సామర్థ్యాలను పెంచుకోవడం ద్వారా నిర్వహణ రిస్కు, సవాళ్లను ఎదురుకోవచ్చని అన్నారు. ఇప్పటి వరకు వీటిల్లో వెనుకబడి ఉన్న సంస్థలు వెంటనే సమకూర్చుకోవాలని పిఎస్‌బిలకు సూచించారు. బ్యాంకుల్లో జరుగుతున్న మోసాలపై రజ్నీష్ మాట్లాడుతూ ఎస్‌బిఐ ఇలాంటి వాటిని ఎదుర్కోవడానికి సిద్దంగా ఉందన్నారు. విదేశాల్లోని శాఖల విలీనం వ్యవహారం కొత్తదేమీ కాదన్నారు. ప్రభుత్వం ఈ ఎజెండాతోనే పని చేస్తుందన్నారు. తాము కూడా ఈ నెల చివరి కల్లా నిర్వహణ వ్యయాలు తగ్గించుకోవడానికి చర్యలు తీసుకుంటుందన్నామన్నారు. గతే మూడేళ్లుగా విదేశాల్లోని ఎస్‌బిఐ శాఖలను హేతుబద్దీకరిస్తున్నామన్నారు. పారీస్ శాఖను కార్యాలయంగా మార్చామని, జెడ్డా ఆఫీసును మూసివేశామన్నారు. వ్యాపార విలువ, లాభదాయకతను బట్టి ఆయా ప్రాంతాల్లో శాఖలు ఉండాలా? వద్దా ? అనేది నిర్ణయిస్తామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా రెగ్యులేటరీ నియంత్రణలు పెరుగుతున్నాయన్నారు. దీంతో తమకు హేతుబద్దీకరణ తప్పా మరో అవకాశం లేదన్నారు. నీరవ్ మోడీ రూ.11500 కోట్ల మోసం పిఎన్‌బిని ఏమీ చేయలేదని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

రెనాల్ట్ డస్టర్ ధర తగ్గింపు


హైదరాబాద్ : కార్ల తయారీ కంపెనీ రెనాల్ట్ ఇండియా తన ఎస్‌యువి డస్టర్‌పై లక్ష రూపాయల వరకు ధర తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ వర్షన్‌లో ఇది వరకు ఈ కారు ధర రూ.8.5 లక్షల నుంచి రూ.10.24 లక్షలుగా ఉంది. తాజాగా రూ.7.95 లక్షల నుంచి రూ.9.95 లక్షలుగా నిర్ణయించింది. డీజిల్ వర్షన్‌లో డస్టర్ ప్రస్తుతం ఎక్స్‌షోరూంలో రూ.8.95 లక్షల నుంచి రూ.12.79 లక్షలకు అందుబాటులోకి వచ్చింది. ఇంతక్రితం దీని ధర రూ.9.45 లక్షల నుంచి రూ.13.79 లక్షలుగా ఉంది. దీంతో ఈ కారుపై రూ.29,746 రూపాయల నుంచి లక్ష రూపాయల వరకు ధర తగ్గిస్తున్నట్టు ఆ కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది.

Zoomcar
Self-Drive For The Self-Driven

జూమ్‌కార్ నుంచి 'జాప్' సబ్‌స్క్రైబ్

హైదరాబాద్ : సెల్ఫ్ డ్రైవ్ మొబిలిటీ సేవలందిస్తున్న జూమ్‌కార్ కొత్త సబ్‌స్క్రిప్షన్ మోడల్ జాప్‌ను ప్రవేశపెట్టింది. దీని ద్వారా వ్యక్తిగత వాహన వినియోగదారులు నెలవారి ఫిక్సుడ్ ధరల్లో కొత్త, పాత కార్లను అద్దెకు పొందవచ్చని ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. అద్దె రూపంలో సులభంగా వాహనం పొందాలనుకునే వారికి ఇది చాలా సౌలభ్యంగా ఉంటుందని జూమ్‌కార్ సిఇఒ గ్రేగ్ మోరన్ పేర్కొన్నారు. నెలకు కనీస అద్దె రూ.18,999 నుంచి కార్లు లభిస్తాయన్నారు. ఫిబ్రవరి 15 నుంచి హైదరాబాద్‌తో పాటు ముఖ్య నగరాల్లో సహా ఫ్రీసేల్‌ను ఆఫర్ చేస్తున్నట్లు తెలిపారు. 6, 12, 18, 24 మాసాల గడువుతో ఈ వాహనాలను పొందవచ్చన్నారు.

విజేత





S.LENIN BABU
LECTURER IN MATHS
GOVERNMENT
POLYTECHNIC COLLEGE
VIJAYAWADA. PH : 9985476035

MATHAMETICS FOR DSC/ RRB

PRACTICE PAPER - 1

Percentage

Important facts and formulas

1. Concept of percentage : By certain percent we mean that many hundreds written as X %

To express x % as a fraction we have x = x/100

Thus 20% = 20/100 = 1/5;

48% = 48/100 = 12/15, etc..

To express a/b as a percent: we have a/b = (a/b x 100)%

Thus ¼ = (1/4 x 100) = 25% ; 0.6 = 6/10 = 3/5 = (3/5 x 100) = 60%

2. If the price of commodity increases by R % then the reduction in consumption so as not increases the expenditure is

$$\left[\frac{R}{100 + R} \times 100\right]\%$$

If the price of a commodity decreases by R %, Then the increase in consumption so as not to decrease the expenditure.

$$\left[\frac{R}{100 - R} \times 100\right]\%$$

3. Results on population : let the population of a town be P. now and suppose it increases at the rate of R % per annum then

1. Population after n years = P (1 + R/100)n

2. Population n years ago = $\left[\frac{p}{\left[1 + \frac{R}{100}\right]^n}\right]$

4. Results on depreciation : let the percentage value of a machine be P. suppose it depreciates at the rate of R % per annum. then

1. Value of the machine after n years = P $\left[1 - \frac{R}{100}\right]^n$

2. Value of the machine n years ago = $\frac{p}{\left[1 - \frac{R}{100}\right]^n}$

1. The ratio 5 : 4 expressed as percentage equals
a. 12.5% b. 40%
c. 80% d. 125 %

2. 3.5 can be expressed in terms of percentage as
a. 0.35% b. 3.5%
c. 35% d. 350%

3. Half of 1 percent can be written in the decimal form as
a. 0.005% b. 0.05%
c. 0.02% d. 0.2%

4. What 15% of rupees 34?
a. Rupees 3.40 b. Rupees 3.75
c. Rupees 4.50 d. Rupees 5.10

5. 63% of 3 4/7 is
a. 2.25 b. 2.40
c. 2.50 d. 2.75

6. 88% off 310 + 24% of 210 - ? = 118
a. 256 b. 258
c. 268 d. 358

7. 860% of 50 + 50% of 860 =?
a. 430 b. 516
c. 860 d. 960

8. 45% of 750 - 25% 480 = ?
a. 216 b. 217.50
c. 236.50 d. 245

9. 40% 1640 + ? = 35% of 980 + 1 50% of 850
a. 372 b. 842
c. 962 d. 1052

10. 218 % of 1674 = ? X 1800
a. 0.5 b. 9
c. 6 d. None of the above

11. 60% of 264 is the same as
a. 10% of 44 b. 15% of 1056
c. 30% of 132 d. None of the above

12. 270 candidates appeared for examination, of which 252 passed. the pass percentage is
a. 80 % b. 83 ½ %
c. 90 1/3 % d. 93 1/3 %

13. 5 out of 2250 parts on earth is Sulphur. What is the percentage of Sulphur on earth?
a. 11/50 b. 2/9
c. 1/45 d. 2/45

14. What is the percentage of 7.2 kg in 80 grams?
a. 025 percent b. .25%
c. 2.5% d. 25%

15. 0.01 is what percent of 0.1?
a. 1/100 b. 1/10
c. 10 d. 100

16. What is the percentage of rupees 2650 is rupees 1987.50?
a. 60% b. 75%
c. 80% d. 90%

17. What percent of the day is 3 hours?
a. 12 ½% b. 16 2/3 %
c. 18 2/3 % d. 22 ½ %



18. It costs Rupees 1 to photocopy a sheet of paper. However 2 % discount is allowed on all photo copies done after first 1000 sheets. How much it will cost to copy 5000 sheets of a paper?
a. Rupees 3920 b. Rupees 3980
c. Rupees 4900 d. Rupees 4920

19. A housewife saved rupees 2.50 in buying an item for sale. If she spend rupees 25 for the item approximately how much percent she saved in the transaction?
a. 8% b. 9%
c. 10% d. 11%

20. How many litres of pure acid are there in 8 litres of a 20% solution?
a. 1.4 b. 1.5
c. 1.6 d. 2.4 ★

Answers :
1.d, 2.d, 3.a, 4.d, 5.a, 6.b, 7.c, 8.b, 9.c, 10.d, 11.b, 12.d, 13.b, 14.d, 15.c, 16.b, 17.a, 18.d, 19.b, 20.c.

PRACTICE PAPER - 2

Ratio and Proportion

Important facts and formulas

1 . Ratio: The ratio of two quantities a and b in the same units as the fraction a/b and we write it as a:b

In the ratio a:b we call as the first term (or) antecedent and b as the second term consequen

Rule: Multiplication or division of each term of ratio by the same non zero number does not affect the number.

2. Proportion : The equality of two ratios is called proportion. If a:b:c:d and we say that a, b, c, d Are in proportion. Hear A and D are called extremes while B and C are called mean terms

Product of means = product of extremes

Thus a:b:c:d (=)(bxc)=(axd)


a. Fourth proportional : If a : b = c : d. Then D is called the fourth proportional to a, b, c

b. Third proportional : If a : b = b : c. Then C is called the third proportional to A and B

c. Mean proportional : Mean proportion between a and b $\sqrt{ab}$

Comparison
We say (a : b) > (c : d) (=) a/b > c/d

Compound ratio
The compound ratio of the ratios (a : b), (c : d), (e : f) are (a c e : b d f)



1. If A : B = 5 : 7 and B : C = 6 : 11 then A : B : C is
a. 55 : 77 : 66
b. 30 : 42 : 77
c. 35 : 49 : 42
d. None of the above

2. If A : B = 3 : 4 and B : C = 8 : 9 then A : C is
a. 1:3 b. 3:2
c. 2:3 d. 1:2

3. If A : B = 8 :15, B : C = 5 : 8 and C : D = 4 : 5 then A : D equals to
a. 2:7 b. 4:15
c. 8:15 d. 15:4

4. If A : B : C = 2 : 3 : 4 Then A/B : B/C : C/A is equal to
a. 4 : 9 : 16 b. 8 : 9 : 12
c. 8 : 9 : 16 d. 8 : 9 : 24

5. If A : B = 1/2 : 3/8, B : C = 1/3 : 5/9, C : D = 5/6 : ¾ then ratio A : B : C : D is
a. 4 : 6 : 8 : 10
b. 6 : 4 : 8 : 10
c. 6 : 8 : 9 : 10
d. 8 : 6 : 10 : 9

6. If A : B = 2 : 3, B : C = 4 : 5 and C : D = 6 : 7 then A : B : C : D is
a. 16 : 27 : 30 : 35
b. 16 : 24 : 15 : 35
c. 16 : 24 : 30 : 35
d. 18 : 24 : 30 : 35

7. If 2A = 3B = 4C. Then A : B : C is
a. 2 : 3 : 4 b. 4 : 8 : 2
c. 6 : 4 : 3 d. 20 : 15 : 2

8. If A/3 = B/4 = C/5 Then A : B : C is
a. 4 : 3 : 5 b. 5 : 4 : 3
c. 3 : 4 : 5 d. 20 : 15 : 2

9. If 2A = 3B and 4B = 5C Then A : C is
a. 4 : 3 b. 8 : 15
c. 15 : 8 d. 3 : 4

10. The ratio of 4 3.5 : 25 is same as
a. 2 : 1 b. 4 : 1
c. 15 : 8 d. 7 : 10

11. If 1/5 : 1/x = 1/x : 1/1.25 then value of x is
a. 1.5 b. 2
c. 2.5 d. 3.5

12. If 0.75 : x : 5 : 8 Then x equate
a. 1 : 12 b. 1 : 20
c. 1 : 25 d. 1 : 30

13. If X : Y = 5 : 2 then (8x + 9y) : (8x + 2y) is
a. 22 : 29 b. 26 : 61
c. 29 : 22 d. 61 : 26

14. If 15 % of x = 20 % of y Then x : y is =
a. 3 : 4 b. 4 : 3
c. 17 : 16 d. 16 : 17

15. If (x : y) = 2 : 1 Then (x2 - y2) : (x2 + y2) is :
a. 3 : 5 b. 5 : 3
c. 1 : 3 d. 3: 1

16. If (4x2 - 3y2) : (2x2 + 5y2) = 12 : 19 then (x : y) is :
a. 2 : 3 b. 1 : 2
c. 3 : 2 d. 2: 1

17. If x2 + 4y2 = 4xy then x : y is :
a. 2 : 1 b. 1 : 2
c. 1 : 1 d. 1 : 4

18. If 5x2 - 13xy + 6y2 = 0 then x : y is :
a. (2 : 1) only b. (3 : 5) only
c. 5 : 3 or 1 : 2 d. (3 : 5) or (2 : 1)

19. If x/5 = y/8 then (x + 5) : (y + 8) is equal to :
a. 3 : 5 b. 13 : 8
c. 8 : 5 d. 5 : 8

20. If 9/3 = b/4 = c/7 then a+b+c/c is equal to
a. 7 b. 2
c. 1/2 d. 1/7 ★

Answers :
1.b, 2.c, 3.b, 4.d, 5.d, 6.c, 7.c, 8.c, 9.c, 10.b, 11.c, 12.b, 13.c, 14.b, 15.a, 16.c, 17.a, 18.d, 19.d, 20.b.

చేనేతల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనంతపురం కల్చరల్

చేనేతల సమస్యలను పరిష్కరించాలని చేనేత ఐక్యవేదిక సంఘాలు డిమాండ్ చేశాయి. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో చేనేత కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. చేనేత కార్మికుల సమస్యలను ప్రతిపక్షనేత జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వ విధానాలను ఎండగట్టి కార్మికులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. జిల్లాలో వ్యవసాయం తరువాత చేనేత పరిశ్రమపైనే అధిక శాతం ఆధారపడి జీవిస్తున్నారన్నారు. సరళీకృత విధానాల వల్ల చేనేత పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.



జీపు జాతా శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో జీపుజాతాను ప్రారంభిస్తున్న యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బాబూరావు

ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం జీపు జాతా

విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలి : అజశర్మ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం, పలాస (శ్రీకాకుళం జిల్లా)

ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం జీపుజాతా గురువారం ప్రారంభమైంది. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆధ్వర్యాన చేపట్టిన ఈ జాతాను శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బాబూరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను, ప్రత్యేక హోదాపై ప్రజలకు ఉన్న ఆకాంక్షను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి జరుగుతున్న తీవ్ర అన్యాయంపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు జీపుజాతా ప్రారంభించామన్నారు. ప్రత్యేక హోదా ప్రజల ఆకాంక్ష అని, ఇటీవల చేపట్టిన రాష్ట్ర బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలూ సంపూర్ణ మద్దతు ప్రకటించడంతో ఇది నిరూపితమైందని తెలిపారు. నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో లాలూచీ పడి రాష్ట్రానికి అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలో ఈ జీపు జాతా కొనసాగుతుందని, ఈ నెల ఏడున విశాఖ జిల్లా పాయకరావుపేట వద్ద ముగుస్తుందని తెలిపారు. మందస, పలాస, టెక్కలి, పాతపట్నం వరకూ తొలిరోజూ జీపుజాతా సాగింది. పలాసలో జాతాకు వైసిపి నాయకులు మద్దతు తెలిపారు. సిఐటియు, యుటిఎఫ్, ఆటో యూనియన్, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

కార్మికులా.. .కార్పొరేట్లా తేల్చుకో!

- సిఎంకు గఫూర్ హెచ్చరిక
- ఇది కార్మిక వ్యతిరేక ప్రభుత్వం
- బడ్జెట్ సమావేశాల్లో సమస్యల్ని చర్చించాలి
- ధర్నాలో వక్తల డిమాండ్



విజయవాడలో ధర్నాకు హాజరైన మధ్యాహ్న భోజన కార్మికులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న గఫూర్



మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వానికి కార్మికులు కావాలో, కార్పొరేట్లు కావాలో తేల్చుకోవాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్ హెచ్చరించారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగించొద్దని, కార్మికులకు నెలకు రూ.5000 వేతనాన్ని చెల్లించాలని, పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, విద్యార్థులకు ఇచ్చే మెనూ ఛార్జీల్ని పెంచాలని, ఉపాధి భద్రత కల్పించాలని కోరుతూ విజయవాడ అలంకార్ సెంటర్‌లో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథక కార్మికుల సమస్యల్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల ఆకలి కేకలు ప్రభుత్వానికి వినిపించడం లేదా అని ప్రశ్నించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే టిడిపి తిరిగి అధికారంలోకి రాదన్నారు. 8 నెలలుగా వేతనాలు ఇవ్వక పోవడం దారుణమన్నారు. పథకాన్ని ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఇస్కాన్, అక్షయ పాత్ర వంటి సంస్థలకు అప్పగించాలని ప్రభుత్వం ప్రయత్నించడాన్ని తిప్పికొట్టాలన్నారు.

కార్మికుల కడుపుమంట పట్టించుకోని ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు. కార్మికులంతా ఐక్యంగా పోరాడాలన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ బడ్జెట్‌లో సమావేశాల్లో కార్మికుల సమస్యల్ని చర్చించాలన్నారు. దీనికి పిడిఎఫ్ ఎమ్మెల్సీల మద్దతు ఉంటుందన్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్యల్ని తీసుకెళ్తానన్నారు. కార్మికులపై రాజకీయ కక్ష సాధింపు చర్యల్ని మానుకోవాలని ఆయన హితవు పలికారు. ఉద్యమానికి విద్యార్థులు, తల్లిదండ్రుల మద్దతు కూడా తీసుకోవాలని సూచించారు.

ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం: స్వరూపారాణి

యూనియన్ ప్రధాన కార్యదర్శి కె స్వరూపరాణి మాట్లాడుతూ డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పథకాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగించడాన్ని ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లుల్ని వెంటనే చెల్లించాలన్నారు. వేతనాలను రూ.5000లకు పెంచాలన్నారు. ధర్నా వద్దకు వచ్చిన విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ విజయ్‌కుమార్‌కు యూనియన్ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. కార్మికుల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు సుప్రజ, డి రమాదేవి, నాగమణి, శివకుమారి, శ్యామలరాణి, లక్ష్మి, ప్రసన్న, పెద్ద ఎత్తున మధ్యాహ్న భోజన పథక కార్మికులు పాల్గొన్నారు.

టీచర్లకు బోధనేతర పనులపై ఉద్యమం

యుటిఎఫ్ ర్యాలీ, ధర్నాలో నేతలు, ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయులకు జనాభా లెక్కల సేకరణ, ఎన్నికల విధులు తప్ప ఎటువంటి బోధనేతర పనులూ అప్పగించొద్దని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో గురువారం ర్యాలీ, ధర్నా నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా కార్యాలయం నుంచి డిఇఒ కార్యాలయం వరకూ నిరసన ప్రదర్శన నిర్వహించి, అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు రాము సూర్యారావు, బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాల, విద్యాశాఖలో ఉపాధ్యాయులకు కేటాయిస్తున్న బోధనేతర పనులపై శాసనమండలిలో చర్చిస్తామని చెప్పారు. విద్యాహక్కు చట్టం అమలు కోసం పోరాడతామని ప్రకటించారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు షేక్‌సాబ్జీ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఎటువంటి కంప్యూటర్లు, నెట్ సౌకర్యం లేకపోయినప్పటికీ సమ్మేటివ్, ఫార్మేటివ్ మార్కులు ఆన్‌లైన్ చేయడం, పిటిఎ, ఎస్ఎంసి సమావేశాలు, అంగన్‌వాడీ యాప్‌లు, మరుగుదొడ్ల ఫొటోలు, కిచెన్‌గార్డెన్ ఫొటోలు అప్‌లోడ్ చేయటం వంటి బోధనేతర కార్యక్రమాలు అప్పగిస్తున్నారని చెప్పారు. అందువల్ల విద్యార్థులకు బోధించాల్సిన విలువైన సమయం హరించుకుపోతోందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడుతూ కలెక్టర్లు రకరకాల బోధనేతర కార్యక్రమాలను కల్పించడం, విద్యాశాఖలో వారి జోక్యం పెరగడం ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందని చెప్పారు. ఎపిటెల్ యాప్‌లో సాంకేతిక అవాంతరాల కారణంగా హాజరు నమోదు చేయని ఉపాధ్యాయులకు జారీ చేసిన మెమోలు ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా డిఇఒ కార్యాలయాల ఎదుట ప్రత్యక్ష ఆందోళన చేపడతామన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, బి.గోపీమూర్తి, రాష్ట్ర కార్యదర్శి వి.కనకదుర్గ తదితరులు మాట్లాడారు.

ఎంవి చట్ట సవరణకు వ్యతిరేకంగా 6న ధర్నాలు : ఆటో, ట్రాలీ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మోటారు వాహనాల(ఎంవి) చట్ట సవరణకు వ్యతిరేకంగా ఈ నెల 6న రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఎపి ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. రవాణా రంగాన్ని నిర్వీర్యం చేసి ప్రైవేట్ పెట్టుబడులదారులకు కట్టబెట్టాలనే లక్ష్యంతో సవరణ తీసుకొస్తోందని అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ శివాజి, ఆర్‌వి నరసింహరావు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికుల్ని వేధించడమే లక్ష్యంగా తయారు చేసిన సవరణ బిల్లులో అనేక ప్రమాదకర అంశాలున్నాయని, చిన్న చిన్న తప్పులకు డ్రైవింగ్ లైసెన్స్ రద్దుతో సహా ఏళ్ల తరబడి జైలు శిక్షలు విధించేలా ప్రతిపాదనలు ఈ సవరణ బిల్లులో ఉన్నాయని వివరించారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరగడంతో పాటు, సరిపడినంత కిరాయిలు దొరక్క ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డ్రైవర్ల జీవనాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తూ గూడ్సు ట్రాన్స్‌పోర్టుతో సహా పాసింజర్ రవాణాను కూడా కార్పొరేట్ సంస్థలైన ఓబర్, ఓలా వంటి సంస్థలకు కట్టబెట్టాలనే ఆలోచన ప్రభుత్వం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆటో రంగంలో ప్రభుత్వ పూచీతో ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీ, కాపు కార్పొరేషన్ల నుంచి రుణాలిప్పించాలని, పెంచిన ఫీజులు, పెనాల్టీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈనెల 6న కేంద్రప్రభుత్వం తీసుకొస్తున్న ఎంవి చట్ట సవరణలకు వ్యతిరేకంగా ఆలిండియా రోడ్డు ట్రాన్స్ పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ పిలుపులో భాగంగా రాష్ట్రంలోనూ అన్ని ప్రధాన కేంద్రాలు, మున్సిపల్, మండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టాలని వారు తెలిపారు.

'ఏలేరు' ఆధునికీకరణ పనులు అడ్డగింత

పరిహారం ఇచ్చాకే పనులు చేపట్టాలని రైతుల డిమాండ్

ప్రజాశక్తి-పిఠాపురం(తూర్పుగోదావరి)

తమకు పరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలంటూ ఏలేరు కాలువ ఆధునికీకరణ పనులను రైతులు అడ్డగించారు. తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం మండలంలోని జములపల్లిలో రూ.23 కోట్లతో ఏలేరు ఆధునీకరణ పనుల్లో భాగంగా గొర్రికండి కాలువ పనులను అధికారులు గురువారం ప్రారంభించారు. ఈ పనులను జములపల్లి వద్ద సుమారు వందమంది రైతులు అడ్డుకున్నారు. పూర్తిస్థాయిలో పరిహారం ఇచ్చిన తరువాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ బత్తిన సుగుణ అక్కడకు చేరుకుని బాధిత రైతులతో చర్చించారు. పరిహారం త్వరలోనే అందిస్తామని తెలిపారు. ఇప్పటికే ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. పనులకు సహకరించాలని కోరగా, రైతులు నిరాకరించారు. పరిహారం పూర్తిగా అందించిన తరువాతే పనులు చేపట్టాలన్నారు. అప్పటివరకూ పనులను జరగనివ్వబోమన్నారు. దీంతో చేసేది లేక పనులను నిలిపేశారు.

మూల్యాంకన లోపాలను సరిదిద్దాలని ధర్నా

ప్రజాశక్తి- ఎచ్చెర్ల (శ్రీకాకుళం జిల్లా)

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో మూల్యాంకన లోపాలను సరిదిద్దాలని కోరుతూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులు గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎబివిపి నాయకులు తురకా ప్రసాద్ మాట్లాడుతూ పరీక్షల మూల్యాంకనానికి కాంట్రాక్టు బోధకులను నియమించటం వల్ల విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు.

గిట్టుబాటు ధర రైతు హక్కు

కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

గిట్టుబాటు ధర రైతుల హక్కని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య అన్నారు. ఈ మేరకు చట్టం చేసి వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం శ్రీకాకుళంలోని ఎన్జీవో హోంలో అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తాండ్ర ప్రకాశ్ అధ్యక్షతన అఖిల భారత కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. రైతు శ్రేయస్సే తమ లక్ష్యమని చెప్పుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వామినాథన్ కమిటీ సిఫార్సులను తుంగలో తొక్కాయన్నారు. రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల ఎనిమిదిన 'చలో అసెంబ్లీ' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 198 సంఘాల ఆధ్వర్యంలో పెనుబాక నుంచి ర్యాలీ నిర్వహించి అనంతరం చేపట్టనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎపి కౌలు రైతుల సంఘం, రైతు కూలీ సంఘం, ఎఐకెఎంఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హోదా కోసం కలెక్టరేట్ల ముట్టడి

వామపక్షాల రౌండ్‌టేబుల్ సమావేశాలు

వైసిపి ఆధ్వర్యంలో ఆందోళనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చే దాకా ఆందోళన చేస్తామని వైసిపి నాయకులు తెలిపారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా వైసిపి ఆధ్వర్యంలో ప్రదర్శనలు, కలెక్టరేట్ల ముట్టడి చేపట్టారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు. 5న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టనున్నట్లు ప్రకటించారు. అవసరమైతే అదే రోజు రాజీనామాలు చేస్తామని హెచ్చరించారు. జగన్ ఆదేశిస్తే శాసనసభ సభత్వానికి కూడా రాజీనామాలు చేస్తామని కొందరు ఎమ్మెల్యేలు ప్రకటించారు. వామపక్షాల నాయకులు వైసిపి ఆందోళనకు సంఘీభావం తెలిపారు. వామపక్షాలు కూడా రౌండ్‌టేబుల్ సమావేశాలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. విజయనగరం కలెక్టరేట్ వద్ద వైసిపి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సిపిఎం, సిపిఐ సంఘీభావం తెలిపాయి. వైసిపి రాష్ట్ర నాయకులు బొత్స సత్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.కామేశ్వరరావు మాట్లాడారు. శ్రీకాకుళంలో వైసిపి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఉన్న రహదారులు, భవనాల శాఖ అతిథి గృహం వద్ద మహాధర్నా, అనంతరం అక్కడ నుంచి కలెక్టరేట్ ప్రధాన గేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. జెసి-2 పి.రజినీకాంతారావుకు వినతిపత్రం అందజేశారు. వామపక్షాల ఆధ్వర్యంలో అమలాపురంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కాకినాడ కలెక్టరేట్ వద్ద వైసిపి నాయకులు ధర్నా చేశారు. వైసిపి కేంద్ర కమిటీ సభ్యులు జక్కంపూడి విజయలక్ష్మి, ఎమ్మెల్సీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్యే దాడిశెట్టి రాజా పాల్గొన్నారు. భీమవరం క్లాత్ మార్చంట్స్ అసోసియేషన్ భవనంలో సిపిఎం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రత్యేక హోదా సాధన కమిటీ ఆధ్వర్యంలో తిరుపతి ఎన్‌జిఒ హోమ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట వైసిపి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. శాసన మండలిలో ప్రతిపక్ష నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడారు. అనంతరం కలెక్టర్ కోన శశిధర్‌కు వినతిపత్రం ఇచ్చారు. విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహాధర్నా నిర్వహించారు. గాంధీ విగ్రహం నుంచి జిల్లా కోర్టు, జగదాంబ జంక్షన్ మీదుగా కలెక్టరేట్‌కు ర్యాలీగా చేరుకున్నారు. ఎంపీ వి.విజయసాయిరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. విశాఖ జిల్లా పాడేరులో వైసిపి ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. వైసిపి ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. వైసిపి ఆధ్వర్యంలో ప్రకాశం భవనం వద్ద ధర్నా నిర్వహించారు. భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. వైసిపి నగర అధ్యక్షులు శింగరాజు వెంకట్రావు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. చిత్తూరు కలెక్టరేట్ ఎదుట వైసిపి నాయకురాలు గాయత్రి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కడపలో ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో జడ్‌పి కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకూ వైసిపి నాయకులు ప్రదర్శన చేశారు. అనంతరం కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. అనంతపురం జిల్లాలో వైసిపి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సిపిఎం జిల్లా ఉత్తర ప్రాంత కార్యదర్శి రాంభూపాల్, నగర కార్యదర్శి నాగేంద్రకుమార్ మద్దతు తెలిపారు. అనంతరం జెసి రమామణికి వినతిపత్రం అందజేశారు.



కర్నూలులో ఆందోళన చేస్తున్న వైసిపి నాయకులు

రేపు చలో ఢిల్లీ

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని నాన్ పొలిటికల్ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు అప్పికట్ల శ్రీహరినాయుడు విమర్శించారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం చలో ఢిల్లీ నిర్వహించనున్నట్లు చెప్పారు. 4న ఎపి భవనం వద్ద నల్ల రిబ్బన్లతో నిరసన, 5న భిక్షాటన, 6న ఎపి మంత్రులు, ఎంపిలకు వినతిపత్రాలు ఇస్తామని పేర్కొన్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1. ఖరగ్‌పూర్ ఐఐటి పరిశోధకులు
2. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు
3. వజ్ర నౌకకు (2018 ఫిబ్రవరి 21న పారాదీప్‌లో) 4. నార్వే (39 పతకాలు)
5. రాహుల్ మహాజన్

రోడ్డెక్కిన మిర్చి రైతులు

ధరల తగ్గుదలపై ఆగ్రహం

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

గుంటూరు మిర్చియార్డులో గురువారం వ్యాపారులు ఆకస్మికంగా ధరలు తగ్గించడంతో ఆగ్రహించిన రైతులు రోడ్డెక్కారు. ఈ-నామ్ అమలు పేరుతో క్వింటా రూ.10 వేలు ఉన్న ధరను ఒక్కసారిగా రూ.6 వేలకు తగ్గించారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి యార్డు ఎదుట జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. దీంతో దాదాపు రెండు గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మిర్చిని యార్డుకు తీసుకొచ్చి రోజులు గడుస్తున్నా వ్యాపారులు కొనుగోలు చేయడం లేదని, ఈ-నామ్ విధానం వల్ల వ్యాపారులు మిర్చి కొనుగోలుకు ముందుకు రావడం లేదని వాపోయారు. యార్డులో ఇప్పటికే వేలాది బస్తాల మిర్చి నిల్వలు పేరుకుపోయాయని, మిర్చి ధరలు పడిపోవటంతో పెద్ద మొత్తంలో నష్టపోతున్నామని చెప్పారు.


వ్యాపారులు కొనుగోళ్లను ఆపివేయటంతో మిర్చి ధరలు మరింత పతనమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అసలు ఈ-నామ్ విధానం వద్దని, పాత విధానంలోనే కొనుగోలు చేయాలని, పంటలకు మద్దతు ధరలు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న మిర్చియార్డు సెక్రెటరీ శ్రీనివాసరావు రైతుల వద్దకు వచ్చి మాట్లాడారు. పాత పద్ధతిలోనే మిర్చి కొనుగోలుకు హామీనిచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

దీక్షలు

బాపట్లలో రైతుల దీక్షలు

ప్రజాశక్తి - బాపట్ల (గుంటూరు జిల్లా)

జాతీయ రహదారి 216 నిర్మాణం పేరుతో ప్రభుత్వం చేపట్టిన భూ సేకరణలో తాము అన్యాయానికి గురయ్యామని పేర్కొంటూ గుంటూరు జిల్లా బాపట్లలో బాధిత రైతులు రెండ్రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నారు. దీక్షా శిబిరాన్ని గురువారం కాంగ్రెస్ నాయకులు లేళ్ల వెంకటప్పయ్య, మద్దిబోయిన తాతయ్య సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ భూములకు ధరలు నిర్ణయించడంలోనే అవకతవకలు ఉన్నాయని, ఒకే ప్రాంతంలోని భూములకు వేర్వేరు మొత్తాల్లో పరిహారాన్ని నిర్ణయించారని చెప్పారు. భూ సేకరణ చట్టం నిబంధనలు సైతం పాటించలేదని పేర్కొన్నారు. తమకు న్యాయం చేకూరేవరకూ దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దీక్షల్లో గోపాళం రామస్వామి, లక్ష్మీకళ శ్రీనివాసులు, శివప్రసాద్‌రెడ్డి, ధనగోవిందరెడ్డి పాల్గొన్నారు.



గుంటూరు జిల్లా బాపట్లలో దీక్షలు చేస్తున్న రైతులు

దళితులపై దాడులకు వ్యతిరేకంగా పోరాడాలి


రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - మొగల్రాజపురం (విజయవాడ)

దళితులపై దాడులను నిరసిస్తూ ఈ నెల 4న గుంటూరులో జరిగే ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేసి దళితుల సత్తా చాటాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో స్థానిక గిరిపురంలో దళిత, గిరిజన, ప్రజా సంఘాల ఐక్య వేదిక, కెవిపిఎస్, డిబిఎఫ్ ఆధ్వర్యంలో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి మేళం భాగ్యరావు మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా దళితులందరూ పోరాడాలని పిలుపునిచ్చారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్రమల్యాద్రి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వాలు అధికారంలోకొచ్చిన ఈ నాలుగేళ్లకాలంలో దళితులపై దాడులు అధికమయ్యాయని చెప్పారు. ప్రభుత్వాలు కుల వివక్షను ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. రాజధాని భూముల నష్టపరిహారంలోనూ అగ్రవర్ణాలకు, ఎస్సీ, ఎస్టీలకు తేడాలున్నాయన్నారు. దళితులపై దాడులకు పాల్పడుతున్న అగ్రకులాల దురంహంకారులను శిక్షించడంలో ప్రభుత్వాలు మీనామేషాలు లెక్కిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత, గిరిజన ఐక్య ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు ఎస్.పి.గ్రిటన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు అంబోజి.శ్రీనివాస్, ఎస్.ఆర్.ఆర్ కాలేజ్ మాజీ ప్రిన్సిపల్ మాతంగి జగన్ మోహన్ రావు, దళిత సంక్షేమ సంఘం నాయకులు యమ్.కిరణ్, స్థానిక దళిత నాయకులు పరమేశ్వరరావు, కెవిపిఎస్ జిల్లా, తూర్పు సిటీ కార్యదర్శులు జి.నటరాజ్, జి.క్రాంతి కుమార్ మాట్లాడారు.

మండుటెండల్లోనూ.. విద్యుత్ కార్మికుల ఆందోళనలు

- కర్నూలులో ఇద్దరు కార్మికులకు అస్వస్థత
- పదిరోజులైనా పట్టని సిఎంపై పలువురి ఆగ్రహం



నెల్లూరులో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి

ప్రజాశక్తి-యంత్రాంగం

ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తదితర డిమాండ్ల సాధనకు విద్యుత్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమ్మె గురువారానికి పదో రోజుకు చేరింది. విశాఖలో మండుటెండలో కార్మికులు ఆందోళన చేయగా, కడపలో నిరవధిక నిరాహార దీక్షలు కొనసాగాయి. పలుచోట్ల కార్మికులు దీక్షలు, ధర్నాలు, రాస్తారోకోలు తదితర రూపాల్లో ఆందోళనలు కొనసాగించారు. సమస్యను పరిష్కరించకపోగా, పోటీ కార్మికులతో పనులు చేయించేందుకు ప్రయత్నిస్తున్న ప్రభుత్వంపై వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కర్నూలులో విద్యుత్ భవన్ ఎదుట కార్మికుల నిరవధిక నిరాహార దీక్షలు నాల్గో రోజుకు చేరుకోవడంతో కార్మికులు భరత్‌కుమార్, మహబూబ్‌బాషా అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. కార్మికులిద్దరినీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీక్షా శిబిరాన్ని వైసిపి ఆలూరు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రమేష్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.నాగేశ్వరరావులు సందర్శించి మద్దతు ప్రకటించారు. కడప కలెక్టరేట్ ఎదుట నిరవధిక నిరాహార దీక్షలు ఐదోరోజుకు చేరాయి. దీక్షలకు పలువురు కార్మికులు సంఘీభావం తెలియజేశారు. పోలీసులు టెంట్ తొలగించడంతో విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మండుటెండలో కార్మికులు ఆందోళన చేశారు. పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేయడంతోపాటు దీక్షా శిబిరం టెంట్‌ను తొలగించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. విజయనగరం విద్యుత్ భవనం వద్ద కాంట్రాక్టు కార్మికుల దీక్షా శిబిరాన్ని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ సందర్శించి మద్దతు తెలిపారు. బొబ్బిలిలో సమ్మె చేస్తున్న కార్మికులకు సిపిఎం జిల్లా (పార్వతీపురం) కార్యదర్శి రెడ్డి శ్రీరామ్మూర్తి మద్దతు తెలిపారు. బొబ్బిలిలో కోర్టు జంక్షన్ వద్ద కార్మికులు రాస్తారోకో చేశారు. శ్రీకాకుళం జిల్లాలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె కొనసాగింది. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద దీక్షా శిబిరాన్ని సిఐటియు రాష్ట్ర కోశాధికారి ఎవి.నాగేశ్వరరావు ప్రారంభించి, మాట్లాడారు. సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు జి.బేబిరాణి మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. వైసిపి ఎంఎల్‌సి పిల్లి సుబాష్‌చంద్రబోస్, ఎంఎల్ఎ దాడిశెట్టి రాజా, తదితరులు సమ్మెకు మద్దతు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు నిర్వహిస్తున్న కార్మికులకు వైసిపి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌సి ఆళ్ల నాని కలిసి, మద్దతు తెలిపారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట కార్మికుల దీక్షా శిబిరం కొనసాగుతోంది. గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే ముస్తఫా, పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ జాతీయ మాజీ అధ్యక్షులు ఆర్.శివన్నారాయణ దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు పలికారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లు సాధించే వరకూ పోరాడాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి పిలుపునిచ్చారు. నెల్లూరు విద్యుత్ భవన్ ఎదుట కార్మికులు చేస్తున్న ధర్నాలో ఆమె పాల్గొని, మాట్లాడారు. అనంతపురం కలెక్టరేట్ ఎస్ఇ కార్యాలయం వద్ద దీక్షలు కొనసాగుతున్నాయి.

సరిహద్దుల్లో ఎదురుకాల్పులు

శ్రీనగర్ : జమ్ము- కాశ్మీర్ సరిహద్దుల్లో కాల్పుల ఉల్లంఘనలకు పాల్పడుతున్న పాక్ సైనికులపై భారత్ దళాలు ఎదురుకాల్పులు జరిపాయి. పూంచ్ జిల్లాలోని పిర్ పంజాల్ లోయలో జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు పాక్ సైనికులకు గాయాలైనట్లు అధికారులు వెల్లడించారు. పూంచ్ సెక్టార్‌లోని సరిహద్దు రేఖ వెంట పాక్ సైనికులు ఆటోమేటిక్ తుపాకులు, ఫిరంగులు ఉపయోగించి సరిహద్దులోపలికి చొచ్చుకు వచ్చేందుకు ప్రయత్నించగా, భారత దళాలు వారిని అడ్డుకున్న క్రమంలో కాల్పులు జరిగాయని, దీంతో ఇద్దరు పాక్ సైనికులకు గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. ఉదయం 8.45 గంటలకు పాక్ సైనికులు కాల్పులకు తెగబడగా, భారత దళాలు ధీటుగా సమాధానమిస్తున్నాయన్నారు.

బహుమతి



ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి తన సోదరుడు హెచ్‌ఆర్‌హెచ్ ప్రిన్స్ బిన్ మహ్మద్ బిన్ తలాల్ రాసిన 'ఏ థికింగ్ పర్సన్స్ గైడ్ టు ఇస్లాం' (ఇస్లాం వైపు ఆలోచనపరుల మార్గదర్శి) అనే పుస్తకాన్ని అందిస్తున్న జోర్డాన్ రాజు బిన్ అల్ హుస్సేన్

వసుధైక కుటుంబం భారత్ సిద్ధాంతం : మోడీ

న్యూఢిల్లీ : వసుధైక కుటుంబం భారత సూత్రమని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఇక్కడ విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ, భారతదేశంలో అనేక మతాలు పుట్టి, పెరిగాయని, శాంతి, ప్రేమ వంటి సందేశాలు ఈ గడ్డపై నుండే ఇతర దేశాలకు వ్యాపించాయని అన్నారు. వసుధైక కుటుంబం భారత్ అనుసరించే సిద్ధాంతమని పేర్కొన్నారు. తమ చర్యలు తమ మతాన్నే దెబ్బతీస్తాయని మతోన్మాదులు గుర్తించలేకపోతున్నారని మోడీ వ్యాఖ్యానించారు. విజ్ఞాన భవన్‌లో ఇండియా ఇస్లామిక్ కల్చరల్ సెంటర్ నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన రాజు అబ్దుల్లా 'ఇస్లామిక్ వారసత్వం : అవగాహన, సంయమనాన్ని పాటించడం' అనే అంశంపై ప్రసంగించారు. తీవ్రవాదంపై అంతర్జాతీయంగా యుద్ధం సాగించడమంటే అది ప్రజల మధ్య లేదా మతాల మధ్య సాగే యుద్ధం కాదని జోర్డాన్ రాజు అబ్దుల్లా 2 వ్యాఖ్యానించారు. మన విశ్వాసాన్ని, మానవతాన్ని హత్య చేసేవారిపై ఈ పోరాటం సల్పాలని కోరారు. ఈనాడు ప్రపంచంలో ఎక్కువమంది మతం గురించి మాట్లాడుకుంటున్నారు. ఆ మతమే ప్రజల్ని వేరు చేస్తోందని అనుకుంటున్నారు కానీ విభిన్న విశ్వాసాలకు చెందిన ప్రజలు ప్రాచీన కాలం నుండి కలిసికట్టుగా జీవించడం మనం చూస్తున్నామని అన్నారు. రక్షణ లేనివారిని, అవసరంలో వున్నవారిని ఆదుకోవడమే ప్రతి ఒక్క ముస్లిం విధి అని తాను నేర్చుకున్నానని పేర్కొన్నారు. ఏ స్థాయి నాయకత్వంలో వున్నా, ఎక్కడ వున్నా ప్రజలకు సేవ చేయడానికే ప్రాధాన్యత ఇవ్వాలని, అందరికీ మరింత మెరుగైన భవితవ్యాన్ని అందించాలని తన తండ్రి ఎప్పుడూ చెప్పేవారని రాజు అబ్దుల్లా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ హాజరయ్యారు. విద్యావేత్తలు, ఇస్లామిక్ పండితులు, ముస్లిం ప్రతినిధులు హాజరయ్యారు.

ప్రత్యేక ఆహ్వానితునిగా హాజరుకాలేను

లోక్‌పాల్ ఎంపిక కమిటీ సమావేశంపై మల్లికార్జున ఖార్గె



న్యూఢిల్లీ : లోక్‌పాల్ ఎంపిక కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు కాంగ్రెస్ పక్షనేత మల్లికార్జున ఖార్గె గురువారం తిరస్కరించారు. తనను ప్రత్యేక ఆహ్వానితుడుగా ఆహ్వానించడాన్ని ఆయన వ్యతిరేకిస్తున్నారు. అవినీతిపై సాగించే పోరాటంలో అత్యంత ముఖ్యమైన లోక్‌పాల్ ఎంపిక క్రమంలో ప్రతిపక్షాల గొంతు వినిపించకుండా చేయాలన్న కుట్రతోనే అధికార పక్షం ఈ విధంగా వ్యవహరిస్తోందని ఖార్గె వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన ప్రధాని మోడీకి లేఖ రాశారు. ప్రతిపక్ష నేతను ప్రత్యేక ఆహ్వానితుని స్థాయికి పరిమితం చేయరాదు. నిర్మాణాత్మకమైన, అర్థవంతమైన భాగస్వామ్యం కన్నా కేవలం లాంఛనప్రాయంగా పిలవడానికి ప్రభుత్వం ఈ మార్గాన్ని ఎంచుకోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. లోక్‌పాల్‌గా ఎంపిక చేయడానికి పరిశీలించే అభ్యర్థుల జాబితాను కూడా తనకు పంపలేదని అన్నారు. తనకు ముందుగా ఆ సమాచారం లేనపుడు ఇక సమావేశానికి తాను వచ్చినా విలువుండదని అన్నారు. లోక్‌పాల్ చట్టాన్ని ప్రభుత్వం సవరించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది.

నాగాలాండ్‌లో తొమ్మిది పోలింగ్ కేంద్రాలలో నేడు రీపోలింగ్

కొహిమా : నాగాలాండ్‌లోని 9 నియోజకవర్గాల పరిధిలోని 13 పోలింగ్ కేంద్రాలలో శుక్రవారం రీ పోలింగ్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అభిజిత్ సిన్హా ప్రకటించారు. ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం మూడుగంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్, మేఘాలయ రాష్ట్రాల అసెంబ్లీలకు ఫిబ్రవరి 27న ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. కాగా, నాగాలాండ్‌లోని అంగామి-2 నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి, ఎన్‌డిడిపి నేత నెఫ్యూరాయ్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో అక్కడ పోలింగ్ నిర్వహించలేదు. రాష్ట్రంలోని టమ్ము, పెరెన్, కొహిమా టౌన్, చిజామి, పెఖ్, మెలూరి, టిజిట్, పుంగ్రో-కిఫిరే, లాంగ్ఖిమ్-చారే నియోజకవర్గాలలో 13 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే గతంలో పోలింగ్ వాయిదా పడిన టమ్ము నియోజకవర్గంలోని ఒక పోలింగ్ కేంద్రంలో కూడా రీ పోలింగ్ నిర్వహించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది.

రేపే ఓట్ల లెక్కింపు

త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈ నెల 3వ తేదీన జరగనుంది. ఆ రోజు మధ్యాహ్నానికి పూర్తి ఫలితాలు వెల్లడి కావచ్చునని భావిస్తున్నారు. త్రిపుర అసెంబ్లీకి ఫిబ్రవరి 18న, మేఘాలయ, నాగాలాండ్ అసెంబ్లీలకు 27వ తేదీన ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే.

ఆర్థికాభివృద్ధి, సైనిక ఆధునీకరణ కలిసి సాగాలి

జనరల్ బిపిన్ రావత్ వ్యాఖ్య



న్యూఢిల్లీ : భారతదేశ ఆర్థికాభివృద్ధి, సాయుధ బలగాల ఆధునీకరణ ఈ రెండూ పరస్పర ఆధారితాలని సైనిక దళాల అధిపతి జనరల్ బిపిన్ రావత్ గురువారం వ్యాఖ్యానించారు. ఇక్కడ ఒక సెమినార్‌లో మాట్లాడుతూ ఆయన, సురక్షితమైన సరిహద్దులు విశ్వసనీయమైన విదేశీ పెట్టుబడిదారులతో అనుసంధానమై వుంటాయని పేర్కొన్నారు. దేశం సురక్షితంగా వుందంటే ఆర్థికంగా అభివృద్ధి జరుగుతుందని అన్నారు. సాయుధ బలగాలకు బడ్జెట్ కేటాయింపులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెట్టుబడిదారుల్లో ముందుగా విశ్వాసాన్ని మనం పెంచాల్సి వుందని అన్నారు. తద్వారా దేశ సరిహద్దులు సురక్షితంగా వుంటాయని, అంతర్గత భద్రతా పరిస్థితులు పూర్తిగాఅదుపులో వుంటాయని అన్నారు. అందువల్లే ఆర్థిక అభివృద్ధి, సైనిక ఆధునీకరణ రెండు జమిలిగా కలిసి సాగాల్సి వుంటుందని పేర్కొన్నారు. దేశంలోని మారుమూల ప్రాంతాల్లో రోడ్లు, మౌలిక సదుపాయాలు అభివృద్ధిపరిస్తే స్థానిక ప్రజలు లబ్ది చెందుతారని అన్నారు.

దయ, కరుణ, సహనం విలువలను పాటించాలి

మానవాళి మహత్తర బాధ్యత అదే

విజ్ఞాన్ భవన్‌లోని సదస్సులో జోర్డాన్ రాజు పిలుపు

అమ్మాన్ : తీవ్రవాదంపై అంతర్జాతీయంగా యుద్ధం సాగించడమంటే అది ప్రజల మధ్య లేదా మతాల మధ్య సాగే యుద్ధం కాదని జోర్డాన్ రాజు అబ్దుల్లా 2 వ్యాఖ్యానించారు. మన విశ్వాసాన్ని, మానవతాన్ని హత్య చేసేవారిపై ఈ పోరాటం సల్పాలని కోరారు. ఈనాడు ప్రపంచంలో ఎక్కువమంది మతం గురించి మాట్లాడుకుంటున్నారు. ఆ మతమే ప్రజల్ని వేరు చేస్తోందని అనుకుంటున్నారు కానీ విభిన్న విశ్వాసాలకు చెందిన ప్రజలు ప్రాచీన కాలం నుండి కలిసికట్టుగా జీవించడం మనం చూస్తున్నామని అన్నారు. రక్షణ లేనివారిని, అవసరంలో వున్నవారిని ఆదుకోవడమే ప్రతి ఒక్క ముస్లిం విధి అని తాను నేర్చుకున్నానని పేర్కొన్నారు. ఏ స్థాయి నాయకత్వంలో వున్నా, ఎక్కడ వున్నా ప్రజలకు సేవ చేయడానికే ప్రాధాన్యత ఇవ్వాలని, అందరికీ మరింత మెరుగైన భవితవ్యాన్ని అందించాలని తన తండ్రి ఎప్పుడూ చెప్పేవారని రాజు అబ్దుల్లా గుర్తు చేసుకున్నారు. ఇక్కడ విజ్ఞాన భవన్‌లో ఇండియా ఇస్లామిక్ కల్చరల్ సెంటర్ నిర్వహించిన ఒక కార్యక్రమానికి హాజరైన రాజు అబ్దుల్లా 'ఇస్లామిక్ వారసత్వం : అవగాహన, సంయమనాన్ని పెంచడం' అనే అంశంపై ప్రసంగించారు.

హైకోర్టు లాయర్ల ఆందోళనలు

హైదరాబాద్‌లో.. రోడ్డుపై బైటాయించి నిరసనలు..

ప్రజాశక్తి-హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల హైకోర్టు లాయర్ల సంఘాలు ఏకగ్రీవంగా చేసిన తీర్మానానికి అనుగుణంగా గురువారం లాయర్లు హైకోర్టు విధుల్ని బహిష్కరించారు. ఈ ఆందోళన శుక్రవారం కూడా కొనసాగనున్నది. ఏపీ, టీఎస్ హైకోర్టు లాయర్స్ అసోసియేషన్ల అధ్యక్షులు ధనుంజయ, కనకయ్యల సారథ్యంలో న్యాయవాదులంతా హైకోర్టు ఆవరణలోనే ఉన్న బార్ కౌన్సిల్ భవన్ నుంచి మదీనా బిల్డింగ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. మదీనా చౌరస్తా వద్ద న్యాయవాదులు కొద్దిసేపు బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. లాయర్లు కోర్టు విధుల బహిష్కరణ వల్ల కోర్టు హాల్స్ బోసిపోయాయి. కక్షిదారుల తరఫున వాదించేందుకు న్యాయవాదులు గైర్హాజరవ్వటంతో.. వాదనలు జరగలేదు. కొందరు న్యాయమూర్తులు బెంచ్‌పైనే ఉండటంతో న్యాయవాదులు కొందరు వెళ్లితాము ఆందోళన చేస్తున్నామని సహకరించాలని కోరారు. అత్యవసర కేసులకు మాత్రమే లాయర్లు వాదనలు వినిపించారు. లాయర్లు వస్తే కేసులు వింటామని, లేనట్లయితే కేసుల్ని కొట్టేయకుండా వాయిదా వేస్తామని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి చెప్పారు. దీంతో విచారణ జరగాల్సిన కేసులన్నీ వాయిదా పడ్డాయి.

పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంలో

వజ్రాల వ్యాపారి చోక్సీ ఆస్తుల జప్తు




న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంలో నిందితులైన నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీలకు చెందిన రూ.1217.20 కోట్ల విలువైన 41 ఆస్తులను జప్తు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు (ఇడి)వెల్లడించారు. ముంబయిలో 15 ఫ్లాట్లు, 17 కార్యాలయాలు, కోల్‌కతాలోని షాపింగ్‌మాల్, అలీబాగ్‌లోని నాలుగు ఎకరాల వ్యవసాయ క్షేత్రం, మహారాష్ట్రలోని నాసిక్, నాగ్‌పూర్, తమిళనాడులోని పన్వేల్, విల్లుపురం తదితర ప్రాంతాల్లోని చోక్సీకి సంబంధించిన 231 ఎకరాల భూమిని జప్తు చేసినట్లు ప్రకటించారు. తెలంగాణా రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లాలో రూ.500 కోట్ల విలువ చేసే 170 ఎకరాల పార్కును కూడా జప్తు చేసినట్లు తెలిపారు. మహారాష్ట్రలో బొరివాలీలోని నాలుగు ఫ్లాట్స్, శాంతాక్రూజ్‌లోని కామెరు టవర్స్‌లోని తొమ్మిది ఫ్లాట్లను కూడా జప్తు చేసినట్లు ఇడి వెల్లడించింది. ఈ ఆస్తుల మొత్తం విలువ రూ. 1,217 కోట్లని ఇడి పేర్కొంది. దేశంలోనే అతిపెద్ద బ్యాంకుల్లో ఒకటైన పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంలో బ్యాంకు అధికారులను కూడా అరెస్టు చేసినట్లు తెలిపారు.

నీరవ్‌మోడీ, మెహుల్ చోక్సీలు జనవరి మొదటి వారంలో దేశాన్ని విడిచి పారిపోవడానికి ముందే సిబిఐ అధికారులు వారిపై క్రిమినల్ కేసులను నమోదు చేశారు. ఫిబ్రవరి 14న మొదటి ఎఫ్ఐఆర్ వారిమీద నమోదైన సంగతి తెలిసిందే. కాగా, వారిద్దరూ తాము ఎటువంటి నేరాలకు పాల్పడలేదని పేర్కొనడం గమనార్హం.

109 శాతం పెరిగిన అదానీ సంపద

రూ. 91 వేల కోట్లతో గౌతమ్ అదానీకి ప్రపంచంలో 98వ స్థానం

- **రూ.2 లక్షల 88 వేల కోట్లతో ముకేశ్ అంబానీకి 19వ స్థానం**
- **హురున్ ప్రపంచ ధనవంతుల జాబితా-2018లో..**
- **ఇండియా నుంచి 31మంది కొత్తవారికి చోటు**



న్యూఢిల్లీ: ప్రపంచ కుబేరుల సంపద 31 శాతం పెరిగినట్లు హురున్ ప్రపంచ ధనవంతుల జాబితా-2018 వెల్లడించింది. ఈ ఏడాది 68 దేశాలకు చెందిన 2,694మందికి(2,157 కంపెనీలకు చెందినవారికి) ఈ జాబితాలో చోట్లు దక్కింది. ఆరేండ్ల క్రితం ప్రపంచ జీడీపీలో కుబేరుల వాటా 7 శాతం కాగా, ఇప్పుడది 13.2 శాతానికి పెరిగింది. జాబితాలోని కుబేరుల మొత్తం సంపద 10 లక్షల 50 వేల కోట్ల డాలర్లు. ఈసారి ఇండియా నుంచి 131మందికి చోటు లభించగా, వీరిలో 31మంది కొత్తవారు. భారత సంతతికి చెందినవారితో కలిపి చూస్తే జాబితాలో చోటు దక్కినవారి సంఖ్య 170. దేశాలవారీగా ఎక్కువమందికి చోటు దక్కినవారిలో భారత్‌కు మూడో స్థానం. 819మందితో చైనా మొదటిస్థానంలో, 571మందితో అమెరికా రెండో స్థానంలో నిలిచాయి. గతేడాది చైనా నుంచి 534మందికి, అమెరికా నుంచి 535మందికి ఈ జాబితాలో చోటు దక్కడం గమనార్హం. భారత్ నుంచి అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ(55) సంపద ఒక్క ఏడాదిలో రెండితలైనట్లు హురున్ నివేదిక వెల్లడించింది. గౌతమ్ అదానీ సంపదను సుమారు రూ.91,245 కోట్లు(1400 కోట్ల డాలర్లు)గా హురున్ ప్రపంచ నివేదికలో తెలిపారు. ప్రపంచ కుబేరుల్లో అదానీ 98వ స్థానంలో నిలిచారు. ఒక్క ఏడాదిలోనే అదానీ సంపద 109 శాతం పెరిగినట్టు నివేదికలో పేర్కొన్నారు. హర్యానా ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సావిత్రీ జిందాల్‌కు ప్రపంచ జాబితాలో 149వ స్థానం దక్కింది. వీరి ఆస్తి విలువ సుమారు రూ.70,400 కోట్లు(1100 కోట్ల డాలర్లు)గా లెక్క తేల్చారు. రిలయన్స్ గ్రూప్ అధినేత ముకేశ్ అంబానీ(60) సుమారు రూ.2,88,000 కోట్ల(4500 కోట్ల డాలర్లు) సంపదతో దేశంలో మొదటిస్థానంలో ప్రపంచంలో 19వ స్థానంలో నిలిచారు. ఈయన సంపద ఈ ఏడాదిలో 73 శాతం పెరిగినట్టు నివేదికలో వెల్లడైంది. ఇండియా నుంచి ఈ జాబితాలో చోటు దక్కించుకున్నవారిలో అత్యధికంగా 19మంది ఔషధ పరిశ్రమకు చెందినవారు కాగా,ఆటోమొబైల్-విడిభాగాల తయారీకి చెందినవారు 14మంది, వినియోగ ఉత్పత్తులకు చెందినవారు 11మంది ఉన్నారు. ప్రపంచంలోనే అత్యధిక సంపద కలిగిన వ్యక్తిగా అమేజాన్ అధినేత జెఫ్‌బెజోస్ నిలిచారు. ఈయన సంపద 12,300 కోట్ల డాలర్లు. రెండో స్థానంలో 10,200 కోట్ల డాలర్లతో బెర్క్‌షైర్ హాత్‌వే అధినేత వారెన్ బఫెట్, మూడోస్థానంలో 9,000 కోట్ల డాలర్లతో మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ నిలిచారు.

జిఎస్‌టి ఎగవేత కేసుల్లో రెండు కంపెనీల డైరెక్టర్ల అరెస్టు

రూ.7 వేల కోట్ల మేరకు పన్ను ఎగవేత



ముంబయి : జిఎస్‌టి అమలులోకి వచ్చిన అనంతరం తొలి సారిగా పన్ను ఎగవేతకు కేసుల్లో ముంబయికి చెందిన రెండు కంపెనీల డైరెక్టర్లను గురువారం అధికారులు అరెస్టు చేసి కేసులు నమోదు చేశారు. రూ.ఏడువేల కోట్ల మేరకు పన్ను ఎగవేతకు ఆ కంపెనీలు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. షా బ్రదర్స్ ఇస్పాట్ ప్రై. లిమిటెడ్ డైరెక్టర్ సంజీవ్ ప్రవీణ్ మెహతా రూ. 5.20 కోట్లు, విఎన్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ వినయ్‌కుమార్ డి ఆర్యా రూ. 2.03 కోట్లు పన్ను చెల్లించకుండా మోసానికి పాల్పడినటు సిజిఎస్‌టి ముంబయి సెంట్రల్ కమిషనరేట్ అధికారులు తెలిపారు.

ప్రవీణ్ మెహతా రూ. ఐదుకోట్లకు మించి మోసానికి పాల్పడటంతో నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేయగా, విఎన్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ఆర్యాపై బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అమ్మకాలు, కొనుగోళ్లు చేసినట్లు ఇన్వాయిస్‌లలో మాత్రమే నమోదుచేశారని, అయితే ఎటువంటి కొనుగోళ్లు, అమ్మకాలు జరగలేదని అధికారులు తమ నివేదికలో తెలిపారు.

12వ తరగతి పరీక్షలు ప్రారంభం

అదనంగా 278 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

చెన్నై : తమిళనాడు, పాండిచ్చేరిలలోని 6,903 పాఠశాలలోని మొత్తం 8.66 లక్షల మంది విద్యార్థులు గురువారం నుండి ప్రారంభమైన పన్నెండవ తరగతి పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. లాంగ్వేజ్ పేపర్ 1 పరీక్ష జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. వీరితో పాటు 40,686మంది ప్రైవేటు విద్యార్థులు కూడా హాజరయ్యారని, పరీక్ష ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.15 వరకు నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఏడాది కొత్తగా 278 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వ పరీక్షల అధికారులు బుధవారం వెల్లడించిన సంగతి తెలిసిందే.

అధికారుల నిర్లక్ష్యానికి బాలిక మృతి

బైక్‌పై ఆస్పత్రికి తరలించిన తల్లిదండ్రులు

భోపాల్ : తీవ్రజ్వరంతో బాధపడుతున్న బాలికను మెరుగైన వైద్యం కోసం తరలించేందుకు అధికారులు అంబులెన్స్‌ను తిరస్కరించడంతో మృతిచెందిన సంఘటన మధ్యప్రదేశ్‌లో చోటు చేసుకుంది. రత్లాం పరిధిలోని నందలేట గ్రామానికి చెందిన ఘనశ్యాం కుమార్తె జీజా కొద్దికాలంగా తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. ఆమెను చికిత్స కోసం ప్రాథమికవైద్య కేంద్రానికి తీసుకెళ్లారు. వారు మెరుగైన చికిత్స కోసం పెద్దాస్పత్రికి తీసుకెళ్లాల్సిందిగా సూచించారు. ఘనశ్యాం రోజువారీ కూలి. దీంతో స్నేహితుడు, భార్య దీనాబాయి సాయంతో జీజి చేతికి ఉన్న సెలైన్‌బాటిల్‌తో సహ బైక్‌పై బయలుదేరారు. 30 కిలోమీటర్ల దూరంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే జీజ మృతిచెందినట్లు వైద్యుల ధృవీకరించారు. దీనిపై మీడియాలో కథనాలు రావడంతో కలెక్టర్ సోమేష్ మిశ్రా విచారణకు ఆదేశించారు. సైలనాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒకే అంబులెన్స్ ఉందని, అది రిపేరుకు రావడంతో మూడు నెలల క్రితం కాంట్రాక్టరుకు చెప్పామని, ఇంతవరకు బాగుచేయలేదని వైద్యులు చెబుతున్నారు.

ప్రభుత్వ వైఫల్యమే కాంగ్రెస్ విజయం : రాహుల్



న్యూఢిల్లీ : మధ్యప్రదేశ్ ప్రభుత్వ వైఫల్యమే అక్కడి మంగోలీ, కొలరస్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయానికి కారణమైందనీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ గురువారం పేర్కొన్నారు. ఓటర్లకు, నియోజకవర్గాల్లో గెలిచిన అభ్యర్థులను, ప్రజలకు ట్విట్టర్ ద్వారా అభినందనలు తెలిపారు. 2017 అటర్, ఖజరారే నియోజకవర్గాల్లో గెలిచిన అనంతరం కాంగ్రెస్‌కు ఇది నాలుగో విజయం.

పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ సంస్కరణల పర్వం

సిపిసి కేంద్రకమిటీ 3వ ప్లీనంలో నిర్ణయం

బీజింగ్: పార్టీలోనూ, ప్రభుత్వ వ్యవస్థల్లోనూ సంస్కరణల పర్వాన్ని వేగంగా కొనసాగించాలని బుధవారం ఇక్కడ ముగిసిన చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) కేంద్ర కమిటీ 3వ ప్లీనం నిర్ణయించింది. ఈ మేరకు ప్లీనం ముగింపు తరువాత సిపిసి కేంద్ర కమిటీ ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర కమిటీ పొలిట్‌బ్యూరో అధ్యక్షతన జరిగిన ప్లీనంలో సిపిసి ప్రధాన కార్యదర్శి సీ జిన్‌పింగ్ కీలకోపన్యాసం చేశారు. ఈ సమావేశాలకు 202 మంది సిపిసి కేంద్రకమిటీ సభ్యులు, 171 మంది ప్రత్యామ్నాయ సభ్యులు, కేంద్ర క్రమశిక్షణా సంఘం డిప్యూటీ కార్యదర్శులు, ఇతర సీనియర్ నేతలు హాజరయ్యారు. సిపిసి కేంద్ర కమిటీ పొలిట్‌బ్యూరో ఆదేశం మేరకు ప్రభుత్వ కృషిని వివరిస్తూ సీ జిన్‌పింగ్ ప్రవేశపెట్టిన కార్యాచరణ నివేదికపై ఈప్లీనరీ సమావేశాలలో విస్తృతంగా చర్చించారు. దీనితో పాటు రాష్ట్రాల నాయకత్వానికి ప్రతిపాదిత అభ్యర్థులపేర్లను ఈ సమావేశంలో ఖరారు చేశారు. చైనా 13వ నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పిసి-పార్లమెంట్) తొలి సమావేశాల తేదీలను ఈ సమావేశంలో ఖరారు చేశారు. దీనితో పాటు చైనీస్ పీపుల్స్ పొలిటికల్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్(సిపిపిసిసి)కు కూడా తేదీలను ఖరారు చేశారు. పార్టీలోనూ, ప్రభుత్వ వ్యవస్థల్లోనూ సంస్కరణలను వేగంగా, విస్తృత స్థాయిలో అమలు చేయాలని సిపిసి కేంద్ర కమిటీ తీసుకున్న నిర్ణయంపై సమీక్షించిన ప్లీనం సమావేశాలు దానికి ఆమోదముద్ర వేశాయి. మార్క్సిజం-లెనినిజం, మావోజెడాంగ్ ఆలోచనా విధానం, డెంగ్‌జియావోపింగ్ సైద్ధాంతికత, కొత్త యుగంలో చైనా పరిస్థితులకు అనువైన సోషలిజంపై సీ జిన్‌పింగ్ ఆలోచనలను కేంద్ర కమిటీ పొలిట్‌బ్యూరో గట్టిగా సమర్థించింది.

ప్రత్యేకం

పాక్‌తో చర్చల క్రమాన్ని పునరుద్ధరించాలి

సిపిఎం డిమాండ్



న్యూఢిల్లీ : ప్రభుత్వం తన ఘర్షణాయుత వైఖరిని విడనాడాలని, పాకిస్తాన్‌తో సమగ్ర చర్చల క్రమాన్ని పునరుద్ధరించేందుకు తక్షణమే చర్చలను ప్రారంభించాలని సిపిఎం కోరింది. పాకిస్తాన్‌తో చర్చలకు గల అవకాశాలన్నింటినీ మూసివేయడం ద్వారా కేంద్రం తనకు తానే ఇబ్బందులను, నిస్సహాయతను సృష్టించుకుందని పీపుల్స్ డెమోక్రసీ తాజా సంచిక సంపాదకీయంలో ప్రకాష్ కరత్ వ్యాఖ్యానించారు. ఈ ఘర్షణాయుత వైఖరి నుండి వెనక్కి మళ్ళాల్సిన తక్షణావశ్యకత వుందని కరత్ అన్నారు. ముందుగా, వాస్తవాధీన రేఖ వద్ద, జమ్మూ కాశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వద్ద కాల్పుల విరమణ జరగాలని, శాంతి నెలకొనాలని అందుకోసం చర్చలు జరపాలని కోరారు. మరోవైపు పాకిస్తాన్‌తో సమగ్ర చర్చల క్రమాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు కూడా తీసుకోవాలని కోరారు. పాకిస్తాన్ పదే పదే జరుపుతున్న కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనలకు భారత ప్రభుత్వం సర్జికల్ దాడుల ద్వారా దీటైన సమాధానం ఇచ్చిందని అప్పటి రక్షణ మంత్రి మనోహర్ పారిక్కర్ ప్రకటించారని అన్నారు. అయినా పాక్ సైన్యం నిరంతరంగా జరుపుతున్న శతఘ్ని దాడులను నిలువరించలేకపోయిందని వ్యాఖ్యానించారు. సరిహద్దు ఆవల నుండి తీవ్రవాదులు సైన్యం, బిఎస్‌ఎఫ్ శిబిరాలపై జరిపే దాడులను కూడా అరికట్టలేకపోయిందని అన్నారు. 2013లో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత 2017లో రికార్డు స్థాయిలో కాల్పుల ఉల్లంఘనలు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. ఎల్‌ఓసి వద్ద 860 సంఘటనలు, అంతర్జాతీయ సరిహద్దు వద్ద 120 సార్లు కాల్పులు చోటు చేసుకున్నాయని కరత్ తన సంపాదకీయంలో పేర్కొన్నారు. పాకిస్తాన్ మద్దతుతో సాగుతున్న నిరసనలు, వేర్పాటువాద డిమాండ్లన్నీ జమ్మూ కాశ్మీర్‌లో రాజకీయ చర్చలు జరిపేందుకు అవరోధంగా మారుతున్నాయని ప్రధాని మోడీ చేస్తున్న వాదన ఏకపక్షంగా వుందని కరత్ విమర్శించారు. కాశ్మీరు లోయలో పరిస్థితిని మరింత అధ్వాన్నం చేస్తున్నది భద్రతాపరమైన, సైనిక విధానాలేనని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం తక్షణమే విశ్వాస పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని కరత్ సూచించారు. దానితో పాటు సరిహద్దు ఆవల నుండి తీవ్రవాదుల చొరబాట్లను నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాశ్మీర్‌పై జాతీయవాద ధోరణిని అనుసరిస్తున్నప్పటికీ ఈ సమస్య రాజకీయ పరిష్కారానికి పాక్‌తో చర్చలు కీలకమైన అంశమని ఆయన స్పష్టం చేశారు.

సంక్షిప్తం

ఐఎన్‌ఎక్స్ మీడియా లావాదేవీలపై దర్యాప్తుకు నేనే ఆదేశించా : చిదంబరం వెల్లడి

న్యూఢిల్లీ : తన కుమారుడు నిందితుడుగా వున్న కంపెనీ లావాదేవీలపై దర్యాప్తుకు తానే అదేశించానని మాజీ ఆర్థికమంత్రి పి.చిదంబరం పేర్కొన్నారు. 2013లో ఆర్థిక మంత్రిగా వున్న చిదంబరం ఐఎన్‌ఎక్స్ గ్రూపుపై తీవ్రంగా ఆరోపణలు రావడంతో దర్యాప్తు జరపాలని ఆదేశించారు. తమపై వచ్చిన ఆరోపణలను తిరస్కరిస్తూ, ఇది రాజకీయ కక్ష సాధింపు చర్య అని చిదంబరం పేర్కొన్నారు. ఇదిలా వుంటే, ఐఎన్‌ఎక్స్ మీడియాకు సాయపడేందుకు ఆర్థిక మంత్రిత్వశాఖను కార్తి చిదంబరం ప్రభావితం చేశారని పేర్కొంటున్నారని, ఇది అవాస్తవమని మద్రాసు హైకోర్టులో దాఖలైన పిటిషన్ పేర్కొంది.

మద్య నిషేధాన్ని వ్యతిరేకించిన కమల్‌హాసన్

చెన్నై : మద్యనిషేధాన్ని మక్కల్ నీది మయ్యం వ్యవస్థాపకుడు కమల్‌హాసన్ వ్యతిరేకిస్తున్నారు. ఈ మద్య నిషేధం మాఫియా విజృంభణకు దారి తీస్తుందని ఆనంద వికటన్ పత్రిక 'వీక్లీ కాలమ్'లో ఆయన పేర్కొన్నారు. మద్య నిషేధాన్ని అమలు పరచడం వల్ల కల్తీ సారాయి సమస్య తలెత్తుతుందని ఆయన సూచనప్రాయంగా తెలిపారు. మద్య నిషేధమనేది జూదం వంటిదికాదని, ఒక్కసారిగా ఆపేయడానికి శరీరం అందుకు సహకరించాల్సి వుంటుందని పేర్కొన్నారు. తాగడాన్ని తగ్గించవచ్చు కానీ పూర్తిగా ఆపేయడమంటే సందేహించాల్సి వుంటుందని అన్నారు. డిఎంకెతో సహ ప్రతిపక్ష పార్టీలన్నీ మద్య నిషేధం అమలు చేస్తామని తమ ఎన్నికల ప్రణాళికల్లో హామీ ఇచ్చాయి. పాలక అన్నాడిఎంకె కూడా అదే హామీ ఇచ్చింది. దశలవారీగా మద్య నిషేధాన్ని అమలు చేస్తామని పేర్కొంది. తదనుగుణంగా ఇప్పటివరకు వెయ్యి రిటైల్ లిక్కర్ కేంద్రాలను మూసివేసింది.

ఆప్ ఎమ్మెల్యే బెయిల్ పిటిషన్‌పై నివేదికను ఇవ్వాలన్న ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ : ఢిల్లీ చీఫ్ సెక్రటరీ అన్షు ప్రకాష్ దాడి కేసులో ఆప్ ఎమ్మెల్యే ప్రకాష్ జర్వాల్ బెయిల్ పిటిషన్‌పై నివేదికను ఇవ్వాలని ఢిల్లీ పోలీసులకు ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మార్చి 7లోగా దీనిపై సమాధానమివ్వాలని ఢిల్లీ పోలీసులను కోరింది. గత వారం టిస్ హజరీ హైకోర్టు బెయిల్‌ను తిరస్కరించి 14 రోజుల రిమాండ్‌కు తరలించగా, బెయిల్ కోసం ప్రకాష్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. కాగా, ఈ దాడికేసులో ఆప్ ఎమ్మెల్యే నితిన్ త్యాగి, రాజేష్ రిస్కి విచారణకు రావాలని ఢిల్లీ పోలీసులు సమన్లు జారీ చేశారు.

అమెరికా మార్కెట్‌లో గాంధీజీ లేఖ

వాషింగ్టన్: మహాత్మాగాంధీ ఏసుక్రీస్తుపై తన అభిప్రాయాన్ని తెలుపుతూ శబర్మతీ ఆశ్రమం నుంచి 1926 ఏప్రిల్ 6న అమెరికాలోని మత పెద్ద మిల్టన్ న్యూబెర్రీ ఫ్రాన్జ్‌కు రాసిన ఒక అరుదైన లేఖను సేకరించి పెన్సిల్వేనియాలోని రాబ్ కలెక్షన్ విక్రయానికి ఉంచింది. మిల్టన్ తనకు రాసిన ఒకలేఖకు జవాబుగా ఈ లేఖను పంపారు. 'మానవాళికి గొప్ప బోధకుల్లో జీసస్ ఒకరు' అని ఈ లేఖలో గాంధీజీ పేర్కొన్నారు. మతపరంగా వివిధ మతాల మధ్య సామరస్యతను, ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ , జీసస్ గురించి తనకుగల నమ్మకాన్ని అంతవరకే గాంధీజీ పరిమితం చేస్తూ ఈ లేఖను రాశారు. ఇది ప్రయివేట్ సేకరణల్లో ఇది అత్యంత అరుదైన చరిత్రాత్మక లేఖ అని, ఈ ఒరిజినల్ లేఖ ప్రారంభ ధర 50వేల డాలర్లుగా రాబ్ కలెక్షన్ ఒక ప్రకటనలో పేర్కొంది.

మంచు ఖడ్గం

జెనీవా విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు వీలుగా రన్‌వే పై మంచును తొలగిస్తున్న దృశ్యం



జెనీవా నగరంపై మంచుపొర

తాత్కాలికంగా విమానాశ్రయం మూసివేత

జెనీవా: స్విస్‌లోని జెనీవా నగరాన్ని భారీయెత్తున మంచుపొర కప్పివేయటంతో అక్కడి విమానాశ్రయాన్ని 'తిరిగి ప్రకటించే వరకూ' మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ప్రయాణీకులు తమ ప్రయాణాలను ప్రస్తుతానికి వాయిదా వేసుకోవాలని, విమానాల రాకపోకలపై ఆయా వైమానిక సంస్థలను సంప్రదించాలని విమానాశ్రయ అధికారులు తమ వెబ్‌సైట్‌లో పొందుపర్చిన ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలో భారీయెత్తున మంచు కురుస్తుండటంతో తొలుత ఒక గంటసేపు మూసివేయాలనుకున్నామని, తరువాత దానిని మరో గంటకు పొడిగించారని విమానాశ్రయ ప్రతినిధి సెబాస్టియన్ లెప్రాట్ చెప్పారు. అప్పటికీ హిమపాతం తగ్గకపోవటంతో విమానాశ్రయ పునరుద్ధరణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని వివరించారు. గురువారం వేకువ జాము నుండి దాదాపు మూడు గంటలు నిర్విరామంగా కురిసిన మంచు నగరంపై దాదాపు 13 సెంటీమీటర్ల (ఐదంగుళాల) ఎత్తున పేరుకుపోయిందని స్విస్ జాతీయ వాతావరణశాఖకు చెందిన శాస్త్రవేత్త డోమ్నిక్ సుస్సీ చెప్పారు.

ఈజిప్ట్ రైలు ప్రమాదంలో 15కు చేరిన మృతుల సంఖ్య

కెయిరో: ఈజిప్ట్‌లోని బెహరియా ప్రావిన్స్‌లో బుధవారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో మృతుల సంఖ్య 15కు పెరిగిందని అధికార మెనా వార్తా సంస్థ వెల్లడించింది. ఈ రైలు ప్రమాదంలో మరో 40మందికి పైగా గాయపడ్డారని రవాణా మంత్రిత్వశాఖ ప్రతినిధిని ఉటంకిస్తూ అది వెల్లడించింది. ప్రమాద వార్త తెలిసిన వెంటనే రవాణా మంత్రి హేషమ్ అరాఫత్ హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుని సహాయ కార్యక్రమాలపై సమీక్షించారని ఈజిప్ట్ టీవీ వెల్లడించింది. ఒక ప్రయాణీకుల రైలు గూడ్స్ రైలును ఢీకొనడంతో రెండు బోగీలు పట్టాలు తప్పాయని బెహరియా సెక్యూరిటీ చీఫ్ అలా ఎల్‌దీన్ అబ్దుల్ ఫతా వివరించారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే క్షతగాత్రులను వైద్యచికిత్సకు తరలించేందుకు దాదాపు 30కి పైగా అంబులెన్స్‌లు ప్రమాద స్థలికి చేరుకున్నాయని చెప్పారు. ప్రమాదానికి కారణాలను కనుగొనేందుకు ఇంజనీరింగ్ కమిటీని నియమించినట్లు ఈజిప్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెప్పారు.

మదురో అభ్యర్థిత్వానికి వేలాది మంది మద్దతు

కారకాస్: ఏప్రిల్‌లో జరుగనున్న వెనిజులా అధ్యక్ష ఎన్నికలకు అభ్యర్థిగా తన పేరును అధికారికంగా నమోదు చేసుకున్న అధ్యక్షుడు నికొలస్ మదురోకు వేలాది మంది అభిమానులు, మద్దతుదారులు తమ మద్దతును ప్రకటించారు. గురువారం నాడు తన అభ్యర్థిత్వ నమోదుకు ఎన్నికల కమిషన్ కార్యాలయానికి బయల్దేరిన మదురో ముందుగా మాజీ అధ్యక్షుడు హ్యూగోఛావెజ్ స్మారక ప్రాంతాన్ని సందర్శించి ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన తన మద్దతుదారులనుద్దేశించి ప్రసంగిస్తూ 'మనం అజేయుడైన మన ప్రియతమ నేతకు నివాళులర్పించేందుకు అతి పవిత్రమైన ప్రదేశానికి చేరుకున్నామని, మేం విజయంతో తిరిగి వస్తామని ఆయనకు చెబుతున్నాన'నని ప్రకటించారు. ఎన్నికల కమిషన్ కార్యాలయంలో తన పేరును నమోదు చేసుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు వ్యతిరేకంగా పోటీ చేసేందుకు అమెరికాపై ఆధారపడుతున్న ప్రతిపక్షం దమ్ముంటే అమెరికాతో బంధాన్ని తెగతెంపులు చేసుకుని తనతో తలపడాలని సవాల్ చేశారు.

కాగా ఏప్రిల్ అధ్యక్ష ఎన్నికల్లో తాము పాల్గొనబోవటం లేదని ప్రతిపక్ష డెమొక్రాటిక్ యూనిటీ



రౌండ్ టేబుల్ ఇప్పటికే ప్రకటించింది. వెనిజులా ఎన్నికల ప్రక్రియ అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్‌తో సహా ప్రపంచ వ్యాప్తంగా పలువురు నేతల ప్రశంసలు అందుకున్నప్పటికీ అమెరికా మద్దతునిస్తున్న ప్రతిపక్షం మాత్రం ఈ నిర్ణయం తీసుకోవటం గమనార్హం. కాగా మదురోకు వ్యతిరేకంగా తాను ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లు మాజీ గవర్నర్ హెన్రీ ఫాల్కన్ ప్రకటించారు. అధికార దాహంతో వున్న మదురోపై తాను విజయం సాధించి తీరుతానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అధ్యక్ష ఎన్నికల బహిష్కరణపై ప్రతిపక్ష నిర్ణయాన్ని వ్యతిరేకించాలన్న ఫాల్కన్ నిర్ణయాన్ని ఆయన మద్దతుదారులు గట్టిగా సమర్థించారు.

తుపాకి చట్టాల మార్పు తప్పదు : ట్రంప్

వాషింగ్టన్ : అమెరికా తుపాకీ చట్టాలకు శీఘ్రతరంగా గణనీయమైన మార్పులు చేయాల్సిన అవసరం వుందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అయితే, చర్యలు తీసుకోవడానికి కొంతమంది రిపబ్లికన్లు కూడా నేషనల్ రైఫిల్ అసోసియేషన్ (ఎన్ఆర్ఎ) చూసి భయపడుతున్నారని ట్రంప్ వ్యాఖ్యానించారు. తమ పార్టీ తీసుకున్న విధానం, చట్టపరమైన వ్యూహాన్ని ట్రంప్ తిరస్కరిస్తున్నారు. ఫ్లోరిడా హైస్కూల్లో జరిగిన కాల్పులు వంటి ఘటనలు పునరావృతం కాకుండా వుండేందుకు, సమగ్ర దృక్పథాన్ని అనుసరించడానికి తాను అనుకూలంగా వున్నట్లు ట్రంప్ చెప్పారు. అయితే దానికి సంబంధించి వివరాలేమీ వెల్లడించలేదు. తుపాకీ కాల్పుల ఘటనలను నిలువరించడానికి కచ్చితంగా కొన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందని ట్రంప్ స్పష్టం చేశారు. స్కూళ్ళలో భద్రతను పెంచాల్సి వుందన్నారు. మానసిక ఆరోగ్య రంగానికి వనరుల కేటాయింపు పెరగాలన్నారు. తుపాకీలను కొనుగోలు చేయాలంటే కనీస వయస్సును 21కి పెంచాలన్న ప్రతిపాదనకు మద్దతు తెలిపారు. టీచర్లకు ఆయుధాలు సమకూర్చాలని కూడా సూచించారు. బంప్ స్టాక్ పరికరాలను కూడా నిషేధిస్తామని చెప్పారు. ప్రతినిధుల సభ, సెనెట్ సభ్యుల 17వ సమావేశాన్ని ప్రారంభిస్తూ ట్రంప్ 'ఇక వేచి వుండలే మని, చేతులు కట్టుకు కూర్చోలేమని అన్నారు. ఈ సమస్యలు నిలువరించాలని భావిస్తున్నాం' అని అన్నారు. కోర్టు ఆదేశాలు లేకపోయినా ఇటువంటి విషాదాలను నివారించాలంటే ముందుగా తుపాకులను జప్తు చేసుకోవాలని, కావాలంటే తర్వాత అవసరమైన క్రమాన్ని చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వైట్‌హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ రాజీనామా

వాషింగ్టన్ : ట్రంప్ ప్రభుత్వ 13నెలల పాలనలో ఉన్నత స్థాయి సీనియర్ అధికారులు రాజీనామాలు కొనసాగుతున్నాయి, ఇప్పటికే ముగ్గురు రాజీనామా చేయగా, బుధవారం వైట్‌హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ పదవికి హోప్ హిక్స్ (29) రాజీనామా చేశారు.దీంతో ఈ సంఖ్య నాలుగుకు చేరింది. అధ్యక్షుడు ట్రంప్‌కు అత్యంత సన్నిహితురాలైన హిక్స్ మూడేళ్ళ పాటు ట్రంప్ వద్ద వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం వైట్‌హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా వున్నారు. గతేడాది జనవరి 20న ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసే సమయానికి ఆమె ఆయన ప్రచారప్రతినిధిగా, వ్యూహాత్మక కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా వున్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యా ప్రమేయంపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి ప్రతినిధుల సభ ఇంటెలిజెన్స్ కమిటీ ముందు ఆమె వాంగ్మూలం ఇచ్చారు. ఆ మరుసటి రోజే తన పదవికి రాజీనామా చేశారు. వైట్‌హౌస్‌కి వెలుపల తనకు గల అవకాశాలను అన్వేషించుకునేందుకే తాను రాజీనామా చేయాలనుకుంటున్నానని హిక్స్, ట్రంప్‌కు తెలిపారు. ఆమె రాజీనామా చేస్తే ఆమె సేవలను తాను కోల్పోతానని, అయితే ఇతర అవకాశాలను అన్వేషిస్తానని ఆమె చెప్పిన అభిప్రాయాన్ని అర్థం చేసుకున్నానని ట్రంప్‌చెప్పారు. భవిష్యత్తులో కలిసి పనిచేసే అవకాశం రావచ్చని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆమె రాజీనామా ఎప్పటినుండి అమల్లోకి వస్తుందో ట్రంప్ వివరించలేదు.



బ్రిటన్‌లో వ్యాపార దిగ్గజాల పతనం

రోడ్డున పడ్డ 6 వేల మంది ఉద్యోగులు

రోథర్‌హామ్ (బ్రిటన్) : బ్రిటన్‌లో ప్రసిద్ధి చెందిన వ్యాపార దిగ్గజ సంస్థలు టాయ్స్ ఆర్‌యుస్, మాప్లిన్‌లు మూత పడ్డాయి. ఈ సంస్థలు తమ వ్యాపారాన్ని మూసివేస్తున్నట్లు గురువారం ప్రకటించటంతో దాదాపు 6 వేల మందికి పైగా ఉద్యోగులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. ఎలక్ట్రానిక్ వ్యాపార దిగ్గజ సంస్థ మాప్లిన్ మూతపడటంతో 2,300 మంది, టాయ్స్ ఆర్‌యు సంస్థ మూతపడటంతో 3,200 మంది ఉద్యోగాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. కాగా వీరి ఉద్యోగ భద్రతపై చర్చించేందుకు మూతపడిన కంపెనీ యాజమాన్యాలు, కార్మిక సంఘాలు, ప్రభుత్వం మధ్య త్రైపాక్షిక భేటీ జరగాలని లేబర్ పార్టీకి చెందిన షాడో వాణిజ్య మంత్రి రెబెక్కా లాంగ్‌బెయిలీ అభిప్రాయపడ్డారు. జిఎంబి కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి టిమ్ రోచ్ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం వద్ద సరైన పారిశ్రామిక వ్యూహం కానీ, ఉద్యోగ భద్రతకు సంబంధించిన ప్రణాళికలు కానీ లేకపోవటంతో ఉద్యోగులు, కార్మికులు రోడ్డున పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో తమ వ్యాపారం తీవ్రస్థాయిలో మందగించినందు వల్ల తప్పనిసరి పరిస్థితుల్లో వ్యాపారాన్ని మూసివేయాలని నిర్ణయించామని టాయ్స్ ఆర్‌యుస్ సంస్థ యాజమాన్యం వెల్లడించింది. దాదాపు 1.5 కోట్ల పౌండ్ల పన్ను బకాయిలు, ఇతర రుణాలతో సతమవుతున్న ఈ సంస్థ తన వ్యాపారాన్ని గత ఏడాది పునర్వ్యవస్థీకరించి నష్టదాయక విభాగాలను మూసివేసింది. ఈ పునర్వ్యవస్థీకరణ ప్రణాళికను గత డిసెంబర్‌లో పెన్షన్ ప్రొటెక్షన్ ఫండ్ (పిపిఎఫ్)తో సహా అధికశాతం మంది రుణదాతలు ఆమోదించినప్పటికీ, అంతిమంగా వ్యాపారాన్ని కాపాడుకోలేకపోయారు. టాయ్స్ ఆర్‌యుస్ సంస్థ మూతపడిన కొద్దిగంటల్లోనే తాము కూడా వ్యాపారాన్ని మూసివేస్తున్నట్లు మాప్లిన్ సంస్థ యాజమాన్యం ప్రకటించింది. తమ సంస్థను విక్రయించేందుకు ప్రైస్‌వాటర్‌హౌస్ కూపర్స్ (పిడబ్ల్యుసి)కు అప్పగించామని, వ్యాపారం మందగించిన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రత్యామ్నాయం లేక వ్యాపారాన్ని మూసివేయాలని నిర్ణయించామని మాప్లిన్ యజమాని గ్రాహమ్ హారిస్ చెప్పారు. ఈ రెండు సంస్థల మూసివేతతో రోడ్డున పడిన కార్మికులు, ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని లాంగ్‌బెయిలీ చెప్పారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని వారికి రావల్సిన వేతన బకాయిలను పూర్తిగా ఇప్పించేందుకు ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. దీనితో పాటు దేశ వ్యాప్తంగా రిటైల్ వ్యాపార రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణం స్పందించాలని ఆమె డిమాండ్ చేశారు. కన్జర్వేటివ్ పార్టీ ప్రభుత్వం అంతర్గత విభేదాలకు తెరదించి బ్రిటన్ కార్మికులకు, యువతకు మంచి ఉద్యోగాలు, గౌరవప్రదమైన వేతనాలతో కూడిన అవకాశాలు కల్పించేందుకు అవసరమైన ప్రణాళికతో ముందుకు రావాలన్నారు.

మొదటి పేజీ తరువాయి

7న విద్యుత్ కార్మికుల 'చలో విద్యుత్ సౌధ'

యాజమాన్యం దుర్మార్గ పూరితమైన వైఖరి అవలంబిస్తోందన్నారు. సమ్మెను ఉధృతంగా కొనసాగిస్తున్న కార్మిక సంఘాల జిల్లా నేతలకు అభినందనలు తెలిపారు. సమావేశంలో ఐక్య వేదిక కన్వీనర్ ఎస్.వి రమణమూర్తి, ట్రెజరర్ చంద్రశేఖర్, వైస్ ఛైర్మెన్‌లు గంగయ్య, సురేష్, బాబీ, చీఫ్ కోఆర్డినేటర్ హారతి, కో కన్వీనర్ కట్టా నాగరాజు పాల్గొన్నారు.

'విద్యుత్' కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలి: ఎం.ఎ గఫూర్

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ గఫూర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నా చౌక్‌లో కార్మికులు చేపట్టిన సమ్మె శిబిరాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం, యాజమాన్యం సమ్మె విషయంలో తాత్సారం చేస్తోందన్నాయన్నారు. ఈ సందర్భంగా పలు సంఘాలు సమ్మెకు మద్దతు తెలిపాయి. ఎపి అంగన్వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు వై.నర్సింహారావు, సిఐటియు రాష్ట్ర నాయకులు ముజఫర్, పశ్చిమ కృష్ణా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, ఎన్.సిహెచ్ శ్రీనివాసరావు శిబిరానికి హాజరై సమ్మెకు మద్దతు ప్రకటించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి నాయుని కృష్ణమూర్తి కన్నుమూత

పొందాయి. మూడు తెలుగు, ఇంగ్లీషు నిఘంటువులకు సంకలనకర్తగా పేరు సంపాదించారు. రామా యణ, మహాభారత ఇతిహాసాలను, భాగవత పురాణాన్ని వ్యవహారిక భాషలో అందించారు. జిల్లాలో అక్షరాస్యతా ఉద్యమంలో భాగంగా ప్రభుత్వం నిర్వహించిన అక్షర తపస్మాన్ కార్యక్రమానికి ఛైర్మన్‌గా వ్యవహరించారు. పలు సినిమాల్లో పాటలు రాసినా వంశీ దర్శకత్వంలో వచ్చిన 'మహర్షి' సినిమాలో ఆయన రచించిన 'సుమం.. ప్రతి సుమం సుమం' పాట ప్రాచుర్యం పొందింది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణమూర్తి బెంగుళూరులో చికిత్స పొందుతూ గురువారం ఉదయం కన్నుమూశారు. శుక్రవారం చౌడేపల్లిలో అంత్యక్రియలు జరగనున్నాయి. నాయిని కృష్ణమూర్తి భార్యపేరు నాయిని పద్మకుమారి. పెద్ద కుమారుడు డాక్టర్ గురుశ్రీధర్. ఆయన ఎస్‌వి మెడికల్ కళాశాలలో రేడియాలజీ విభాగంలో అసిస్టెంటు ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. రెండో కుమారుడు నందకిశోర్, కోడలు శిల్ప వీరిద్దరూ శాస్త్రవేత్తలు. వీరు లండన్‌లో ఉంటున్నారు.

ప్రముఖుల నివాళి

నాయుని క్రిష్ణమూర్తి మృతదేహానికి ప్రముఖులు,గ్రామస్తులు నివాళులర్పించారు. ఆయన మృతి సాహితీ లోకానికి తీరని లోటని కలెక్టర్ ప్రద్యుమ్న ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రజాశక్తి' తిరుపతి ఎడిషన్ మేనేజర్ చంద్రశేఖర్, ఎడివిటి ఎడిషన్ ఇన్‌ఛార్జీ ప్రకాష్, గుణశేఖర్ నివాళి అర్పించారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంటామోహన్, మురళి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

దాడులు చేస్తూ దళిత తేజమా?

- 4న చలో గుంటూరు
- కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దళితులపై అధికార పార్టీ నాయకుల దాడులు పెరిగిపోతున్నాయని కెవిపిఎస్ ఆందోళన వ్యక్తం చేసింది. ఒక పక్క దాడులు చేస్తూ మరోపక్క దళిత తేజమంటున్నారని, ఇది ఎవరి కోసమని సంఘం రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీలో తెలుగు మహిళలకు జరుగుతున్న అవమానాలు, దాడులు, అణచివేతలు ఖండించాలని పిలుపు నిచ్చారు. దళితులపై అధికార పార్టీ నాయకుల దాడులు పెరిగిపోతున్నా నిందితుల్ని పోలీసులు అరెస్టు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు నిందితులకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. ముఖ్య మంత్రి సైతం దళిత కులంలో పుట్టాలని ఎవరు కోరుకుంటారన్నారని, దళితులు శుభ్రంగా ఉండరంటూ మంత్రి ఆదినారాయణరెడ్డి అహంకారంతో మాట్లాడారని తెలిపారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ నెల్లూరులో దళిత మేయర్‌ను నిలబెట్టి మరీ తన అగ్రకుల అహంకారాన్ని చాటారని విమర్శించారు. దళిత తేజం కార్యక్రమం అంటూ గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారని, ఇదేనా దళిత తేజంకు తెలుగుదేశం భాష్యమని ప్రశ్నించారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను, అవమానాలను కెవిపిఎస్ ఖండిస్తోందని తెలిపారు. ఈ దాడుల్ని నిరసిస్తూ ఈనెల 4న చేపట్టిన చలో గుంటూరు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

హోదానే కావాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యాన రాజకీయ పక్షాల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ బిజెపి చేతిలో టిడిపి పావుగా మారిందన్నారు. అధికారం పదవుల కోసం టిడిపి లాలూచీ పడుతోందని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. హోదాపై పార్లమెంటులో చేసిన నిర్ణయాలు ఏవీ అమలు జరగలేదన్నారు. రెండు పార్టీలూ కలిసి రాష్ట్రాన్ని నాలుగేళ్ల పాటు మోసం చేశాయన్నారు. రాష్ట్రానికి బడ్జెట్లో కేటాయింపులు లేకపోయినా టిడిపి మాట్లాడలేదన్నారు. 16 రాజకీయ పార్టీలు, 45 ప్రజా సంఘాలు ఆందోళనలో పాల్గొంటున్నాయని, అయినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదన్నారు. చంద్రబాబునాయుడు పూటకో మాట మాట్లాడుతూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని చెప్పారు. పోలవరం విషయంలో కేవలం నిర్మాణానికి సంబంధించిన అంశంపైనే చంద్రబాబు ఒప్పందం చేసుకున్నారని, పునరావాసంపై నోరెత్తలేదన్నారు. దీనిపై అన్ని పక్షాలూ కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర సమస్యలపై మూడున్నరేళ్లలో ఒక్కరోజు కూడా నరేంద్రమోడీ మాట్లాడలేదన్నారు. గతంలో ఎన్నడూ వెనుకబడిన ప్రాంతాలపై మాట్లాడని బిజెపి ఇప్పుడు రాయలసీమ డిక్లరేషన్ పేరుతో ప్రజలను మోసం చేస్తోందన్నారు. రాష్ట్రానికి ఏమి చేస్తారో నాయకులు ఈ పార్లమెంటు సమావేశాల్లోనే తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల రామ్‌మాధవ్ చంద్రబాబునాయుడుతో మాట్లాడిన తరువాత ఆయన బాబు మాటల్లో తేడా వచ్చిందని చెప్పారు. ఒక్క హామీ కూడా అమలు చేయని బిజెపి నాయకులు నిజంగా చిత్తశుద్ధి ఉంటే రాజీనామా చేసి గెలిస్తే తాము హోదా గురించి మాట్లాడటం మానేస్తామని సవాల్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ విభజన హామీల్లో ఒక్క అంశాన్ని కూడా బిజెపి నెరవేర్చలేదన్నారు. యూనివర్శిటీల ఏర్పాటుకు చట్టాన్ని సవరించాల్సి ఉన్నా ఇంతవరకు చేయలేదని, పైగా కాలపరిమితి గురించి మాట్లాడుతున్నారని ఆయన పేర్కొన్నారు. పరిశ్రమలు రాలేదని, పోర్టులు, రైల్వేజోన్, విశాఖ, చెన్నై పారిశ్రామిక కారిడార్, అయిల్ రిఫైనరీ, మెట్రో ఒక్కటి కూడా ఏర్పాటు చేయలేదని, ఇంకెప్పుడు ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. షీలాబేడీ నివేదికనూ పక్కనపడేశారన్నారు. ఎంసిపిఐయు నాయకులు వెంకటరెడ్డి మాట్లాడుతూ మాట తప్పడం చంద్రబాబుకే చెల్లుబాటైందన్నారు. జనసేన నాయకులు మారిశెట్టి రాఘవయ్య మాట్లాడుతూ హోదా కోసం జరిగే పోరాటాలకు జనసేన సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. పార్లమెంట్ జరిగే రోజుల్లోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించుకోవాలని పిసిసి అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి సూచించారు. లేకపోతే రాష్ట్రానికి హోదా వచ్చే పరిస్థితి లేదన్నారు. బ్యాంకుల్లో డబ్బులు లేకపోవడానికి కారణం బిజెపి, టిడిపిలేనన్నారు. ఎన్నికల కోసం ఆ పార్టీలు డబ్బుల్ని అక్రమంగా దాచుకుంటోందని విమర్శించారు. 184 నిబంధన కింద మల్లికార్జున ఖర్గే లోక్‌సభలో ఇప్పటికే నోటీసులు ఇచ్చారని, దీనిపై పార్లమెంట్ సమావేశాల్లో చర్చకు వస్తుందన్నారు. గత నెల 8న జరిగిన బంద్ తర్వాత సిఎం చంద్రబాబు నోట రాష్ట్రానికి హోదా కావాలి అనే మాట వచ్చిందంటే అది మన విజయమేనన్నారు. ఈ నెల 6,7 తేదీల్లో ఢిల్లీలో ఆత్మగౌరవ దీక్షలు చేయనున్నట్లు తెలిపారు. 8న పార్లమెంట్‌ను ముట్టడించాలని పిలుపునిచ్చారు. మ్యానిఫెస్టోలో హామీలను విస్మరించినందుకుగాను టిడిపి, బిజెపిలను రద్దు చేయాలని 9న డిమాండ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోడీ, సిఎం చంద్రబాబుకు మధ్య ఉన్న వ్యక్తిగత వైరుధ్యాల వల్లే రాష్ట్రానికి ప్రత్యేకహోదా దక్కడం లేదని వైసిపి నాయకుడు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు వ్యాఖ్యానించారు. హోదాపై చంద్రబాబు ఇప్పటికి నాలుగుసార్లు మాట మార్చారని విమర్శించారు. అన్ని రాష్ట్రాలకు ఇచ్చే విధంగానే మన రాష్ట్రానికి కూడా కేంద్రం నిధులు ఇచ్చి, వాటిని ప్యాకేజీ నిధుల మాదిరిగా చూపించడం సరికాదన్నారు. పార్లమెంటు ప్రారంభం నాడే అవిశ్వాసం పెట్టడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. 6న వైసిపి ఎంపిలు రాజీనామా నోటీసులు ఇస్తారన్నారు. 5న జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిపారు. హోదా కోసం చేసే ఎలాంటి పోరాటానికైనా వైసిపి మద్దతిస్తుందన్నారు. రాష్ట్రంలో బిజెపితో కలిసి పనిచేయడానికి ఏ పార్టీ కూడా సిద్ధంగా లేదని ఉత్తరాంధ్ర చర్చావేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. హోదా సాధించేందుకు పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానం పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్‌డిఎలో భాగస్వామి అయిన వేరే రాష్ట్ర పార్టీ అకాళీదళ్ కూడా మన రాష్ట్రానికి హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తుంటే, మన రాష్ట్ర ఎంపీలు మాత్రం ప్రధానిని చూసి నోరు మెదపకపోవడం బాధాకరమన్నారు. హోదా కోసం అవసరమైతే తాము ఆమరణ దీక్షకైనా సిద్ధమేనని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పట్టిన పెద్ద దరిద్రం గవర్నర్ నరసింహన్ అని సినీనటుడు శివాజి ధ్వజమెత్తారు. అలాంటి వ్యక్తి గవర్నర్‌గా ఉండటం రాష్ట్రానికి ఖర్మగా అభివర్ణించారు. ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని, అవసరమైతే గవర్నర్ తనపై కేసుపెట్టుకోవచ్చని సలహా ఇచ్చారు. హోదా గురించి అసలు పోరాడాల్సిన వ్యక్తులు ఎంపిలని, అయినా వారు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. తమ సమస్యల్ని పరిష్కరించుకోవడం కోసం తమిళనాడుకు చెందిన 180 మంది రైతులు ధర్నా చేసి ఢిల్లీని వణికించారని పేర్కొన్నారు. మన ఎంపీల ఇళ్ల ముందు ధర్నా చేసి పార్లమెంట్ జరగకుండా చేయాలని కోరారు. ప్రజలంతా కలిసి రోడ్లపైకి వచ్చి పోరాడితే తప్ప హోదా వచ్చే పరిస్థితి లేదన్నారు. హోదా సాధన సమితి నాయకులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ బిజెపి నాయకులు రాష్ట్రాన్ని పట్టించుకోవడం లేదని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆప్ నాయకులు పోతిన వెంకటరామారావు మాట్లాడుతూ ఢిల్లీలో జరిగే సభకు ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ వస్తారన్నారు. లోక్‌సత్తా నాయకులు భీశెట్టి బాబ్జి మాట్లాడుతూ అబద్ధాలతోనే పాలన నడుస్తోందన్నారు. ఈ సందర్భంగా యూనివర్శిటీలో ఆందోళనలను విజయవంతం చేసిన విద్యార్థి, యువజన సంఘాల నాయకులకు అభినందనలు తెలిపారు. వక్తలను సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు వేదిక మీదకు ఆహ్వానించారు. ఈ సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, వి.కృష్ణయ్య, డి.రమాదేవి, సిపిఐ నాయకులు రావుల వెంకయ్య, సిపిఐఎంఎల్ నాయకులు సాంబశివరావు, లిబరేషన్ నాయకులు రామ్ దేవ్, మైనార్టీ నాయకులు బషీర్ అహ్మద్, న్యూడెమొక్రసీ నాయకులు రామారావు, ఎపిజెఎఫ్ నాయకులు కృష్ణాంజనేయులు, బిఎపి నాయకులు గౌతంరెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శులు పాశం రామారావు, గద్దె చలమయ్య, కోటయ్య, కాంగ్రెస్ నాయకులు మక్కెన మల్లికార్జునరావు, మస్తాన్‌వలీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులు అప్పిరెడ్డి, వికెసి నాయకులు విద్యాసాగర్, వి.లక్ష్మణరెడ్డి, దళిత నాయకుడు కొరివి వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చినరాజప్ప కుమారుడి వివాహంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



నూతన వధూవరులతో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప కుమారుని వివాహ శుభ కారక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం హాజరయ్యారు. నూతన వధూవరులు రంగనాథ్, సుజనలను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ జెఎన్‌టియు కాకినాడ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఈ వివాహ వేడుకకు సిఎం గురువారం రాత్రి 8 గంటలకు హాజరయ్యారు. వివాహ వేదిక వద్ద సుమారు అరగంట పాటు ఉన్నారు. వధూవరులు, బంధువులు, ప్రముఖులతో ఫొటోలు తీసుకున్న తర్వాత వెనుదిరిగారు. దంపతులను ఆశీర్వదించిన ప్రముఖులలో ఉప ముఖ్యమంత్రి కెఇ.కృష్ణమూర్తి, ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, నారా లోకేష్, కాల్వ శ్రీనివాసులు, కె.అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు, కెఎస్.జవహర్, కిమిడి కళా వెంకట్రావు, శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, శాసనసభ డిప్యూటీ స్పీకర్ బుద్ధ ప్రసాద్, పార్లమెంట్ సభ్యులు సిఎం రమేష్, తోట నరసింహం, పండుల రవీంద్రబాబు, ఎస్‌సి ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ కారెం శివాజి, రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ జెఆర్ పుష్పరాజ్, జిల్లా పరిషత్ ఛైర్మన్ జ్యోతుల నవీన్‌కుమార్, కాకినాడ మేయర్ సుంకర పావని, శాసనమండలి సభ్యులు ఆదిరెడ్డి అప్పారావు, చిక్కాల రామచంద్రరావు, టి రత్నాబాయి, లక్ష్మీ శివకుమారి, ఎంఎల్‌ఎలు వనమాడి కొండబాబు, పి నారాయణమూర్తి, దాట్ల సుబ్బరాజు, గొల్లపల్లి సూర్యారావు, తోట త్రిమూర్తులు, కలెక్టర్ కార్తికేయ మిశ్రా, జాయింట్ కలెక్టర్ మల్లికార్జున, ఎస్‌పి విశాల్ గున్నీ తదితరులు ఉన్నారు.

'గిరిజన కళ్యాణం'పై ఉదాసీనత

నిధుల విడుదలలో ఆర్థిక శాఖ అశ్రద్ధ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గిరిజనుల కోసం ఉద్దేశించిన గిరిజన కళ్యాణ పథకంపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. ఈ పథకం కింద లబ్ధిదారులకు చెల్లించాల్సిన నిధుల్ని మంజూరు చేయడం లేదు. ప్రతి మూడు నెలలకోసారి ఆర్థిక సహాయాన్ని అందించాల్సి ఉంది. దరఖాస్తులు చేసుకొని సుమారు ఏడాది గడుస్తున్నా ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందలేదు. దీంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ. 9 కోట్లు చెల్లించాల్సి ఉన్నా అంటీముట్టనట్టుగానే వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో చొరవ చూపాల్సిన ఆర్థిక శాఖ అశ్రద్ధ వహిస్తోందన్న విమర్శలొస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా 5,350 మంది దరఖాస్తులు చేసుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా నుంచి గరిష్టంగా 1525 మంది దరఖాస్తులు చేసుకోగా, చిత్తూరు నుంచి కనిష్టంగా 164 మంది దరఖాస్తులు చేసుకున్నారు. శ్రీకాకుళం నుంచి 501 మంది, విశాఖపట్నం నుంచి 458 మంది, పశ్చిమ గోదావరి నుంచి 538, నెల్లూరు నుంచి 341, అనంతపురం జిల్లా నుంచి 450 మంది దరఖాస్తులు చేసుకున్నారు. మొత్తం 5,350 మంది దరఖాస్తుల్ని పరిశీలించిన అనంతరం 4,646 మంది అర్హులుగా గుర్తించినట్టు అధికారులు పేర్కొంటున్నారు. అయితే వీరిలో 694 మంది దరఖాస్తుల్ని ఇంకా పరిశీలించాల్సి ఉంది. మొత్తం 4,646 మందిలో 3,679 మందికి మాత్రమే ఇప్పటి వరకు నిధులు మంజూరు చేశారు. ఇంకా 967 మందికి నిధులు మంజూరు చేయనేలేదు. సుమారు 1,816 మంది లబ్ధిదారులకు అవసరమైన నిధుల్ని మంజూరు చేయాల్సి ఉంది. వీరిలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంతో పాటు గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన వారే ఎక్కువుగా ఉన్నారు. వీరికి దాదాపు రూ. 9 కోట్లు కావాల్సి ఉంది. అయితే లబ్ధిదారులకు చెల్లించాల్సిన మొత్తం రూ. 9 కోట్లల్లో గిరిజన సంక్షేమ శాఖలో రూ. 2.53 కోట్లు ఉన్నాయని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. మిగిలిన 6.55 కోట్లను ప్రభుత్వం మంజూరు చేయాల్సి ఉంది. గిరిజన ఉప ప్రణాళిక నుంచి ఈ నిధుల్ని కేటాయించాల్సి ఉంది. ఈ మేరకు ఇది వరకే ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపామని, ఆర్థిక శాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ విషయంలో ఆర్థిక శాఖ చొరవ చూపడం లేదని వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే గిరిజన సంక్షేమ శాఖలో ఉన్న నిధుల్ని కూడా లబ్ధిదారులకు అందజేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సహాయం కోసం నెలల తరబడి తిరుగుతున్నా నిరాశే ఎదురవుతోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు కృష్ణాబోర్డు వర్కింగ్ గ్రూప్ సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

రెండు రాష్ట్రాలూ వినియోగించుకోవాల్సి ఉంది. అయితే తమకు మరో 40 టీఎంసీల నీరు కావాలని కృష్ణా బోర్డును ఏపీ కోరింది. గతంలో కేటాయించిన నీటి వాటాతో కలిపి భవిష్యత్ అవసరాలకు 30 టీఎంసీల నీరు కావాలని తెలంగాణ అధికారులు కోరుతున్నారు. కృష్ణా ప్రాజెక్టుల్లో టెలీమెట్రీల ఏర్పాటు, బోర్డు కార్యాలయం అమరావతికి తరలింపు వంటి అంశాలు కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చే అవకాశముందని అధికార వర్గాల ద్వారా తెలిసింది.

కేంద్ర,రాష్ట్రాలు కలిసి ముంచాయి

(మొదటి పేజీ తరువాయి)

పొందుపర్చినట్లు సమాచారం. మెట్రో, పెట్రోకెమికల్ ప్రాజెక్టు, కడప స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ వంటి కార్యక్రమాలు ఆచరణ సాధ్యం కావని కేంద్రం తప్పుకునే ప్రయత్నం చేసినట్లు కమిటీ నిర్ధారించినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో కేంద్రం అభ్యంతరం చెప్పిన వాటి విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి కూడా స్పష్టత లేదని కమిటీ తన నివేదికలో చేర్చినట్లు తెలుస్తోంది. కమిటీ ఇచ్చిన నివేదికపై శుక్రవారం మరోసారి చర్చించి వివరాల్ని శనివారం వెల్లడించాలని నిర్ణయించారు.

పోటీకి ఎవరొచ్చినా ప్రోత్సహిస్తాం


దామోదర్ ప్రసాద్, సి.కళ్యాణ్, డి. సురేష్‌బాబు, జెమిని కిరణ్ తదితరులు

సర్వీస్‌ప్రొవైడర్లు ఇండస్ట్రీలో కొత్తవారు వస్తుంటే తాము అడ్డుకుంటున్నామని వస్తున్న వార్తలు సత్యదూరమని జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్, ప్రముఖ నిర్మాత డి.సురేష్‌బాబు అన్నారు. ఈనెల 2నుంచి సర్వీస్‌ప్రొవైడర్లకు సహకరించబోమని గత కొద్దిరోజులుగా చెబుతున్న విషయాన్ని గురువారంనాడు ఆయన హైదరాబాద్‌లో విలేకరులముందు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ... థియేటర్లలో ఈనెల 2నుంచి సినిమాలను ఆపేయాలని మాకు ఎలాంటి దురుద్దేశం లేదు. సినిమా అనేది ఆపకుండా ఉండాలనేదే మా తపన. రేపు ఎవరైనా మాకు వెయ్యి ప్రొజెక్టర్లు, వెయ్యి సర్వర్లు ఇస్తే వెంటనే పెట్టేస్తాం. మాది సమ్మె కాదు. మంచి పరిస్థితుల్లో పనిచేయాలని అనుకుంటున్నాం. అందరికీ న్యాయం జరుగుతుంది. బంద్ చేయటం వల్ల కోల్పోయే నష్టం కన్నా, భవిష్యత్‌లో వచ్చే లాభమే ఎక్కువ. ప్రస్తుతం తెలుగు సినిమా వరకూ బంద్ ఉంటుంది. హిందీ, ఇంగ్లిష్ సినిమాల వాళ్లతో మాట్లాడతాం' అని పేర్కొన్నారు. సర్వీస్ ప్రొవైడర్లు సాంకేతికతతో కొత్త వ్యాపారం మొదలు పెట్టారు. లాభాలు రావాలనే ప్రయత్నిస్తారు. మనం కూడా సినిమా తీస్తున్నాం. లాభం రావాలనే చూస్తాం. అది రెండు వైపులా ఉంటుంది. ఇంగ్లిష్ సినిమాకు లేని వీపీఎఫ్ తెలుగు సినిమాకు ఎందుకని మేము ప్రశ్నిస్తున్నాం. చిన్న సినిమాకు పెద్ద లాభం వచ్చేలా కూడా మాట్లాడుతున్నాం అని తెలిపారు.

చూసీ చూడకుండా సంతకాలు చేశారు

అగ్రిమెంట్లు గురించి ప్రస్తావిస్తూ.... “అగ్రిమెంట్ చేసుకున్నారుగా అనొచ్చు. అప్పుడేం జరిగిందంటే.. కొందరు ఎగ్జిబిటర్లు చూసీ చూడకుండా సంతకాలు చేసేశారు. ప్రోగ్రామింగ్ చేయడం వేరు.. పరికరాలు అమర్చడం వేరు. చాలామంది ప్రొడ్యూసర్‌గా, డిస్ట్రిబ్యూటర్‌గా, ఎగ్జిబిటర్‌గా, స్టూడియో యజమానులుగా ఇలా పలు పాత్రలు పోషిస్తున్నారు. కేవలం నిర్మాతగా ఉండేవాళ్లు చాలా తక్కువ. డిస్ట్రిబ్యూటర్, ప్రొడ్యూసర్‌కు ఇలా ఎవరికి వారికి థియేటర్లు ఉన్నాయి. మనం న్యాయంగా ఉండాలి. ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ కేవలం ప్రాసెసింగ్ ఫీజు మాత్రమే చెల్లిస్తారు. ఎగ్జిబిటర్స్ కూడా మా వాళ్లే.. వేరే పార్టీలా వచ్చి వేరే రేట్లు తీసుకుంటున్నారు. దాన్ని తీసేయమని కోరుతున్నాం. మేమంతా చిత్ర పరిశ్రమలో భాగంగానే మాట్లాడతాం. చివరకు సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. గెలుపోటములనే సమస్య ఇక్కడ లేదు. అందరం కలిసి ఇండస్ట్రీని ముందుకు తీసుకెళ్లాలనేది మా కోరిక అని వెల్లడించారు.

ఇంకా ఆయన మాట్లాడుతూ.... “కేవలం వీపీఎఫ్ ధరలు ఎక్కువగా ఉండటమే కాదు. చాలా ఇబ్బందులు ఉన్నాయి. కొన్నిసార్లు సినిమా థియేటర్లలో 20 నిమిషాల పాటు ప్రకటనలు వేస్తున్నారు. దీనివల్ల ప్రేక్షకుడు తీవ్ర అసహనానికి గురవుతున్నాడు. సినిమాకు రావడమే ఇబ్బంది అనుకునే పరిస్థితుల్లో జనాలు అడ్వర్టైజ్‌మెంట్‌లను ఇష్టపడటం లేదు. ఇక జనాలకు ఇష్టమైన సినిమా ట్రైలర్‌లను వేయడానికి ఎక్కువ వసూలు చేస్తున్నారు.

ఇలా పలు అంశాల విషయమై చర్చలు మొదలు పెట్టాం. ట్రైలర్లకు తక్కువ తీసుకునేందుకు వాళ్లు ఒప్పుకున్నారు. రేట్లు తగ్గించే విషయంతో సహా, పలు అంశాల విషయంలో ఇంకా చర్చలు కొనసాగుతున్నాయి అని పేర్కొన్నారు.

తదుపరి జరిగే చర్చలను బట్టి ముందుకు వెళ్తాం

“డిజిటల్ సర్వీసు ప్రొవైడర్లు ఏర్పాటు చేసిన కొన్నాళ్ల తర్వాత వర్చువల్ ప్రింట్ ఫీజు(వీపీఎఫ్)ను తీసేయాలి. అమెరికాలో అలాగే చేశారు. కానీ, ఇక్కడ ఇప్పటికీ వసూలు చేస్తున్నారు. అయితే దానిని ఎప్పుడు సున్నాకు తీసుకువస్తారని అడుగుతున్నాం. దానికీ వారి వద్ద నుంచి సమాధానం లేదు. ఇప్పటికైతే కొంత తగ్గించారు. ఇంకా తగ్గాల్సి ఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో వీపీఎఫ్ రేటు అంతా ఒకటే ఉంది. ఉత్తరాదిలో కొన్ని చోట్ల ఎక్కువ ఉంది. మరికొన్ని చోట్ల తక్కువగా ఉంది. అలాగే ఇంతకు ముందు మమూలు సౌండ్ టెక్నాలజీ ఉండేది. ఆ తర్వాత డీటీఎస్ వచ్చింది. దాన్ని ఎగ్జిబిటరే పెట్టుకున్నాడు.

ఇప్పుడు 'అట్మాస్' అని వస్తోంది. అది కూడా ఎగ్జిబిటరే పెట్టుకున్నాడు. దానికి ప్రత్యేక ఛార్జీ వసూలు చేయలేదు. ప్రొజెక్షన్ సిస్టమ్ మాత్రం వేరెవరో కొత్త వాళ్లు వచ్చి, అది పెట్టేసి వాళ్లు డబ్బులు వసూలు చేయడం మొదలు పెట్టారు. ఒక థియేటర్లో సౌండ్, సినిమా ప్రొజెక్షన్, సీట్లు అన్ని థియేటర్ ఇవ్వాలి. అయితే ఇక్కడ ప్రొజెక్షన్‌ను విభజించి దానికి ప్రత్యేక ఛార్జీ వసూలు చేస్తున్నారు. యూఎఫ్‌వో, క్యూబ్ ప్రతినిధులే కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రసాద్‌గారిది పీఎక్స్‌డీ అని ఉంది. ఇండస్ట్రీ ఏమంటే తాను దానికి కట్టుబడి ఉంటానని మాకు మాట ఇచ్చారు. ఇవి కాకుండా రాక్స్, అల్ట్రా, ప్రొవిజ్ చిన్న చిన్నవాళ్లు కూడా ఉన్నారు. అయితే, యూఎఫ్‌వో, క్యూబ్‌లకు 90శాతం వాటా ఉండటంతో వీళ్లతోనే ప్రధానంగా చర్చించాల్సి వస్తోంది. వారి నుంచి సరైన సమాధం రాకపోవడంతో బంద్‌కు పిలుపు ఇచ్చాం. ఒకవేళ తదుపరి చర్చలకు పిలిస్తే దాన్ని బట్టి మరింత ముందుకు వెళతామని.. అన్నారు.



రామ్‌చరణ్

ప్రభుదేవా 'గులేబకావళి'



ప్రభుదేవా, హన్సిక

ప్రభుదేవా హీరోగా, హన్సిక హీరోయిన్‌గా, ప్రముఖ నటి రేవతి ఓ పవర్‌ఫుల్ పాత్రలో నటించిన తమిళ చిత్రం 'గులేబకావళి'. కల్యాణ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం కోలీవుడ్‌లో సంక్రాంతికి విడుదలై విజయాన్ని నమోదు చేసుకుంది. కాగా ఇప్పుడు ఈ చిత్రాన్ని అదే పేరుతో సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై మల్కాపురం శివకుమార్ తెలుగులోకి అనువదిస్తున్నారు. ఈనెల 16న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం విశేషాలను ఆయన తెలియజేస్తూ తమిళంలో ఘనవిజయం సాధించిన ఈ చిత్రం తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుందనే విశ్వాసంతో తెలుగులోకి అనువదిస్తున్నాను. 'గులేబకావళి' అనే గ్రామంలో నిక్షిప్తమైన నిధి కోసం జరిగే అన్వేషణ నేపథ్యంలో ఈ కథ కొనసాగుతుంది. పూర్తి వినోదాత్మకంగా రూపొందిన ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం ఆసక్తికరంగా వుంటుంది. ఇండియాన్ మైఖేల్ జాక్సన్ ప్రభుదేవా నత్యాలు, నటన ప్రధాన హైలైట్‌గా వుంటుంది. ఈనెల 16న చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.



'శంభో శంకర'లో శంకర్

కీలక సన్నివేశాల్లో 'నా పేరు సూర్య'


అల్లు అర్జున్

అల్లు అర్జున్, అను ఇమ్మాన్యుయేల్ జంటగా వక్కంతం వంశీ దర్శకుడిగా పరిచయం అవుతూ తెరకెక్కుతున్న చిత్రం 'నా పేరు సూర్య – నా ఇల్లు ఇండియా'. కె. నాగబాబు సమర్పణలో, రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ బ్యానర్లో శిరీష శ్రీధర్ నిర్మాతగా, బన్నీ వాసు సహ నిర్మాతగా ఈ చిత్రం నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో యాక్షన్ కింగ్ అర్జున్, శరత్ కుమార్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. నేటి నుంచి హైదరాబాద్‌లో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. రామోజీ ఫిల్మ్ సిటీతోపాటు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఈ సన్నివేశాలు షూట్ చేస్తున్నారు. ఈ షెడ్యూల్‌లో అల్లు అర్జున్‌తో సినిమా ముఖ్య తారాగణం పాల్గొంటున్నారు. 14వ తేదీ వరకు ఈ ఇంపార్టెంట్ షెడ్యూల్ జరుగుతుంది. హోళి సందర్భంగా పోస్టర్ ఇంపాక్ట్ రిలీజ్ చేశారు. ఈ చిత్రాన్ని నిర్మాణాంతర కార్యక్రమాలు పూర్తిచేసి... ప్రపంచవ్యాప్తంగా మే 4న విడుదల చేస్తున్నట్టు నిర్మాతలు ప్రకటించారు. బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్ – శేఖర్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతం అందిస్తున్నారు.

నిర్మాతలు మాట్లాడుతూ.... గ్రాండియర్‌గా చిత్రాన్ని నిర్మిస్తున్నాం. ప్రస్తుతం హైదరాబాద్‌లో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నాం. రామోజీ ఫిల్మ్ సిటీతో పాటు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని అద్భుతమైన లోకేషన్స్‌లో షూటింగ్ చేస్తున్నాం. ఈ షెడ్యూల్‌లో అల్లు అర్జున్‌తో పాటు ముఖ్య తారాగణం అంతా పాల్గొంటున్నారు. ఈ నెల 14 వ తేదీ వరకు ఈ ఇంపార్టెంట్ షెడ్యూల్ జరుగుతుంది. హోళి సందర్భంగా పోస్టర్ ఇంపాక్ట్ ను రిలీజ్ చేశాం. మరో వైపు విశాల్ శేఖర్ అద్భుతమైన సంగీతం అందించారని అన్నారు.

తల్లీ కూతుళ్ల భావోద్వేగాలే 'కణం'


'ఛలో'తో సూపర్‌హిట్ కొట్టిన నాగశౌర్య, 'ఫిదా', 'ఎంసిఎ' వంటి సూపర్‌హిట్స్ ఇచ్చిన సాయిపల్లవి కలిసి ఎన్.వి.ఆర్. సినిమా సమర్పణలో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై విజయ్ దర్శకత్వంలో నిర్మిస్తున్న 'కణం' చిత్రంలో జంటగా నటిస్తున్నారు. షూటింగ్ పూర్తయిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్ ఈనెల 5న హైదరాబాద్‌లో జరగనుంది. అప్పుడే విడుదల తేదీని ప్రకటిస్తామని ఎన్‌విఆర్ సినిమా అధినేత చెప్పారు.

సాయిపల్లవి మాట్లాడుతూ... “ఫిదా', 'ఎంసిఎ' చిత్రాల్ని అపూర్వంగా ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. 'కణం' చిత్రం తల్లి, కూతురికి మధ్య ఉండే భావోద్వేగాల ఆధారంగా ఉంటుంది. నేను ఏదైనా సినిమా చేస్తున్నప్పుడు అందులో నా పాత్రకి ఎలా న్యాయం చేయగలను అనేది చూసుకుంటాను. విజయ్‌గారు ఈ కథ చెప్పి, ఇందులో నేను తల్లి పాత్ర చేయాలి అని అడిగినప్పుడు ఈ పాత్రలోని ఎమోషన్స్‌ని పండించగలనా అనుకున్నాను. ఎందుకంటే ఇలాంటి పాత్ర ఇది వరకు నేను చేయలేదు. విజయ్, నేను సినిమా గురించి చాలా చర్చించుకున్నాం. చిత్రంలో నా కూతురిగా కనిపించే వెరోనికాతో చాలా సమయం గడిపాను. తాను నేను నిజంగానే తల్లి, కూతుర్లలాగ కలిసిపోయాం. అందువల్ల సినిమాలో కనిపించే ఎమోషన్స్ అన్ని చాలా సహజంగా ఉంటాయి. దర్శకుడు విజయ్ ఎంతో సహకారం అందించారు. తనకి ఏమి కావాలో స్పష్టంగా తెలిసిన దర్శకుడు ఉన్నప్పుడు మన పని సులువు అయిపోతుంది. విజయ్‌కి ఏ సీన్‌కి ఎలాంటి ఎమోషన్ ఉంటే బావుంటుందో బాగా తెలుసు. తల్లి, కూతురి మధ్య సన్నివేశాలు కొంచెం లౌడ్‌గా ఉంటే బాగా పండుతాయి అని అనుకునేదాన్ని. కానీ విజయ్ సహజంగా ఉండాలనేవారు. ఈ విషయంలో విజయ్‌తో 'నన్ను మీరు యాక్ట్ చేయనివ్వట్లేదు' అని కూడా అనేదాన్ని (నవ్వుతూ). కానీ డబ్బింగ్ సమయంలో సినిమా చూస్తున్నప్పుడు అర్థమైంది ఆయన ఎందుకలా అనేవారో. నటిగా ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకమైంది. పాత్రని ఎంతో ఇష్టపడి చేసాను.” అన్నారు.

ఈ చిత్రానికి నిరవ్‌షా, శ్యామ్ సి.ఎస్., ఎల్.జయశ్రీ, స్టంట్ సిల్వ, ఆంటోని, విజయ్, సత్య, పట్టణం రషీద్, ఎం.ఆర్.రాజకృష్ణన్, కె.మణివర్మ, రామసుబ్బు, సప్న షా, వినయదేవ్, మోడేపల్లి రమణ, కె.భార్గవి, ప్రత్యూష, ఎస్.ఎం.రాజ్‌కుమార్, ఎస్.శివశరవణన్, షియామ్ పనిచేస్తున్న సాంకేతికవర్గం. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్.ప్రేమ్, సమర్పణ: ఎన్.వి.ఆర్. సినిమా, నిర్మాణం: లైకా ప్రొడక్షన్స్, దర్శకత్వం: విజయ్.



సాయిపల్లవి నాగశౌర్య

వర్మ శిష్యుడి 'ఆర్ ఎక్స్ 100'




కార్తికేయ, పాయల్ రాజపుట్ ఇందులో హీరోహీరోయిన్లు. కార్తికేయ క్రియేషన్ వర్క్స్ బ్యానర్ పై అశోక్ రెడ్డి గుమ్మకొండ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వర్మ శిష్యుడు అజయ్ భూపతి దర్శకుడు. ఈ చిత్రం ప్రీలుక్‌ను ఇటీవలే విడుదల చేశారు. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. రావురమేష్, సింధూర పువ్వు రాంకీ ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు. హైలీ ఎమోషనల్ రియలిస్టిక్ లవ్ స్టోరీగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ప్రముఖ సాంకేతిక బందం పని చేస్తోంది . నేషనల్ అవార్డు విన్నర్ ప్రవీణ్. కే.ఎల్ ('కబాలి' ఫేమ్) ఈ చిత్రానికి ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. తెలుగులో ఆయనకు యిదే తొలి చిత్రం కావడం విశేషం . వేసవిలో సినిమాను విడుదల చేస్తామని గురువారంనాడు దర్శకనిర్మాతలు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం:: చైతన్ భరద్వాజ్ ,లిరిక్స్: శ్రీమణి , చైతన్య ప్రసాద్,సిరాశ్రీ.

'దండుపాళ్యం 4'తో మాకు సంబంధంలేదు


రవి కాలే

దండుపాళ్యం పేరు వినగానే మనకి వొళ్ళు వణుకు పుట్టించే సినిమా గుర్తుకువస్తుంది. దండుపాళ్యం సినిమా సూపర్ హిట్ అయింది. శ్రీనివాస్ రాజు దర్శకత్వం వహించారు. కన్నడ నటి పూజా గాంధీ, మకరంద్ దేష్పాండే, రవి కాలే, రవి శంకర్, సంజన ముఖ్యపాత్రలు పోషించారు. ఈ చిత్రం విజయవంతం కావటంతో దర్శకుడు శ్రీనివాస్ రాజు 'దండుపాళ్యం 2', 3 చిత్రాలు నిర్మించారు. రెండో చిత్రం కూడా విజయవంతం అయింది. 'దండుపాళ్యం 3' విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ మూడు చిత్రాలలో పూజ గాంధీ, మకరంద్ దేష్పాండే, రవి కాలే, రవి శంకర్, సంజన నటించారు కాగా, ఇప్పుడు వెంకట్ అనే నిర్మాత 'దండుపాళ్యం 4' చిత్రాన్ని నిర్మిస్తున్నానని ప్రకటించాడు. ప్రచార చిత్రాన్ని కుడా విడుదల చేసారు. అయితే ఈ ప్రచార చిత్రాలో 1,2,3 చిత్రాల్లో నటించిన పూజ గాంధీ, మకరంద్ దేష్పాండే, రవి కాలే, రవి శంకర్ ముఖ చిత్రాలను విడుదల చేశారు. కానీ వారంతా 'దండుపాళ్యం 4' చేయటం లేదని వీడియోను గురువారంనాడు విడుదలచేశారు.


పూజా గాంధీ


మకరంద్ దేష్పాండే

పూజా గాంధీ మాట్లాడుతూ “నేను దండుపాళ్యం 4 సినిమా చేయటం లేదు. నన్ను ఎవరూ సంప్రదించలేదు.

నిన్న దండుపాళ్యం 4 చిత్రం ప్రెస్ మీట్‌లో నా అనుమతి లేకుండా నా ఫొటోస్ వాడారు. నా ప్రమేయం లేకుండా నా ఫొటోస్ ఎలా వాడతారని ప్రశ్నించారు. అలాగే మకరంద్ దేష్పాండే, రవి కాలే కూడా ఈ సినిమా చేయటం లేదని వీడియో రిలీజ్ చేశారు. కాగా, దీనిపై నిర్మాత వెంకట్‌ను సంప్రదించగానే తను అందుబాటులో లేకపోవడం విశేషం.



వేసవిలో పశుగ్రాసం

వేసవి వస్తుందంటేనే పశుగ్రాసం లోటు అధికంగా కనిపిస్తుంది. అందుకే పశు గ్రాసాన్ని పండించుకోవడం ఎంత ముఖ్యమో.. మిగిలిపోయిన పశుగ్రాసాన్ని నిల్వ చేసుకోవడమూ అంతే ఉపయోగకరం. అనువైన కాలంలో ఎక్కువగా లభించే పశుగ్రాసాన్ని వివిధ పద్ధతులలో నిల్వ చేయవచ్చు. దాన్ని పశుగ్రాస కొరత ఉండే ఎండాకాలంలో పశువులకు మేతగా ఉపయోగించుకోవచ్చు. పశుగ్రాసాన్ని నిల్వ చేసుకునే పద్ధతులూ, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పశువైద్యాధికారులు ఇస్తున్న సూచనలు చూద్దాం.

పశుగ్రాసాన్ని నిల్వచేసే పద్ధతుల్లో 'హే' తయారీ, 'సైలేజ' తయారీ అని రెండు రకాలుంటాయి.

'హే' పద్ధతి

ఈ పద్ధతికి సన్నని మృదువైన కాండం కలిగిన పశుగ్రాసాలు అనుకూలం. ధాన్యపుజాతి గడ్డినీ, గడ్డిజాతి పంటలనూ, లేదా పప్పుజాతి పంటలనూ, పూతదశ కంటే ముందు దశలో కోసి, వాటిని ఎండబెట్టి, కొరత కాలంలో వాడుకోవడం ఈ పద్ధతిలో కనిపిస్తుంది. 'హే' గడ్డి లేత ఆకుపచ్చ రంగులో ఉన్న ఆకులు, కొమ్మలతో తడి లేకుండా ఉంటుంది. ఎక్కువగా ఉన్న పశుగ్రాసాన్ని నిల్వచేసే పద్ధతుల్లో ఇది చాలా తేలికైనది. ఈ పద్ధతిలో గ్రాసంలోని నీటి శాతం బాగా తగ్గేవరకూ ఎండనివ్వాలి. పూయకుండా, బూజు పట్టకుండా ఉండేలా తేమ శాతాన్ని తగ్గించాలి. పప్పుజాతి గ్రాసాలతో కలిపి లేదా కలపకుండా 'హే'ను తయారుచేసుకోవడంలో రెండు పద్ధతులున్నాయి.

సాధారణ పద్ధతి : పొలంలోనే పనలుగా వేసిన గడ్డిని బాగా ఎండబెట్టాలి. 'హే' తయారుచేయడానికి పంటను మంచు బిందువులన్నీ ఆవిరి అయిన తర్వాత మాత్రమే కోయాలి. కోసిన గడ్డిని పొలం లోనే ఆరనివ్వాలి. ప్రతి 4–5 గంటలకు ఒకసారి బోద పనలను తిప్పుతుండాలి. తేమ 40 శాతం వరకూ వచ్చిన తర్వాత తేలికగా ఉండే కుప్పలుగా వేయాలి. తర్వాత రోజు మళ్ళీ తేమ 25 శాతం వచ్చే వరకూ వాడనివ్వాలి. ఇలా ఎండిన గడ్డిని సుమారు 20 శాతం తేమ ఉండేలా చూసుకొని, నిలువ చేసుకోవాలి. వర్షాకాలంలో షెడ్స్‌లో ఈ గడ్డిని వాడబెట్టి 'హే'గా తయారుచేయాలి.

యాంత్రిక పద్ధతి : ఈ ప్రక్రియలో ఇనుప కంచెలను ఉపయోగించి, తయారు చేసిన ఫ్రేములలో గడ్డిని ఎండబెడతారు. బర్సీము, లూసర్న్ గడ్డిని ఈ విధంగా ఎండబెట్టవచ్చు. ఇలా ఎండబెట్టడం వల్ల 2–3 శాతం మాంసకృత్తులు మాత్రమే నష్టం అవుతాయి. ఆలస్యంగా కోతలు కోయడం వల్ల పోషకాలు తగ్గుతాయి. పప్పుజాతి మొక్కలలో కోతదశలో, ఆకులు, కాయలు ఎండి రాలిపోతాయి. వాడనివ్వడం వల్ల కెరోటిన్, క్లోరోఫిల్ పరిమాణం తగ్గిపోతుంది.

'సైలేజ' (మాగుడు గడ్డి)

సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో అధిక దిగుబడినిచ్చే పచ్చిమేతను ముక్కలుగా చేసి, గాలి లేకుండా పులియబెట్టి, నీరు కూడా లేకుండా ఉండే స్థితిలో నిల్వ చేయడాన్ని 'సైలేజ' అంటారు. ఆక్సిజన్ కూడా లేని పరిస్థితిలో నిలువ చేయడం వల్ల పశుగ్రాసంలోని నీటిలో కరిగే పిండిపదార్థాలన్నీ, ఆర్గానిక్ ఆమ్లాలుగా మారి, గ్రాసపు ఆమ్ల పరిమాణాన్ని పెంచుతాయి. ఈ పరిస్థితుల్లో బ్యాక్టీరియా, శిలీంధ్రాలు పెరగలేవు. దీనివల్ల పోషకాహార నష్టం జరగకుండా నాణ్యత పెరుగుతుంది. పశువులు దీన్ని చాలా ఇష్టంగా తింటాయి. బాగా అరిగించుకుంటాయి కూడా. 'సైలేజ్' నాణ్యత గడ్డిలోని ఎండుపదార్థం, కరిగే తీపి పదార్థాలపై ఆధారపడి ఉంటుంది. అలాగే ముడి మాంసకృత్తులకు తీపి పదార్థాల నిష్పత్తి చాలా ప్రభావాన్ని చూపిస్తుంది. పంటను 50 శాతం పూతదశలో కోసినపుడు, లేదా పాలదశలో కోసినపుడు తయారుచేసే 'సైలేజ' మంచి నాణ్యత కలిగి ఉంటుంది. మొక్కజొన్న, జొన్న, సజ్జ, మొదలైన పంటలను 50 శాతం పూతదశలో కోసి సైలేజీకి ఉపయోగించాలి. నేపియర్ గడ్డి అయితే 45–50 రోజుల వ్యవధిలో, ఇతర గడ్డినీ పూతదశలో కోసి, సైలేజీకి ఉపయోగించాలి.



సైలేజ తయారీ: నీటి ఊటలేని ఎత్తయిన ప్రదేశంలో పాతర తవ్వి, వాటి అడుగు భాగాన, పక్కలకు సిమెంటు గోడలు కట్టాలి. చాప్‌కట్టర్‌తో సన్నగా నరికిన మేతను పాతరలో నింపి, ట్రాక్టరుతో నడిపి, పాతరలో గాలి లేకుండా చేయాలి. ప్రతి టన్ను గడ్డికి 2–3 కిలోల బెల్లపు మడ్డి, 2 కిలోల రాతి ఉప్పు పొరల మధ్య చల్లాలి. పాతరను భూమికి 2–3 అడుగుల ఎత్తుకు నింపి, దానిపై మందపాటి పాలిథీన్ షీట్ లేదా వరిగడ్డినిగానీ పరచి మట్టి, పేడ మిశ్రమంతో పూత పూసి (అలికి) ఏమాత్రం గాలి, వర్షపు నీరు పాతరలోకి పోకుండా జాగ్రత్తపడాలి. గోతులను నింపే ముందు గోతుల అడుగుభాగం పక్కలకు వరిగడ్డి వేస్తే పాతర గడ్డి వృధా కాకుండా ఉంటుంది. లేనట్లయితే గాలి, నీరు సోకిన పాతరగడ్డి బూజుపట్టి చెడిపోతుంది. ఇలా నిల్వచేసిన గడ్డి త్వరగా రసాయనిక మార్పుకు గురవుతుంది. మంచి గడ్డి లేత పసుపుపచ్చ రంగులో మగ్గిన పండ్ల సువాసనతో తేమను కలిగి ఉంటుంది. చెడిపోయిన మాగుడు గడ్డి ముదురు గోధుమరంగు లేదా నలుపు రంగులో పులుపు వాసనతో ఉంటుంది.

సైలేజీ పిట్: మూడు నెలల్లో ఐదు పాడి పశువులకు 12 టన్నుల సైలేజీ అవసరమవుతుంది. ఒక ఘనపుటడుగు గుంతలో తయారుచేసిన సైలేజీ బరువు 15 కిలోలు ఉంటుంది. 15 టన్నుల సైలేజీ తయారుచేయడానికి 1000 ఘనపుటడుగుల పాతర కావాలి. ఇందుకు 8 అడుగుల వెడల్పు, 5 అడుగుల లోతు, 25 అడుగుల పొడవున్న గుంతను తవ్వుకోవాలి. సైలేజీ తయారీకి పచ్చిమేతలో 60 శాతం మించి నీరు ఉండరాదు. మొక్కజొన్న, జొన్న, సజ్జ పంటలను కంకి, గింజ గట్టి పడుతున్న సమయంలో.. నేపియర్ గడ్డిని ముదరనిచ్చి, సైలేజీ చేయడానికి వాడుకోవాలి.

మాగుడుగడ్డి వాడుక : అలవాటుపడే వరకు పశువులు సైలేజీని తినకపోవచ్చు. పాలు పితికిన తర్వాత లేదా పాలు పిండడానికి నాలుగు గంటల ముందు సైలేజీని పశువులకు మేపాలి. లేకపోతే పాలకు సైలేజీ వాసన వస్తుంది. పాడిపశువు ఒక్కింటికి సుమారుగా 20 కిలోల సైలేజీని ఇతర ఎండుమేతతో కలిపి మేపాలి. పాతర వేసిన గడ్డి రెండు మూడు నెలలకు మాగి, కమ్మటి వాసన కలిగిన సైలేజీగా తయారవుతుంది. దీన్ని అవసరాన్ని బట్టి ఎప్పుడైనా తీయవచ్చు. అవసరం లేకుంటే 2–3 సంవత్సరాల వరకూ చెడిపోకుండా సైలేజీని నిల్వ ఉంచుకోవచ్చు. సైలేజీ గుంత తెరిచిన తరువాత నెలరోజులలోపు వాడుకోవాలి. లేని యెడల ఆరిపోయి చెడిపోతుంది. మొత్తం కప్పునంతా ఒకసారి తీయకుండా ఒక పక్క నుంచి బ్రెడ్ ముక్కల్లాగా తీసి వాడుకోవాలి.



- డాక్టర్.జి.రాంబాబు,
పశువైద్య సహాయ శస్త్రచికిత్సకులు,
కడప.

ఆముదానికి సూక్ష్మనీటి సేద్యం

ఆముదం సాగులో తీసుకోవాల్సిన చర్యల గురించి ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ వర్సిటీ విస్తరణ సంచాలకులు డాక్టర్ కె రాజారెడ్డి వివిధ సూచనలు ఇచ్చారు. వాటి వివరాలు...

రబీ ఆముదములో ఫిబ్రవరి నెల నుంచి పెరిగే ఉష్ణోగ్రతలు దృష్టిలో పెట్టుకొని 8–10 రోజుల వ్యవధిలో నీరు ఇవ్వాలి. బోదెలు, కాలువల ద్వారా నీరు ఇవ్వడం వల్ల నీరు వృథా కాకుండా ఉంటుంది. డ్రిప్పు ద్వారా మూడు రోజులకొకసారి నీటిని ఇవ్వాల్సి ఉంటుంది. సూక్ష్మనీటి సేద్య పద్ధతుల ద్వారా డ్రిప్పు, స్ప్రింకర్ల ద్వారా ఇస్తే 15–20 శాతం నుండి 40 శాతం దిగుబడి పెరుగుతుంది. మొక్కలు పుష్పించే దశ, కాయ ఊరే దశల్లో నీటి ఎద్దడి రాకుండా చూడాలి.

➤ **కొమ్మ, కాయతొలిచే పురుగు :** ఈ పురుగు ఉధృతి పంట పుష్పించే దశ నుంచి మొదలై పంట పూర్తికాలం వరకూ ఉంటుంది. తొలిదశలో పురుగు కొమ్మలపై, కాయలపై ఉన్న పత్రహరితాన్ని గీకి తింటుంది. పుష్పించే దశలో కొమ్మల్లోకి పోవడం వల్ల కొమ్మ ఎండిపోతుంది. తర్వాత దశలో కాయలోకి చొచ్చుకొనిపోయి కాయలను నష్టపరుస్తుంది. దీని నివారణకు పూతదశలో ఒకసారి, 20 రోజులకు మరొకసారి మోనోక్రొటోఫాస్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఇండాక్సాకార్బ్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

➤ **పంటకోత-నిల్వ :** ఆముదం పంట అంతా ఒకేసారి కోతకు రాదు. 3–4 సార్లు కోయాల్సి వస్తుంది. విత్తిన 90–95 రోజులకు మొదటి గెల కోతకు వస్తుంది. గెలలో 80 శాతం వరకూ కాయలు ముదిరి, ఆకుపచ్చ రంగు నుంచి లేత పసుపు రంగుకు మారినపుడు ఆ గెలను కోసుకోవాలి. కాయలను ఎండబెట్టి వేరుశనగ నూర్చి, యంత్రంతోనే జల్లెడ మార్చుకొని వాడుకోవచ్చు. గింజల్లో 9–10 శాతం తేమ ఉండేటట్లు బాగా ఎండబెట్టి, గోనె సంచుల్లో నిల్వ ఉంచుకోవాలి.

➤ **విత్తనోత్పత్తి :** పూత దశలో గెల కింది భాగంలో ఒకటి లేదా రెండు గుత్తుల మగ పుష్పాలు మాత్రమే ఉన్న మొక్కలను ఉంచి, మిగిలినవి తీసివేయాలి. పూత దశ తర్వాత కాయల లక్షణాలు ఆధారంగా భిన్నంగా ఉన్న మొక్కల్ని పీకేయాలి.

➤ ఆడ, మగ మొక్కల ద్వారా వచ్చే గెలలను వేరువేరుగా కోయాలి. ఆడ మొక్కల నుంచి వచ్చే విత్తనాలను హైబ్రీడ్ విత్తనంగా వాడుకోవాలి. మేలైన యాజమాన్యంతో ఎకరానికి 4 నుండి 5 క్వింటాళ్ళ హైబ్రీడ్ విత్తనం తయారుచేయవచ్చు.

మరిన్ని వివరాలకు మీ జిల్లాలోని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ లేదా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్‌ను సంప్రదించండి. రైతులు మరిన్ని సలహాల కోసం ఈ ఉచిత నంబరుకూ కాల్ చేయవచ్చు-1800 425 0430





డా. కె. రాజారెడ్డి,
విస్తరణ సంచాలకులు,
ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం,
లాం, గుంటూరు - 522 034.

జత కట్టించొచ్చు

ఈ వారం విజ్ఞాన వాణి

జీవాల కాపలదారులు మార్చి నెలలో ఆచరించవలసిన పద్ధతుల గురించి పశువైద్యులు అందిస్తున్న సూచనలు. వీటిని పాటించడం వల్ల జీవాలు ఎదుర్కొనే వివిధ సమస్యలను నివారించడంతో పాటు అధిక లాభాలు పొందవచ్చు. ఈ సూచనలను ఆయా ప్రాంతాలకు, పరిస్థితులకు అనుకూలంగా పాటించడం మంచిది.

✧ మార్చి నెలలో పిల్లలు మూడు నెలలు నిండితే తల్లుల నుంచి వేరు చేయాలి.

✧ గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలిచ్చి ఆరునెలలైతే మళ్ళీ టీకాలిప్పించాలి.

✧ గొర్రెలు, మేకల్లో నట్టల్ని పరీక్షించాలి. నట్టల నివారణ కషాయాలు తాగించవచ్చు.

✧ పిడుదులు, గోమార్లు లేకుండా మందులు ఉపయోగించాలి. లేదా గొర్రెల్ని మందు కలిపిన నీళ్ళల్లో తడిపి తీయాలి.

✧ పిల్లల్లో డయేరియా, త్వరగా పెరగక పోవడం, ఇతర వ్యాధి లక్షణాల గురించి పరిశీలించాలి.

✧ అమ్మతల్లి వ్యాధి నిరోధక టీకాల్ని వేయించాలి.

✧ జత కట్టించడం చేయవచ్చు.

✧ ఉన్ని ఇచ్చే గొర్రెల్లో, ఉన్ని కత్తిరించాలి.

✧ ఈ నెల నుండి వేసవి మొదలవుతుంది. బీడు భూముల్లో మేత తగ్గిపోవచ్చు. అప్పుడు షెడ్డులో అదనంగా ఎండుమేత, సైలేజీ, దాణా ఇవ్వాలి. పచ్చిమేత ఎక్కువగా ఉంటే, ఎండు మేతగా నిలువ చేయాలి.





జోక్ :


సైన్స్ టీచర్ : ఆక్సిజన్ మన ప్రాణవాయువు. ఇది లేకుండా మనం ఒక్క క్షణం జీవించలేం. దీన్ని 1773లో కనుక్కొన్నారు.

విద్యార్థి : నేనెంతో అదృష్టవంతుడిని టీచర్.. కనిపెట్టాక పుట్టాను. లేకుంటే చచ్చిపోయేవాడినేమో!

పొడుపు కథ

రేవుల్లో నిలుస్తాం
సముద్రంపై నడుస్తాం
విదేశీ వాణిజ్యం చేయిస్తాం
సంపద చేకూరుస్తాం?

జవాబు : ఓడలు



నీడ కనిపెట్టండి!

పిల్లలూ..! పక్కనున్న చిత్రంలో కొన్ని కూరగాయలు, వాటి నీడలు ఉన్నాయి. ఏ నీడ దేనిదో కనిపెట్టండి!

పిల్లలమర్రి వృక్షం

పిల్లలూ...! మీరు టీవీలో పిల్లలమర్రి అనే ప్రోగ్రాం చూసే ఉంటారు కదూ! దానిలో ఒక మర్రిచెట్టు ఉంటుంది. కానీ మీరు నిజమైన మర్రిచెట్టును ఎప్పుడైనా చూశారా! తెలంగాణాలోని మహబూబ్‌నగర్‌కు నాలుగు కిలోమీటర్ల దూరంలో పెద్ద మర్రిచెట్టు ఉంది. పరిమాణంలో భారతదేశంలోనే మూడో పెద్దదైన ఈ మహావృక్షం సుమారు 700 సంవత్సరాల నాటిది. ఈ మర్రిచెట్టు నేడు విహార కేంద్రంగా విరాజిల్లుతోంది. ఈ చెట్టును దూరం నుంచి చూస్తే దట్టమైన చెట్లతో నిండి ఉన్న చిన్న కొండలాగా కనిపిస్తుంది. దగ్గరికి వెళ్ళి చూస్తే వెయ్యి మందికి నీడనిచ్చే పెద్ద గొడుగులాగా ఉంటుంది. మొత్తానికి ఐదు ఎకరాల విస్తీర్ణంలో మొదలెక్కడో... కొమ్మెక్కడో తెలియకుండా ఓ మహావృక్షంగా ఏర్పడింది. ఈ మర్రికి పిల్లలు అంకురించడంతో ఇది పిల్లలమర్రిగా పేరొందింది. ఈ మర్రిచెట్టు పక్కనే మ్యూజియం, జింకలపార్కు ఉంది.





పిల్లలమర్రి మ్యూజియాన్ని 1976లో ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన తవ్వకాల్లో లభ్యమైన కమనీయ శిల్పాలను పురావస్తుశాఖ వారు ఇక్కడి మ్యూజియంలో ఉంచారు. వివిధ కాలాల్లో పరిణామం చెందిన శిల్పశైలిని, అప్పటి మానవులు ఉపయోగించిన వస్తు సామగ్రిని ఈ మ్యూజియంలో పొందుపర్చారు. క్రీ.శ 7వ శతాబ్ది నుంచి 15వ శతాబ్ది శిల్ప పరిణతిని చాటే అపురూప శిల్పాలు ఇక్కడ ఉన్నాయి. రెండు వేల సంవత్సరాల కాలంనాటి మధ్యరాతి యుగానికి చెందిన వస్తువులు, చాళుక్యుల కాలం నుంచి విజయనగర కాలం వరకు ఎన్నో ఎన్నెన్నో అపురూప మైన శిల్పాలు ఇక్కడ కొలువుదీరాయి.



మరి, ఇన్ని ప్రత్యేకతలున్న పిల్లలమర్రిని వీలుంటే వేసవి సెలవుల్లో మీరు కూడా సందర్శించండి. ★

నేను గీసిన బొమ్మ





పి. శ్రీకరి సుశీల
6వ తరగతి, సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ స్కూల్, కర్నూలు

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com



వినేష్ ఫోగట్‌కు రజతం

బిష్కెక్ (కిర్గిస్తాన్) : ఇక్కడ జరుగుతున్న ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన వినేష్ ఫోగట్ రజత పతకం సాధించింది. గురువారం జరిగిన 50 కేజీల విభాగం (ఫ్రీస్టయిల్) ఫైనల్లో చైనాకు చెందిన చున్ లై 3-2తో వినేష్ ఫోగట్‌పై విజయం సాధించింది. దీంతో వినేష్ రజతంతో సరిపెట్టుకోవాల్సివచ్చింది. ఈ టోర్నీలో భారత్‌కు ఇది మూడో పతకం. గురువారం ముందుగా జరిగిన సెమీ ఫైనల్లో జపాన్‌కు చెందిన యుకి ఇరైపై వినేష్ ఫోగట్ విజయం సాధించింది. ఈ తరువాత ఫైనల్ బంగారు పతకం కోసం చైనాకు చెందిన చున్ లైతో వినేష్ తలపడింది. అలాగే ఈ టోర్నీలో మరో భారత మహిళా రెజ్లర్ సంగీతా కాంస్య పతకం కోసం 59 కేజీల విభాగంలో కొరియాకు చెందిన జులైన్‌తో తలపడుతుంది. కార్వర్స్ ఫైనల్స్‌లో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన నబిరా ఈసెంబీవా చేతిలో 15-5లో సంగీత పరాజయం చెందింది. అలాగే 55 కేజీల విభాగంలోనూ భారత్‌కు చెందిన లలిత మంగోలియా రెజ్లర్ దవచిమెగ్ ఈఖేంబయర్ చేతిలో ఓటమి చవిచూసింది. కాగా, ఈ టోర్నీలో ఇప్పటి వరకూ భారత్ రెండు కాంస్య పతకాలు సాధించింది. 82 కేజీల విభాగంలో హర్‌ప్రీత్ సింగ్ ఉజ్బెకిస్తాన్ రెజ్లర్ ఖషింబెకోవ్‌పై విజయం సాధించి కాంస్యం సాధించాడు. 55 కేజీల విభాగంలో ఉజ్బెకిస్తాన్ మిరఖమెదోవ్‌పై విజయం సాధించడంతో రాజేంద్ర కుమార్‌కు కాంస్యం లభించింది.

ప్రశాంత కర్మాకర్‌పై మూడేళ్ల నిషేధం



న్యూఢిల్లీ : పారా స్విమ్మర్ ప్రశాంత్ కర్మాకర్‌పై భారత పారా ఒలింపిక్ కమిటీ (పిసిఐ) మూడేళ్ల నిషేధం విధించింది. గత ఏడాది జైపూర్‌లో జరిగిన జాతీయ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో మహిళా సిమ్మర్ల వీడియోలు తీసినట్లు రుజువుకావంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో మూడేళ్లపాటు ప్రశాంత్ కర్మాకర్ ఏ టోర్నీల్లో పాల్గొనేందుకు వీలు లేదు. మహిళా స్విమ్మర్ల తల్లిదండ్రుల నుంచి లిఖిత పూర్వకంగా వచ్చిన ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టారు. విచారణలో ఇది నిజమని తేలడంతో ఈ కఠిన నిర్ణయం తీసుకోవల్సి వచ్చింది. ప్రపంచ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న, పతకం సాధించిన ఏకైక భారత పారా స్విమ్మర్‌గానూ ప్రశాంత్ కర్మాకర్ రికార్డు నెలకొల్పాడు. 2003 అర్జెంటీనాలో జరిగిన ప్రపంచ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో అతను ఈ ఘనత దక్కించుకున్నాడు. 2010 కామెన్వెల్త్ గేమ్స్‌లోనూ అతను పతకం సాధించాడు. అంతేకాకుండా 16 ఏళ్ల పాటు వరసగా జాతీయ సిమ్మింగ్ చాంపియన్‌గా నిలిచాడు. దేశానికి ఎన్నో పతకాలు తీసుకొచ్చన ప్రశాంత్ 2016లో రియో పారాఒలింపిక్స్‌కు వెళ్లిన స్విమ్మింగ్ జట్టుకు కోచ్‌గా కూడా బాధ్యతలు నిర్వహించాడు. 2011లో అర్జున, 2015లో మేజర్ ధ్యాన్‌చంద్, 2014లో భీమ్ అవార్డులు అందుకున్నాడు.



ఎసిఎ స్టేడియంలో తలపడుతున్న ఆంధ్రా-గోవా జట్లు

గోవాపై ఆంధ్రా విజయం

సెంచరీతో చెలరేగిన శ్రీకాంత్

కేరళపై కర్నాటక విజయం

ప్రజాశక్తి - కడప

అండర్-25 దక్షిణ భారత అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నీమెంట్‌లో గురువారం ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో గోవాపై ఆంధ్రా జట్టు 199 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆంధ్రా నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 400 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆంధ్రా జట్టులోని కె.శ్రీకాంత్ చెలరేగిపోయి ఆడటంతో జట్టు భారీ స్కోరు సాధించింది. 135 బంతుల్లో 18 బౌండరీలు, 2 సిక్సర్లతో 153 పరుగులు సాధించాడు. గుల్ఫమ్‌సలేహ్ 68(62), శ్రీరాం 37(34), శివచరణ్ 36(19) పరుగులు చేశారు. గోవా జట్టులోని మల్లిక్‌సాబ్ షిరూర్ 4(62), ఓం ప్రకాష్ చౌహాన్ 1(54) వికెట్లు తీసుకున్నారు. అనంతరం 401 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన గోవా జట్టు 43.2 ఓవర్లలో 201 పరుగులకు ఆలౌట్ అయింది. గోవా జట్టులోని శివం అమోన్‌కర్ 66(69), మల్లిక్‌సాబ్ 60(66), వైభవ్ 39(27) పరుగులు చేశారు. ఆంధ్రా జట్టులోని మనోహర్ 3(32), సురేంద్ర క్రిష్ణ 3(65), స్టీఫెన్ 2(33) వికెట్లు తీసుకున్నారు. ఈ మ్యాచ్ విజయంతో ఆంధ్రా ఖాతాలో నాలుగు పాయింట్లు చేరాయి.

కేరళపై కర్నాటక విజయం

కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కేరళపై 4 వికెట్ల తేడాతో కర్నాటక విజయం సాధించి 4 పాయింట్లు దక్కించుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కేరళ 44.2 ఓవర్లలో 189 పరుగులకే ఆలౌట్ అయింది. ఆ జట్టులోని సోఫిన్‌జోసె 51(66), విష్ణుమోహన్ 49(80), బాసిల్ మాథ్యూ 27(22) పరుగులు చేశారు. కర్నాటక జట్టులోని సిద్దార్థ 3(37), కౌషిక్ 2(35), షిమన్‌లోయిస్ 2(32), హరీష్‌కుమార్ 2(38) వికెట్లు తీసుకున్నారు. అనంతరం 190 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కర్నాటక జట్టు 41.5 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 192 పరుగులు సాధించి 4 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆ జట్టులోని నిర్మల్ 48(86)నాటౌట్, ప్రటిన్స్ 35(27), భావేష్ 35(50)నాటౌట్) పరుగులు చేశారు. కేరళ జట్టులోని ఆశిష్‌మాథ్యూ 3(50), అల్బిన్ 2(39) వికెట్లు తీసుకున్నారు.

డిఎస్‌పిగా హర్మన్‌ప్రీత్



ఛండీగర్ : భారత మహిళల క్రికెట్ జట్టు టీ20 కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పంజాబ్ డిప్యూటీ సూపరిటెండెంట్ ఆఫ్ పోలీసు (డిఎస్‌పి)గా బాధ్యతలు చేపట్టారు. గురువారం ఆమె ఈ బాధ్యతలు స్వీకరించారు. పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు(డీజీపీ) సురేష్ అరోరాలు హర్మన్ ప్రీత్ కౌర్ యూనిఫాంకు స్టార్లను పిన్ చేసి ఈ బాధ్యతలు అప్పజెప్పారు. "యంగ్ క్రికెటర్ హర్మన్ ప్రీత్‌కు ఈ బాధ్యతలు అప్పజెప్పడంలో పాల్గొనడం ఎంతో గర్వకారణం. హర్మన్ ప్రీత్ పంజాబ్ పోలీసు విభాగంలో డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. హర్మన్ ప్రీత్ మాకు ఎంతో గర్వకారకంగా నిలిచింది. ఆమె ఇలానే కొనసాగిస్తుందని నేను నమ్ముతున్నా. నా శుభాకాంక్షలు ఆమెతో ఎప్పటికీ ఉంటాయి" అని అమరీందర్ సింగ్ తెలిపారు. గతేడాది జరిగిన ఐసీసీ మహిళల ప్రపంచకప్‌లో భారత జట్టు ఫైనల్‌కు రావడంతో హర్మన్‌ప్రీత్ కీలక పాత్ర పోషించింది. దీంతో ఆమెకు పంజాబ్ ప్రభుత్వం డీఎస్పీ ఉద్యోగం ఇస్తున్నట్లు గత జులైలో ప్రకటించింది. దీంతో ఈ పోలీసు ఉద్యోగం తీసుకునేందుకు గాను హర్మన్ ప్రీత్ తాను చేస్తున్న రైల్వే ఉద్యోగానికి రాజీనామా చేసింది. అయితే పశ్చిమ రైల్వేతో ఐదేళ్ల ఒప్పందం కుదుర్చుకోవడంతో రిలీవ్ చేసేందుకు అధికారులు నిరాకరించారు. అయినా వెళ్లాలనుకుంటే ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం ఐదేళ్ల వేతనం రూ.27 లక్షలు చెల్లించాల్సిందేనని తేల్చి చెప్పారు. ఈ వ్యవహారంలో పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ జోక్యం చేసుకుని, రైల్వే మంత్రి పీయూష్ గోయల్‌కు లేఖ రాస్తూ హర్మన్ సమస్యను వేరే కోణంలో చూడాలని, ఆమె రాజీనామాను ఆమోదించాలని కోరారు.

ముఖ్యమంత్రి లేఖతో దిగివచ్చిన రైల్వే, హర్మన్ ప్రీత్‌తో కుదుర్చుకున్న బాండ్‌ను రద్దు చేసింది. దీంతో పోలీసు ఉద్యోగంలో చేరేందుకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. ఈ క్రమంలో ఆమె గురువారం డీఎస్పీగా పదవీ బాధ్యతలు స్వీకరించింది.

స్మిత్, వార్నర్ అర్ధ సెంచరీలు

దర్బన్ : దక్షిణాఫ్రికాతో గురువారం ఇక్కడ ప్రారంభమైన తొలి టెస్టులో మొదటి రోజున ఆస్ట్రేలియా ఆటగాళ్లు స్టీవెన్ స్మిత్, డేవిడ్ వార్నర్‌లు అర్ధ సెంచరీలతో రాణించారు. దీంతో తొలి రోజు ఆట ముగిసే సరికి ఆస్ట్రేలియా 5 వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. వెలుతురు సరిగా లేని కారణంగా 76 ఓవర్ల వద్దనే తొలి రోజు ఆటను ముగించారు. నాలుగు టెస్టుల ఈ సిరీస్‌లో గురువారం తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్ బాన్‌క్రాఫ్ట్ కేవలం ఐదు పరుగులే చేసి తొలి వికెట్‌గా ఫిలాండర్ బౌలింగ్‌లో నిష్క్రమించాడు. ఈ తరువాత వచ్చిన ఖ్వాజా కూడా ఎక్కువ సేపు క్రీజుల్లో నిలబడలేదు. 14 పరుగులు చేసి రబడ బౌలింగ్‌లో అవుటయ్యాడు. ఈ దశలో మరో ఓపెనర్ డేవిడ్ వార్నర్‌కు, కెప్టెన్ స్మిత్ జతకలిసాడు. ఇద్దరూ జాగ్రత్త ఆడారు. అయితే అర్ధ సెంచరీ తరువాత వార్నర్ మూడో వికెట్‌గా ఫిలాండర్ బౌలింగ్‌లోనే నిష్క్రమించాడు. 79 బంతులు ఎదుర్కొన వార్నర్ ఆరు ఫోర్లతో 51 పరుగులు చేశాడు. వార్నర్ అవుట్‌తో స్మిత్‌కు షాన్ మార్ష్ జత కలిశాడు. జట్టు స్కోరు 151 వద్ద మహారాజ్ బౌలింగ్‌లో స్మిత్ అవుటయ్యాడు. 114 బంతులు ఆడిన స్మిత్ 11 ఫోర్లతో 56 పరుగులు చేశాడు. జట్టు స్కోరు 177 వద్ద మార్ష్‌ను మహరాజ్ 5వ వికెట్‌గా అవుట్ చేశాడు. 96 బంతులు ఆడిన మార్ష్ 6 ఫోర్లతో 40 పరుగులు చేశాడు. ఆట ముగిసే సరికి మిచెల్ మార్ష్ 32 పరుగులు (77 బంతుల్లో 7 ఫోర్లు), టిమ్ పైన్ 21 పరుగులతో (51 బంతుల్లో 3 ఫోర్లు) క్రీజ్‌లో ఉన్నారు.



హోదా కోసం టిడిపి ఎంపీలతో రాజీనామా చేయించాలి

వైసిపి అధికార ప్రతినిధి పార్థసారధి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రత్యేక హోదా కోసం టిడిపి ఎంపీలతో రాజీనామాలు చేయించాలని వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలుసు పార్థసారథి డిమాండ్ చేశారు. విజయవాడలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హోదా సాధన కోసం వైసిపి ఇచ్చిన పిలుపునకు వచ్చిన స్పందన చూసైనా పోరాటం చేస్తారో, లేదో చంద్రబాబు తేల్చుకోవాలన్నారు. హోదాపై పూటకో మాటను కట్టిపెట్టాలన్నారు. ఉద్దేశపూర్వకం గానే స్వార్థంతో కేసుల నుంచి తప్పించుకోవడానికి, పోలవరం ప్రాజెక్టు పేరుతో ముడుపులు, కమీషన్లు దండుకోవడానికే హోదా డిమాండ్‌ను చంద్రబాబు విస్మరించారన్నారు. ప్రతిపక్షనేతగా జగన్ హోదా కోసం ఢిల్లీలో ఆందోళన, గుంటూరులో వారం రోజుల పాటు నిరాహార దీక్ష చేశారన్నారు. కేంద్రం స్పందించకపోతే ఏప్రిల్ 6న వైసిపి ఎంపీలు రాజీనామా చేస్తారని జగన్ ఇప్పటికే ప్రకటించారన్నారు. నలభైఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజలకు మేలు చేసే ఒక్క కార్యక్రమాన్నయినా చంద్రబాబు చేపట్టారా అని ప్రశ్నించారు. కుట్రలు, కుతంత్రాలు, మోసాలు, పదవులు లాక్కోవడం వంటి చర్యలతోనే చంద్రబాబు రాజకీయ జీవితం గడిచిపోయిందన్నారు.

పార్లమెంట్‌లో హోదా బిల్లు పెట్టాలి

ఆర్టీసి ఎస్‌డబ్ల్యూఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మార్చిలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ప్రత్యేక హోదా బిల్లు పెట్టాలని ఆర్టీసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె జిలానీబాషా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య, ప్రచార కార్యదర్శి ఎం అయపరెడ్డి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా ఉద్యమానికి మద్దతు తెలుపుతున్నామని వారు ప్రకటించారు. ప్రత్యేక హోదాకు ఆర్థిక సంఘాన్ని అడ్డు చూపుతున్నారని, హోదాకు ప్రత్యామ్నాయంగా ప్యాకేజీ అని పేరు పెట్టి ప్రత్యేక సాయంతో సరిపెడుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించారని తెలిపారు. ప్రత్యేక హోదా ఉన్న ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లో బిజెపి, టిడిపి నాయకులు పారిశ్రామికవేత్తలుగా మంచి లాభాలు పొందారని, ప్రత్యేక హోదా కోసం పోరాటం చేసే హక్కు ప్రజలకు ఉందని పేర్కొన్నారు. విభజన చట్టంలోని అంశాలన్నింటినీ అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని తెలిపారు.

జయేంద్ర సరస్వతికి అంతిమ వీడ్కోలు

ప్రముఖుల నివాళి



జయేంద్ర సరస్వతి మహాసమాధి కార్యక్రమం

ప్రజాశక్తి - తిరుపతి ప్రతినిధి

కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి పార్థివదేహానికి శాస్త్రోక్తంగా పూజలు జరిపి మహాస్వామి బృందావనం పక్కనే గురువారం మహాసమాధి చేశారు. దాదాపు నాలుగు గంటల పాటు ఉత్తర పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి అభిషేక కార్యక్రమం, అనంతరం వేదమంత్రాల మధ్య బృందావన ప్రవేశ క్రతువు నిర్వహించారు. టిటిడి నుంచి గంధపు చెక్కలు, పరిపట్టాన్ని టిటిడి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అందించారు. కేంద్రమంత్రులు పొన్ను రాధాక్రిష్ణన్, సదానందగౌడ్, దేవాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావు నివాళులర్పించారు. మహాసమాధి కార్యక్రమంలో టిటిడి శ్రీవారి ఆలయ ఓఎస్‌డి శేషాద్రి, బొక్కసం సూపరింటెండెంట్ గురురాజారావు పాల్గొన్నారు.

తెలంగాణ టిడిపిని మీరే నడపండి



అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బరాయుడును పరామర్శిస్తున్న సిఎం చంద్రబాబు, లోకేశ్

మా కుటుంబాల నుంచి ఎవరూ రారు

స్పష్టం చేసిన చంద్రబాబు

ఎన్నికల సమయంలోనే పొత్తులు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

'తెలంగాణలో టిడిపికి నాయకత్వం వహించడానికి నా కుటుంబం నుంచి కానీ, నందమూరి కుటుంబం నుంచి కానీ ఎవరూ రారు. మీరే పార్టీని నడిపించాలి.' అని పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపి సీఎం చంద్రబాబునాయుడు మరోమారు స్పష్టం చేశారు. పార్టీకి పునర్వైభవం రావాలంటే.. మీ కుటుంబం నుంచి లేదా నందమూరి కుటుంబం నుంచి ఒకరికి బాధ్యతలు అప్పగించాలని తెలంగాణ నేతలు చంద్రబాబును కోరగా.. ఆయన పైవిధంగా వ్యాఖ్యానించారు. తెలంగాణలో మీరే పార్టీని నడపాలని, ఆ దిశగా మీరు సమర్థవంతమైన నేతలుగా ఎదగాలని సూచించారు. తెలంగాణ నేతలతో గురువారం ఆయన హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నడపడంలో ఎదురవుతున్న ఇబ్బందులు, సహకార నిరాకరణ, పార్టీ నేతల వ్యాఖ్యల్ని తెలంగాణ అధ్యక్షుడు ఎల్ రమణ వివరించారు. టిడిపిని టిఆర్ఎస్‌లో విలీనం చేయాలంటూ మోత్కుపల్లి నర్సింహులు చేసిన వ్యాఖ్యల్ని మరోమారు పేర్కొన్నారు. పార్టీకి సమయమివ్వాలంటూ నేతలందరూ కోరారు. పొత్తుల అంశంలో స్పష్టత లేక పోవడం వల్ల, అనేక రకాలుగా ప్రచారం జరుగుతోందని చంద్రబాబుకు తెలిపారు. దీంతో ఇక నుంచి ప్రతి నెలా పార్టీ కార్యక్రమాల్ని సమీక్షిస్తానని చంద్రబాబు వారికి చెప్పారు. మోత్కుపల్లి చేసిన వ్యాఖ్యలపై ఆయన అసహనాన్ని వ్యక్తం చేస్తూ.. పార్టీ ద్వారా అనేక పదవులు పొంది అనుభవించిన వారు.. నష్టం జరిగే విధంగా మాట్లాడడం తగదన్నారు. పొత్తుల అంశం ఎన్నికల సమయంలోనే చర్చిద్దామన్నారు. అన్ని జిల్లాల్లో కమిటీలు వేయాలని, నిరంతరంగా పార్టీ కార్యక్రమాల్ని నిర్వహించాలని ఆదేశించారు. పల్లె పల్లెకు తెలుగుదేశం కార్యక్రమాన్ని కొనసాగించాలన్నారు. అనంతరం మహానాడును లక్ష మందితో నిర్వహిస్తామని ఆ లోగా తెలంగాణలో మూడు భారీ బహిరంగ సభలు నిర్వహిస్తామని టిటిడిపి నేతలు చెప్పారు. ఈ బహిరంగ సభలకు రావాలని చంద్రబాబును వారు కోరారు. సమావేశంలో నేతలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, నామా నాగేశ్వర్‌రావు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, ఎంపీ గరికపాటి మోహన్‌రావు, ఇ.పెద్దిరెడ్డి పాల్గొన్నారు. అంతకు ముందు నగరంలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బరాయుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ కొప్పుల హరీశ్వర్‌రెడ్డిని చంద్రబాబు పరామర్శించారు.

ప్రతి ఒక్కరి జీవితం రంగులమయం కావాలి

ముఖ్యమంత్రి హోలీ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రతి ఒక్కరి జీవితం రంగులమయం కావాలన్నదే హోలీ పండుగ ఉద్దేశమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర ప్రజలకు, దేశ విదేశాల్లోని తెలుగువారికి ఆయన హోలీ, వసంతోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రహ్లాదుణ్ణి అంతం చేయాలని భావించిన హోలిక తానే అగ్నిలో అంతమైందన్న పౌరాణిక గాథ ప్రాచుర్యంలో ఉందని ఆయన గుర్తు చేశారు. దుష్టశక్తులకు ఓటమి తప్పదని, చెడుపై అంతిమంగా మంచి గెలుస్తుందన్న సందేశాన్నిచ్చే పండుగల్లో హోలీ ఒక ప్రధాన పండుగ అని ఆయన వివరించారు. సమాజంలో అందరూ సంతోషంగా ఉండాలని, అసమానతలు లేని సమాజమే తమ ధ్యేయమని అన్నారు. ప్రకృతితో అనుసంధానమైన పండుగ హోలీ అని, వేడుకల్లో చెట్లు, పువ్వులు, బెరడులతో చేసిన రంగులనే వినియోగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

సింగన్న దొర, నాయని మృతి పట్ల సంతాపం

పోలవరం మాజీ ఎమ్మెల్యే సింగన్న దొర, ప్రముఖ రచయిత నాయని కృష్ణమూర్తి మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు సంతాపం తెలిపారు. ప్రజానీకానికి, తెలుగుదేశానికి సింగన్నదొర ఎనలేని సేవలందించారని గుర్తు చేశారు. మాబడి, పాఠశాల వంటి మాస పత్రికలు నిర్వహించిన కృష్ణమూర్తి మార్గదర్శిగా నిలిచారని సిఎం తెలిపారు.

ఆర్టీసి గుర్తింపు సంఘానికి ఎన్నికలు నిర్వహించాలి

9న రాష్ట్ర వ్యాప్తంగా గేట్ మీటింగ్‌లు

కార్మిక శాఖ కమిషనర్‌కు ఆర్టీసి ఇయు వినతి



కార్మిక శాఖ కమిషనర్‌కు లేఖ అందజేస్తున్న ఇయు నాయకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టీసిలో ప్రస్తుతమున్న గుర్తింపు సంఘం గడువు ఈ నెల 3తో పూర్తి కానున్నందున ఎన్నికలు నిర్వహించాలని ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ (ఇయు) రాష్ట్ర కమిటీ నాయకులు కార్మిక శాఖ కమిషనర్ డి వరప్రసాద్‌కు గురువారం ఛాలెంజ్ లేఖ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇయు ప్రధాన కార్యదర్శి కె పద్మాకర్ మాట్లాడుతూ గత గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఉద్యోగుల్ని మభ్యపెట్టి గెలిచిన ఎన్ఎంయు ఒక్క హామీని కూడా అమలు చేయలేకపోయిందని, 2017 ఏప్రిల్ 1నుంచి వేతనాల సవరణను కూడా చేయలేకపోయిందన్నారు. వేతనాల సవరణ గడువు దాటిపోయి ఏడాది కావస్తున్నా కమిటీని వేయించుకోలేకపోయారన్నారు. వేతనాల సవరణకు జాప్యం జరుగుతున్నందున తక్షణమే ఇంటీరియం రిలీఫ్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసి కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలని, రావాల్సిన డిఎను చెల్లించడంతో పాటు 60 రోజుల సమ్మెకాలం వేతనాన్ని చెల్లించాలని, తొలగించిన కాంట్రాక్టు కండక్టర్, డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ యాజమాన్యానికి కూడా లేఖ ఇచ్చామన్నారు. డిమాండ్ల సాధన కోసం ఈ నెల 9న రాష్ట్ర వ్యాప్తంగా గేట్ మీటింగులు నిర్వహిస్తున్నామన్నారు. లేఖ అందజేసిన వారిలో ఇయు రాష్ట్ర అధ్యక్షులు వైవి రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం హనుమంతరావు, అదనపు ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు, కార్యదర్శులు కె బాలజీ, బి కోటేశ్వరరావు, జోనల్ కార్యదర్శి ఎస్‌కె సుబానీ, కృష్ణా రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు చక్రవర్తి, వై శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పి రామకృష్ణ, సహాయ కార్యదర్శి డి వెంకటేశ్వర్లు, సత్యం తదితరులున్నారు.



గుంటూరు జిల్లా తెనాలిలో నందినాటకోత్సవాల్లో భాగంగా ప్రదర్శించిన 'కొత్త చిగురు' నాటికలోని సన్నివేశం

ఆకట్టుకున్న 'కొత్త చిగురు'

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

నంది నాటకోత్సవాల్లో భాగంగా గుంటూరు జిల్లా తెనాలిలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న ప్రదర్శనలు ఆద్యంతం సందేశాత్మకంగా సాగుతున్నాయి. గురువారం ఒక నాటకం, రెండు నాటికలను ప్రదర్శించారు. తొలిగా 'తేలు కుట్టిన దొంగలు' నాటికను ప్రదర్శించారు. తెలియని వారితో మసలుకునే సందర్భంలో జాగ్రత్తగా ఉండాలనే సందేశాన్ని ఇచ్చింది. 'కొత్త చిగురు' నాటిక ద్వారా చెట్లను పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని, వాటిని నాశనం చేస్తున్న తీరును ప్రదర్శించారు. 'పరిహారం' నాటిక ద్వారా నవమాసాలు మోసి కని పెంచిన తల్లిని కొడుకు నిర్దాక్షిణ్యంగా రోడ్డుపై వదిలేసే ఉదంతం ప్రేక్షకులను కదిలించింది. డబ్బు సంపాదించిన వ్యక్తి తల్లిదండ్రులపైనా వివక్ష పాటించే దురన్యాయాన్ని కళాకారులు చక్కగా ప్రదర్శించారు.

హరిబాబును 48 గంటల్లో అరెస్టు చేయాలి

కారెం శివాజీ

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

టిడిపి దళిత మహిళా నాయకురాలు దర్శి వనరాణిపై దాడిచేసిన పోలవరపు హరిబాబును 48 గంటల్లో అరెస్టు చేయాలని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ ఆదేశించారు. బాధితురాలిని గురువారం పరామర్శించిన ఆయన తహశీల్దార్, పట్టణ సిఐతో మాట్లాడారు. హరిబాబును 48 గంటల్లో అరెస్టు చేయాలని, అతనికి ఎవరైనా ఆశ్రయమిస్తే వారినీ ఆరెస్టు చేయాలని ఆదేశించినట్లు టిడిపి నాయకులు తెలిపారు. బాధితురాలికి రూ.4 లక్షలు పరిహారంగా అందించాలని తహశీల్దార్ వసంతబాబును కోరారు. ఇదిలా ఉండగా దాడిని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గంజి చిరంజీవి విలేకర్ల సమావేశంలో ఖండించారు. ఇప్పటికే హరిబాబును జిల్లా అధ్యక్షులు సస్పెండ్ చేశారని, దళిత నాయకులు 'దళిత తేజం'లో పాల్గొనాలని కోరారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68